శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ


నింబాల్కర్ హత్యకేసులో నిందితులు నిర్దోషులు

చిన్నారుల భవిష్యత్తుతో జూదం ఆడొద్దు

23వ విడత పిఎం కిసాన్ నిధులు విడుదల

07


సంపుటి 29, సంచిక: 2 | ఆదివారం | 21-06-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00





నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

## అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశపర్చండి

● మెట్రో రైలు పెండింగ్ అంశాలపై చర్చిద్దాం ● కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సిఎం రేవంత్ రెడ్డి మరో లేఖ ● 22, 23న ఢిల్లీలోనే ఉంటానని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాలపై చర్చించేందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డికి మరోసారి లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్2 విస్తరణకు సంబంధించిన అంశాలు త్వరితగతిన పరిష్కారం కోసం జోక్యం చేసుకోవాలని ఈ నెల 16న రాసిన లేఖను ముఖ్యమంత్రి తాజాగా రాసిన లేఖలో ప్రస్తావించారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి ఐఆర్‌ఎఫ్‌సి నిధుల విడుదలకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారం,

తరువాయి 8లో



హనుమకొండ గుండ్ల సింగారంలో

## పేదల గుడిసెలు

# కూల్చివేత

## రోడ్డున పడ్డ 350 కుటుంబాలు

● నిద్రలేవకముందే రెవెన్యూ సిబ్బంది, 200 మంది పోలీసులు ● ఉదయం 5 గంటల నుండే గుడిసెల నేలమట్టం ● అడ్డుకోబోయిన సిపిఐ నాయకుల అరెస్ట్ ● మండుటెండల్లోనే గుడిసెవాసుల వంటలు

ప్రజాపక్షం/హనుమకొండ

హనుమకొండ గుండ్ల సింగారంలో శనివారం ఉదయం పోలీసులు, అధికారులు వందలాది మంది నివాసం పేదల గుడిసెలను కూల్చి వేశారు. దీంతో గుండ్ల సింగారంలో రోజంతా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. శనివారం ఉదయం 5 గంటలకు హనుమకొండ ఆర్డీవో వెంకటేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది సుమారు 200 మంది పోలీసుల బందోబస్తుతో హనుమకొండ గుండ్ల సింగారంలోని గుడిసెల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. దీంతో సిపిఐ నాయకులు, గుడిసె వాసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా తమకు కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయని అడ్డుకుంటే లీగల్ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులు హెచ్చరించారని గుడిసె వాసులు వాపోయారు. పెద్ద ఎత్తున తరలి వచ్చిన పోలీసులు,రెవెన్యూ సిబ్బంది ఐదు జేసీబీలతో

తరువాయి 12లో

## దుర్మార్గపు చర్య

బాధితులకు పట్టాలిచ్చేవరకు విశ్రమించబోం
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

హనుమకొండ గుండ్ల సింగారంలో శనివారం పేదల ఇళ్ళు కూల్చి వేయడం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం గుండ్ల సింగారంలో పేదల ఇళ్ళు కూల్చివేత విషయం తెలుసుకున్న కూనంనేని సాంబశివరావు హుటా హుటిన హైదరాబాద్ నుండి హన్మకొండకు చేరుకున్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా నాయకులతో కలిసి గుండ్ల సింగారంలో నేలమట్టమైన గుడిసెలను పరిశీలించారు. గుడిసెవాసులను ఓదార్చారు. ఈ సందర్భంగా

తరువాయి 12లో



# నేడు 'నీట్' పునఃపరీక్ష

మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు నిర్వహణ

పరీక్ష సజావుగా, సురక్షితంగా జరిగేందుకు మాక్‌డ్రిల్ నిర్వహించిన అధికారులు



**న్యూఢిల్లీ :** వైద్య ప్రవేశ పరీక్ష అయిన నీట్‌యూజీ 2026 పునఃపరీక్ష ఈనెల 21న జరగనుంది. ఈ నేపథ్యంలో పరీక్ష సజావుగా, సురక్షితంగా, పారదర్శకంగా నిర్వహించే ప్రయత్నాల్లో భాగంగా శనివారం దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్ నిర్వహించామని అధికారులు తెలిపారు. ఢిల్లీలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) కార్యాలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఆగ్రహం, రాజకీయ వాగ్వాదాలు, న్యాయపరమైన సవాళ్లు తలెత్తడంతో అసలు పరీక్ష రద్దయిన దాదాపు ఏడు వారాల తర్వాత, ఆదివారం జరిగే పునఃపరీక్షకు 22.79 లక్షలకు పైగా వైద్య విద్యార్థులు

తరువాయి 8లో

### నాగ్‌పూర్ విద్యార్థికి అబుదాబిలో పరీక్షా సెంటర్

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మరో తప్పిదం చేసింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ఒక విద్యార్థికి ఆదివారం జరగనున్న నీట్ యుజి 2026 పునఃపరీక్ష కోసం అబుదాబిలో పరీక్షా కేంద్రాన్ని కేటాయించింది. దీంతో అతని తల్లిదండ్రులు ఈ విషయాన్ని ఎన్‌టిఎ దృష్టికి తీసుకెళ్లి సవరణ కోరారు. ఆ విద్యార్థి, అబ్దుల్లా తాలిబ్, పరీక్ష కోసం నాగ్‌పూర్, వార్ధా, భండారా కేంద్రాలకు ప్రాధాన్యత ఇచ్చి దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఎన్‌టిఎ జారీ చేసిన అడ్మిట్ కార్డ్ అందుకున్నప్పుడు, తనకు అబుదాబిలో పరీక్షా కేంద్రం కేటాయించబడిందని చూసి అతను షాక్‌కు గురయ్యాడని అతని తండ్రి డాక్టర్ మహమ్మద్ తాలిబ్ ఒక వార్తా ఛానెల్‌తో చెప్పారు. విద్యార్థి తల్లిదండ్రులు ఈ సమస్యను ఎన్‌టిఎ దృష్టికి తీసుకెళ్లగా, వారు కొత్త పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

## 22, 23 తేదీల్లో రాష్ట్రవ్యాప్త రైతు ఆందోళనలు!

ఎరువులు, ఇంధన ధరలు తగ్గించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచిన ఎరువులు, పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని, రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను ఒకే విడతలో రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రకటించింది. అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ పిలుపులో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్లు, ఆర్‌డిఓ,, ఎమ్మార్వో కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించి, వినతి పత్రాలను సమర్పించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు భాగం హేమంతరావు ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ తెలిపారు. ఈ ఆందోళన కార్యక్రమాల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల శాఖల రైతు ప్రతినిధులు, రైతాంగం పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ వారు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన అన్ని రకాల ఎరువుల

తరువాయి 8లో

పళ్లాలు, చెంచాల మోతతో

## దద్దరిల్లిన జంతర్‌మంతర్



● పరీక్షలలో అవకతవకలు, పేపర్ లీక్‌లు, ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేస్తూ సిజెపి నిరసన ప్రదర్శన ● ప్రధాన్ రాజీనామా చేసేదాకా జంతర్‌మంతర్ వదలను ● సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** పరీక్షలలో అవకతవకలు, పదే పదే పేపర్ లీక్‌లు, ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) శనివారం రెండవ సారి జంతర్‌మంతర్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించింది. నిరసన ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, మద్దతుదారులు పాల్గొన్నారు. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసేంత వరకు తాను జంతర్ మంతర్‌ను విడిచిపెట్టబోనని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రతిజ్ఞ చేశారు. నిరసన కొనసాగించడానికి అనుమతి ఇవ్వాలని ఢిల్లీ పోలీసులను కోరారు. ప్రభుత్వం నుండి సమాధానాలు కోరుతూ విద్యార్థులు నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శించడంతో, భారీ పోలీసు బందోబస్తు మధ్య ఈ నిరసన మొదలైంది.'థాలి, చమ్మచ్' (పళ్ళాలు, చెంచాలు) తీసుకురమ్మన్న బొద్దింకల జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపునకు మద్దతుదారులు స్పందించి, వాటిని నిరసన చిహ్నాలుగా ఉపయోగించి, ప్రదర్శన సమయంలో వాటిని మోగించారు. దీంతో జంతర్‌మంతర్ దద్దరిల్లింది. పరీక్షల నిర్వహణకు సంబంధించిన సమస్యలపై జవాబుదారీతనం కోరుతూ నిరసనకారులు తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించడంతో, ఆ ప్రదేశంలో 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి' అనే నినాదాలు మారుమోగాయి. నిరసన ప్రదేశానికి చేరుకున్న దీప్కేకు విద్యార్థులు, మద్దతుదారుల నుండి భారీ హర్షధ్వానాలు వినిపించాయి. నిరసనలలో మద్దతుదారులు బొద్దింకల ముసుగులు ధరించి, ప్లకార్డులను ప్రదర్శించారు. వాటిలో కొన్నింటిపై 'చెవిటివారు వినాలంటే, శబ్దం చాలా బిగ్గరగా

తరువాయి 12లో

## హోర్ముజ్ జలసంధి మళ్ళీ మూసివేత



● లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకార చర్య ● జియోనిస్టు దాడుల నిలిపివేత బాధ్యత అమెరికాదే ● ఇరాన్ మిలిటరీ ఖతమ్– అల్ కేంద్ర కార్యాలయం ప్రకటన

**టెహ్రాన్ :** లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులకు నిరసన వ్యక్తం చేస్తూ హోర్ముజ్ జలసంధిని మళ్ళీ మూసివేసినట్లు ఇరాన్ శనివారం ప్రకటించింది. లెబనాన్‌లో శనివారం తెల్లవారక ముందుగానే భారీస్థాయిలో డ్రోన్లు, యుద్ధ విమానాలతో దాడులు చేసి 47 మంది పౌరులను ఇజ్రాయెల్ దళాలు హతమార్చాయి. ఈ దాడిని ఇజ్రాయెల్ అధికారికంగా ధృవీకరించింది. ''హోర్ముజ్ ''నౌకా రవాణా కు అందుబాటులో లేకుండా జలసంధిని మూసేస్తున్నామని ప్రకటిస్తున్నాం, శత్రువు వాగ్దాన భంగానికి ఇది మొదటి ప్రతిస్పందన, దురాక్రమణ కొనసాగితే, శత్రువు తన బాధ్యతలు పాటించేలా చేసేందుకు మరింత ఒత్తిడి చేస్తాం, ఒత్తిడి చేయడంకోసం ప్రణాళిబద్ధంగా మరిన్ని చర్యలు తీసుకుంటాం అని గమనించాలి'' అని ఇరాన్ మిలిటరీ ఖతమ్–అల్ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. హోర్ముజ్ జలసంధి యుద్ధం ఆరంభం నుండీ ఐఆర్‌జిసి దళాల అధీనంలో ఉంది. ఇదిలా ఉండగా, ఈ విషయంపై మాట్లాడేందుకు అధికారిక మధ్యవర్తిదేశం పాకిస్థాన్ హోంమంత్రి మొహిసిన్ నక్వి హుటాహుటిన టెహ్రాన్‌కు బయలుదేరి వెళ్ళారు. ఇరాన్ విదేశీవ్యవహారాల మంత్రి అబ్బాస్ అరాఘ్చీతో సమావేశం జరిపారు. ఐతే అమెరికా ఒక ప్రకటన చేస్తూ

తరువాయి 8లో



## ముదిరిన ఘర్షణలు

● విమానాలు, డ్రోన్లతో లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ● ఐడిఎఫ్ సైనికులు సహా 51మంది మృతి : అమెరికా ఖండన ● 23న లెబనాన్– ఇజ్రాయెల్ సమావేశం

**బీరూట్ :** దక్షిణ లెబనాన్‌లో శనివారం తెల్లవారకముందే ఇజ్రాయెల్ సైన్యం డ్రోన్లు, యుద్ధ విమానాలతో చేసిన దాడుల్లో 51 మంది మరణించినట్లు లెబనాన్ మీడియా ప్రకటించింది. మరణించిన వారిలో ఐడిఎఫ్ ట్యాంక్ బెటాలియన్ కమాండర్ మరో ముగ్గురు ఇజ్రాయెలీ సైనికులు,47 మంది లెబనాన్ పౌరులు ఉన్నారు. యాభై ప్రొజెక్టైల్స్‌తో హెజ్బొల్లా గ్రూపు తమపై దాడులు చేయడంవల్లనే హెజ్బొల్లా ఉగ్రవాదుల స్థావరాలపై ఎదురు దాడులు చేసినట్లు ఐ.డి.ఎఫ్ ప్రకటించింది. ఈ చర్యలను అమెరికా

తరువాయి 8లో

అమెరికా కాన్సులేట్ రోడ్డుకు

## ట్రంప్ పేరు వద్దు

22న నిరసనలకు లెఫ్ట్ పార్టీల పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర రాజధాని కేంద్రమైన హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ వద్ద ఒక ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ పేరుతో డొనాల్డ్ ట్రంప్ అవెన్యూగా పెట్టాలని రేవంత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఈనెల22న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ లోని బాబూజగ్జీవన్‌రాం విగ్రహం నుండి ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించనున్న నిరసన ప్రదర్శనలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశాయి.

## విద్యార్థులకు 'విజయ' పాలు

● 27 లక్షల మందికి అందిస్తాం ● పాడి రైతులకు బకాయిలు లేకుండా బిల్లులు చెల్లిస్తాం ● డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న రైతులను ఆదుకోవడంతో పాటు, విజయ డైరీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రజా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పాల ఉత్పత్తులపై ఆధారపడిన వారి జీవితాలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ నుంచి పాలను సరఫరా చేసే అంశంపై పశుసంవర్ధక శాఖా మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి సచివాలయంలో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు విజయ పాలను అందిస్తామన్నారు. దీనికోసం క్షేత్రస్థాయికి వెళ్లి పాలిచ్చే పశువుల అసలు సంఖ్య, వాస్తవ పాల ఉత్పత్తిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పాడి రైతులకు ఎలాంటి

తరువాయి 12లో

## 'సర్'కు సంసిద్ధం

● 25 నుంచి ఇంటింటికీ ఎన్యూమరేటర్లు ● నెల రోజుల పాటు బిఎల్‌ఓల తనిఖీ ● ఫామ్ నింపకపోతే ముసాయిదా జాబితాలో పేరు గల్లంతే ! ● రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎస్.సుదర్శన్ రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ, అనుసంధాన ప్రక్రియకు ఎన్నికల సంఘం రంగం సిద్ధం చేసింది. ఈ నెల 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'ఎన్యుమరేషన్ ఫేజ్' నిర్వహించనున్నారు. బూత్ లెవెల్ అధికారులు (బిఎల్‌ఓలు) ప్రతి ఇంటికి భౌతికంగా వెళ్లి ఎన్యుమరేషన్ ఫారమ్‌ను పంపిణీ చేస్తారని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎస్.సుదర్శన్ రెడ్డి తెలిపారు. వచ్చేనెల 25 లోపు ఈ ఫారమ్‌లను ఖచ్చితంగా తిరిగి సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు పొడిగింపు ఉండదన్నారు.

**ఒకే ఇంట్లో నలుగురు ఓటర్లు ఉంటే 8 ఫారమ్స్**

ఎన్యూమరేషన్ ప్రక్రియలో భాగంగా ప్రతి ఓటరు రెండు ఫారమ్స్ నింపాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒకే ఇంట్లో నలుగురు ఓటర్లు ఉంటే, బిఎల్‌ఓలు మొత్తం 8 ఫారమ్స్ తీసుకొస్తారు. రెండింటిపై ఓటరు సంతకం చేయాలి. అందులో ఒక పత్రాన్ని రసీదుగా బిఎల్‌ఓ సంతకం చేసి ఓటరుకు ఇవ్వగా,

తరువాయి 8లో

నరహరి భార్య లాకర్‌లో

## రూ.1.50 కోట్ల నగదు

రెండు కిలోల బంగారం, వజ్రాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ సర్వే ల్యాండ్ రికార్డ్స్ విభాగం మల్టీ జోన్–2 డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి రావుపై నమోదైన అక్రమాస్తుల కేసు దర్యాప్తులో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) మరో కీలక విషయాన్ని బయటపెట్టింది. ఇప్పటికే జ్యుడీషియల్ నిర్బంధంలో ఉన్న నరహరి రావుకు సంబంధించిన కేసులో, ఆయన భార్య పేరుతో ఉన్న రెండు బ్యాంకు లాకర్లపై శనివారం హైదరాబాద్‌లోని శాలిబండ కెనరా బ్యాంకు శాఖలో ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. కోర్టు నుంచి సెర్చ్ వారెంట్లు పొందిన

తరువాయి 12లో

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
ఆదివారం
21-06-2026
www.prajapaksham.in

# ఎడిట్ పేజీ
PEOPLE'S VIEWS

# పాప్‌కార్న్



## వరల్డ్‌కప్‌లో కొత్త సెలబ్రిటీ!








అమెరికా, కెనడాతోపాటు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న మెక్సికోలో జరుగుతున్న ఫుట్‌బాల్ ప్రపంచకప్ సందర్భంగా అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్న వారిలో ఆటగాళ్లు మాత్రమే కాదు, ఒక చిన్న కుక్క కూడా ఉంది. ఎనిమిదేళ్ల వయసున్న రెస్క్యూ పూడిల్ మిశ్రమ జాతికి చెందిన 'ఒసిటో'అనే కుక్క ప్రస్తుతం ప్రపంచకప్‌లో అనధికారిక సెలబ్రిటీగా మారింది. ఈ కుక్క తన యజమాని జార్జి రాంజెల్‌తో కలిసి మెక్సికో సిటీ వీధుల్లో ప్రత్యేక కార్గో సైకిల్‌పై ప్రయాణిస్తున్నది. ప్రపంచకప్ ప్రారంభ మ్యాచ్ సందర్భంగా ఒసిటోను మెక్సికో జట్టు జెర్సీ, సన్‌గ్లాసెస్, టోపీతో అలంకరించి స్టేడియం వద్దకు తీసుకువెళ్లారు. వేలాదిమంది అభిమానులు ఒసిటోతో ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. కొద్ది గంటల్లోనే దాని వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. రెండేళ్లుగా ఒసిటో తన యజమానితో కలిసి రోజువారీ సరుకుల పంపిణీ పనుల్లో పాల్గొంటోంది. మొదట సరదాగా సైకిల్‌పై తీసుకెళ్లినప్పుడు కుక్కకు అది నచ్చడంతో, ప్రత్యేక సీటు ఏర్పాటు చేసి ప్రతిరోజూ వెంట తీసుకెళ్లడం ప్రారంభించాడు. ఇప్పుడు నగరంలో వీరిద్దరూ ఒక గుర్తింపు పొందిన జంటగా మారిపోయారు. ఒసిటోను ఎన్నో సంవత్సరాల క్రితం దత్తత తీసుకున్న రాంగెల్, తన జీవితంలో కష్టకాలంలో ఈ కుక్క తనకు భావోద్వేగపరమైన బలంగా నిలిచిందని చెబుతున్నాడు. 'ఒక జంతువును ప్రేమించడం అంటే ఏమిటో ఒసిటో నా జీవితంలోకి వచ్చిన తర్వాతే తెలుసుకున్నాను' అని ఆయన పేర్కొన్నాడు. ప్రపంచకప్ నేపథ్యంలో ఒసిటోకు వచ్చిన ఖ్యాతి కంటే, ఒక మనిషి, అతని పెంపుడు జంతువు మధ్య ఉన్న అనుబంధమే ప్రజలను ఎక్కువగా ఆకట్టుకుంటోంది. క్రీడల సంబరాల మధ్య ఈ మధురమైన స్నేహబంధం ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి ఆనందాన్ని పంచుతోంది.

## కొత్త విధానంతో వివాదం



ఫిఫా సాకర్ ప్రపంచకప్ 2026లో తొలిసారిగా అమలు చేస్తున్న 'హెడ్ టు హెడ్' (పరస్పరం ఢీకొనడం) టైబ్రేకర్ నిబంధన పెద్ద చర్చకు దారితీసింది. గత ప్రపంచకప్‌లలో రెండు లేదా అంతకంటే ఎక్కువ జట్లు సమాన పాయింట్లతో ముగిస్తే, ముందుగా 'గోల్స్ తేడా' (చేసిన గోల్స్ ఎన్ని..ఇచ్చిన గోల్స్ ఎన్ని) ఆధారంగా ర్యాంకు లు నిర్ణయించేవారు. కానీ ఈసారి ఫిఫా మొదటి ప్రమాణంగా జట్ల మధ్య జరిగిన ప్రత్యక్ష మ్యాచ్ ఫలితాన్ని పరిగణిస్తోంది. ఈ మార్పు కారణంగా కొన్ని ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఉదాహరణకు, టర్కీ, హైతీ వంటి జట్లు తమ గ్రూప్‌లలో ఇతర జట్లతో సమాన పాయింట్లు సాధించినప్పటికీ, ప్రత్యక్ష పోటీల్లో ఓడిపోవడం వల్ల నష్టపోయాయి. హైతీ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించడానికి ఈ నిబంధ నే కారణమని, గోల్ డిఫరెన్స్ విధానం అమలులో ఉంటే వారి అవకాశాలు మెరుగ్గా ఉండేవని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నిబంధనకు మద్దతుదారులు మాత్రం, 'రెండు జట్ల మధ్య ఎవరు మెరుగో తెలుసుకోవడానికి వారి ప్రత్యక్ష పోటీ ఫలితమే సరైన ప్రమాణం' అని వాదిస్తున్నారు. దీంతో జట్లు గ్రూప్ దశలో ప్రతి మ్యాచ్ ను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాల్సి వస్తుంది. అయితే విమర్శకులు మరో కోణా న్ని ప్రస్తావిస్తున్నారు. ఒక జట్టు మొత్తం టోర్నమెంట్‌లో ఎక్కువ గోల్స్ చేసి, మెరుగైన ప్రదర్శన కనబరిచినా, ఒక్క ప్రత్యక్ష మ్యాచ్ ఫలితం కారణంగా నిష్క్రమించాల్సి రావడం అన్యాయమని అంటున్నారు. దీంతో గోల్ డిఫరెన్స్ వంటి దీర్ఘకాలిక ప్రదర్శన సూచికకు ప్రాధాన్యం తగ్గిపోయిందని వారు భావిస్తున్నారు. మొత్తంగా చూస్తే, 'హెడ్ టు హెడ్' నిబంధన ప్రపంచకప్ గ్రూప్ దశను మరింత ఉత్కంఠభరితంగా మార్చినప్పటికీ, కొన్ని జట్లకు తీవ్ర నిరాశను మిగిల్చింది. భవిష్యత్తులో ఈ విధానం కొనసాగాలా లేదా అనే చర్చ ఫుట్‌బాల్ ప్రపంచంలో మరింత వేడెక్కే అవకాశం ఉంది.

## 'వార్'తో ఇబ్బందులు




ఇప్పుడు జరుగుతున్న ఫిఫా ప్రపంచకప్‌లో వీడియో అసిస్టెంట్ రిఫరీ (విఎఆర్/వార్) అధికారాలను విస్తరించడం ఫుట్‌బాల్ ప్రపంచంలో పెద్ద చర్చకు దారితీసింది. గతంలో 'వార్'ను ప్రధానంగా గోల్స్, పెనాల్టీలు, రెడ్ కార్డులు, పొరపాట్లు చేసిన ఆటగాళ్లను హెచ్చరించడం వంటి సందర్భాలలో మాత్రమే ఉపయోగించేవారు. అయితే ఇప్పుడు దాని పరిధిని మరింత పెంచారు. కొత్త నిబంధనల ప్రకారం, రిఫరీ తప్పు ఆటగాడికి ఎల్లో కార్డు చూపించినా లేదా పొరపాటున కార్నర్ కిక్ ఇచ్చినా, 'వార్' జోక్యం చేసుకుని నిర్ణయాన్ని మార్చగలదు. దీని ఉద్దేశ్యం మానవ తప్పిదాలను తగ్గించి మరింత న్యాయమైన ఫలితాలను సాధించడం. అయితే ఈ మార్పులు కొన్ని మ్యాచ్‌లలో గందరగోళానికి కూడా కారణమయ్యాయి. ఆట కొనసాగుతున్న సమయంలో 'వార్' సమీక్షల కోసం తరచుగా విరామాలు రావడం వల్ల మ్యాచ్ ప్రవాహం దెబ్బతింటోందని కొందరు కోచ్‌లు, ఆటగాళ్లు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా కార్నర్ కిక్‌లు లేదా ఎల్లో కార్డుల వంటి చిన్న నిర్ణయాలపై కూడా వీడియో సమీక్ష జరగడం వల్ల ఆట సహజ వేగం తగ్గుతోందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, ఈ మార్పులకు మద్దతుదారులు మాత్రం ఇది సరైన దిశలో తీసుకున్న అడుగని అంటున్నారు. ఎందుకంటే ఒక తప్పు ఎల్లో కార్డు భవిష్యత్తులో సస్పెన్షన్‌కు దారితీయవచ్చు. అలాగే తప్పుగా ఇచ్చిన కార్నర్ కిక్ కూడా గోల్‌కు కారణమయ్యే అవకాశం ఉంది. అందువల్ల అలాంటి పొరపాట్లను సరిదిద్దడం న్యాయసమ్మతమని వారు వాదిస్తున్నారు. ఏదిఏమైనా, కొత్త 'వార్' అధికారాలు ఫుట్‌బాల్‌లో ఖచ్చితత్వాన్ని పెంచే ప్రయత్నమే. కానీ మ్యాచ్‌ల వేగం, ప్రేక్షకుల అనుభవం, రిఫరీల స్వతంత్ర నిర్ణయాధికారంపై వాటి ప్రభావం గురించి ఇంకా చర్చ కొనసాగుతోంది. ప్రపంచకప్ ముగిసేనాటికి ఈ కొత్త విధానం ఎంతవరకు విజయవంతమైందో స్పష్టమైన అంచనా వచ్చే అవకాశం ఉంది.

**– బిఎస్ఎస్ మైత్రేయి**

# ఎంపిల మాటల ఫిరాయింపులు

నవ్విపోదురు గాక... నాకేటి సిగ్గు అనే సామెత చందంగా ఉంది ఫిరాయింపు లోక్‌సభ సభ్యుల సమర్థనలు. శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాక్రే) పార్టీ నుంచి ఫిరాయింపునకు సిద్ధమైన ఆరుగురు ఎంపిలలో ఒకరు నిన్న తొలిసారిగా పెదవి విప్పారు. ఉస్మానాబాద్ నియోజకవర్గ లోక్‌సభ సభ్యుడైన ఓంరాజె నింబాల్కర్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు రానందుకే పార్టీ మార్పునకు సిద్ధపడినట్లు చెప్పడం విడ్డూరంగా ఉంది. తాను ప్రతిపక్షంలో ఉన్నందున అభివృద్ధి నిధులు రావటం లేదని చెప్పారు. అందుకే తనకు మరో ప్రత్యామ్నాయం లేదని సమర్థించుకునే ప్రయత్నం చేశారు. ఇప్పటికే తాము ఎన్‌సిపిఐ పార్టీలో విలీనమైనట్లు లోక్‌సభ స్పీకర్‌కు లేఖ అందించిన 20 మంది టిఎంసి తిరుగుబాటు ఎంపిలు తాము కట్టుతప్పటానికి సరైన కారణాలు చెప్పలేక మీడియాకు ముఖం చాటేస్తున్నారు. తమ ఫిరాయింపులకు కారణాలు వెతుక్కునే క్రమంలో, టిఎంసి పార్లమెంటరీ పార్టీ నాయకుడు అభిషేక్ బెనర్జీ ఒంటెత్తు పోకడ, టిఎంసి పాలనలో జరిగిన అక్రమాలు అంటూ సంజాయిషీలు చెప్పుకుంటున్నా అతకడం లేదు. ఎందుకు వారు మీడియా ముందుకు వచ్చేందుకు సాహసించటం లేదు. కొంత మంది నియోజకవర్గ అభివృద్ధి అని చెప్పుకుంటున్నారు.

శివసేన (యుబిటి) ఎంపి నింబాల్కర్, కొంతమంది టింఎంసి ఎంపిలు చెబుతున్నట్లుగా నియోజకవర్గ అభివృద్ధి అనేది కుంటిసాకుగానే కనబడుతోంది. ఎందుకంటే, ఈ రెండు పార్టీల ప్రాతినిధ్యం ఉన్న మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ఇప్పుడు బిజెపి ముఖ్యమంత్రులే ఉన్నారు. అంటే, డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటే అభివృద్ధి శరవేగంగా దూసుకుపోతుందని ప్రధాని మొదలు బిజెపి వారు పదే పదే చెబుతుంటారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలోనూ బిజెపి ప్రభుత్వాలే ఉన్నప్పుడు నియోజకవర్గ అభివృద్ధి అంటూ రెబెల్ ఎంపిలు చెబుతున్న కారణం విచిత్రంగా ఉంది. పైగా తాము ప్రతిపక్షంలో ఉన్నందున నిధులు రావడం లేదంటున్నారు. కానీ, వారు ప్రాతినిధ్యం వహించే లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోనే శాసనసభ సెగ్మెంట్‌లలో అత్యధికులు బిజెపి, దాని తాజా మిత్రపక్ష ఎంఎల్‌ఏలే అధికం. అలాంటప్పుడు నిధులు రావడం లేదనే కారణం నిలబడదు. ఒకవేళ నిజమనే భావిస్తే, దేశాన్ని, రాష్ట్రాన్ని సమానంగా చూడాల్సిన ప్రభుత్వ బాధ్యులు ప్రతిపక్ష నియోజకవర్గాల పట్ల వివక్ష చూపుతుండడం రాజ్యాంగ వ్యతిరేకమే. దీనిపై గట్టిగా నిలదీయడం, వివిధ వేదికల్లో ఎత్తిచూపటం మార్గమే తప్ప అధికార పార్టీలోకి ఫిరాయించటమే ఏకైక మార్గమనుకుంటే ప్రజాస్వామ్యమేమి మిగులుతుంది.

ముంబైలో శుక్రవారం శివసేన 60వ ఆవిర్భావ వేడుకలు ఆ పేరుతో ఉన్న రెండు పార్టీలు ఘనంగా నిర్వహించుకున్నాయి. కొందరు ఎంపిలు తమ శివసేనను కాంగ్రెస్‌లో విలీనం చేస్తారని, అది ఇష్టం లేకే పార్టీ ఫిరాయిస్తున్నట్లు చెప్పడాన్ని శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాక్రే కొట్టిపారేసారు. అదే నిజమైతే తాము ముప్పై ఏళ్ళు కలిసి పని చేసిన బిజెపిలో ఎందుకు విలీనం చేయలేకపోయామని రెబెల్స్‌ను అడిగిన ప్రశ్న సమంజసంగానే ఉంది. ఒకవేళ శివసేనను కాంగ్రెస్ పార్టీలోనే విలీనం చేయాలని భావిస్తే, రెబెల్స్ ఎంపిలకు అనుకోని అదృష్టం లాంటిదే. ఎందుకంటే వారిపై ఎట్టి పరిస్థితిలో ఫిరాయింపు నిరోధక చట్టం వర్తించదు. మాతృపార్టీ ఇతర పార్టీలలో విలీనమవడం ఇష్టం లేని ఎంపిలు, లేదా ఎంఎల్‌ఏలు ప్రత్యేక గ్రూపుగా ఉండవచ్చు, అలా కాకుండా స్వతంత్రంగా వ్యవహరించవచ్చని ఆ చట్టం స్పష్టంగా చెబుతోంది. ప్రస్తుతం మూడింట రెండొంతుల మంది ఎంపిలు ఉంటే విలీనం సాధ్యమని నిబంధనను తప్పుగా అన్వయించుకొని, గోడ దూకాలని చూస్తున్న ఎంపిలు అనర్హత వేటు నిబంధనను ఎదుర్కోక తప్పదు. స్పీకర్ విచారణ, కోర్టు కేసులు ఎదుర్కోక తప్పదు. తీర్పు సానుకూలంగా వచ్చే వరకు ఫిరాయింపుదారులకు టెన్షన్ తప్పదు.

శివసేన ఆవిర్భావ దినోత్సవాన్ని మరోచోట చేసిన మహారాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఫిరాయింపుల గురించి గొప్పగా చెప్పుకొచ్చారు. ఇప్పుడు చూసింది ట్రైలర్ మాత్రమేనని, ఇంకా సినిమా చాలా ఉందన్న ఆయన వ్యాఖ్యలు రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్న వ్యక్తికి ఏ మాత్రం శోభనివ్వవు. అయినప్పటికీ, బహిరంగంగానే ఫిరాయింపులను ప్రోత్సహించే విధంగా సంకేతాలిచ్చేందుకు మొహమాట పడకపోవడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. ఫిరాయింపుల అంశంలో మరో చిత్రమైన అంశం వెలుగులోకి వచ్చింది. టిఎంసి, శివసేన (యుబిటి)నుంచి ఫిరాయించిన ఎంపిలు తమకు ప్రజల్లో మద్దతుందని ఘనం గా చెప్పుకుంటున్నారు. అదే సమయంలో వారికి ఆయా రాష్ట్ర ప్రభుత్వా లు భద్రతను పెంచాయి. మరోవైపు టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ, దాడులు ఎదుర్కొన్న అభిషేక్ బెనర్జీ సహా, ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులకు రక్షకుల సంఖ్యతను కుదించి, వారి భద్రతను గాలిలో దీపంలా మార్చేస్తున్నారు.

లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో స్వంతంగా మెజారిటీ రాకపోవడం, మహిళా రిజర్వేషన్ బిల్లు ముసుగులో నియోజవర్గాల సంఖ్య పెంపు, పునర్విభజన బిల్లులు లోక్‌సభలో ఓడిపోవడంతో అహం దెబ్బతిన్న ప్రభుత్వ అగ్ర నాయక ద్వయం ఫిరాయింపులకు తెరలేపిందనేది వాస్తవం. ఈ ఆటలో ఇతర పార్టీల కప్పదాట్లతో బలాన్ని పెంచుకున్న మోదీ ప్రభుత్వానికి నిన్న మొన్నటి వరకు ఊపిరినందించిన తెలుగుదేశం పార్టీ, జనతాదళ్ (యు)లతో పని తీరిపోయింది.

ఇప్పటికే జెడి(యు) అధినేత నితీశ్ కుమార్‌ను బిహార్ సిఎం పదవికి రాజీనామా చేయించి, రాజ్యసభ కు పంపించారు. కాబట్టి ఎన్‌డిఏలో ఉన్నప్పటికీ టిడిపికి నిశ్చింత అని అనుకోలేము. టిఎంసి ఎంపిల ఫిరాయింపు ఆపరేషన్‌లో టిడిపి మాజీ ఎంపి, బిజెపిలో చేరిన ప్రస్తుత అనకాపల్లి ఎంపి సి.ఎం.రమేశ్‌ను బిజెపి నేతలు కీలకంగా వాడుకోవటం విస్మరించలేనిది. శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ ఆరోపిస్తున్నట్లుగా 'డబ్బులతో ఎంపిలను కాజేస్తున్నారు.'డబ్బు రాజకీయాలను శాసిస్తున్న ఈనాటి రాజకీయాల్లో విలువలు కోల్పోతున్న ప్రజాస్వామ్యం వలవల రోదిస్తోంది!

# అమెరికా – ఇరాన్ ఒప్పందం

# పశ్చిమాసియాలో మారనున్న అధికార ప్రాబల్యం



డాక్టర్ బి.కె.కాంగో
సిపిఐ కేంద్ర కార్యదర్శి

జూన్ 17న అమెరికా, ఇరాన్‌ల మధ్య అవగాహన ఒప్పందం (ఎంఒయు)పై సంతకాలు జరిగాయి. ఈ నేపథ్యంలో గత కొన్ని నెలలుగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ వాతావరణం ముగిసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ యుద్ధం పశ్చిమాసియా ప్రాంతాన్ని మాత్రమే కాకుండా మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, అంతర్జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసినందున, ప్రపంచమంతా ఈ అవగాహన ఒప్పందం కోసం ఎదురుచూసింది. ఈ ఒప్పందం వాస్తవంలో అమలు జరిగితే, ఇది కేవలం కాల్పుల విరమణ మాత్రమే కాకుండా, ఈ మొత్తం సంఘర్షణ రాజకీయ పరిణామాలను కూడా నిర్దేశిస్తుంది.

ఇరాన్ అణ్వాయుధాల తయారీ వైపు అడుగులు వేయడం లేదని అమెరికాకు స్వయంగా తెలిసిన సమయంలోనే ఈ యుద్ధం ప్రారంభమైంది. ఇరాన్ తక్షణమే అణుబాంబును తయారుచేసే ఎలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని అంతర్జాతీయ సంస్థలు, చాలామంది నిపుణులు కూడా అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, అమెరికా ఇజ్రాయెల్ తో కలిసి ఇరాన్‌పై సైనిక చర్య మార్గాన్ని ఎంచుకుంది. ఈ దాడిలో వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. భారీ విధ్వంసం జరిగింది. హోర్ముజ్ జలసంధి మూసివేత ప్రపంచవ్యాప్త ఆర్థిక సంక్షోభం భయాలను సృష్టించింది. చమురు ధరలు పెరిగాయి, ప్రపంచ సరఫరా గొలుసులు దెబ్బతిన్నాయి, యుద్ధం మరింత విస్తరిస్తుందేమోనని ప్రపంచమంతా ఆందోళన వ్యక్తం చేసింది.

క్రమంగా, ఈ యుద్ధం కేవలం ఇరాన్, అమెరికాలకు మాత్రమే పరిమితం కాలేదు. ప్రతీకార చర్యగా ఇరాన్ గల్ఫ్ దేశాలలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. మరోవైపు, లెబనాన్‌పై ఇజ్రాయెల్ తన దాడులను తీవ్రతరం చేసింది. దక్షిణ లెబనాన్‌లోని పెద్ద భాగాలను ఆక్రమించుకుని, వేలాదిమంది ప్రాణాలు తీసింది. ఫలితంగా, మొత్తం పశ్చిమాసియా ఒక విస్తృత ప్రాంతీయ యుద్ధం అంచునకు చేరుకుంది. ఇలాంటి సమయంలో అమెరికా–ఇరాన్ ఒప్పందం ప్రాముఖ్యత పెరుగుతుంది. ఈ ఒప్పందంలోని అత్యంత ముఖ్యమైన నిబంధనలలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ తిరిగి తెరవడం, ఇరాన్ ఓడరేవులపై విధించిన దిగ్బంధనాన్ని అమెరికా తొలగించడం ఉంది. ప్రపంచ చమురు సరఫరాలో ఎక్కువ భాగం ఈ మార్గం గుండానే వెళుతుంది కాబట్టి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇది చాలా అవసరం. ఒకవేళ జలసంధిని తిరిగి తెరిస్తే, అంతర్జాతీయ మార్కెట్లలో మళ్లీ స్థిరత్వం రావచ్చు.

### అతి పెద్ద ప్రశ్న

అతి పెద్ద ప్రశ్న ఏమిటంటే: ఈ మొత్తం యుద్ధం నుండి అమెరికా సాధించింది ఏమిటి?

ఇరాన్ ఇంతకుముందు అణుబాంబును తయారు చేయలేనప్పుడు, నేటికీ అదే పరిస్థితి ఉన్నప్పుడు, అమెరికా ఏ విజయాన్ని సొంతం చేసుకోగలదు? వాస్తవానికి, ఈ యుద్ధం అమెరికాకు ఒక రాజకీయ, వ్యూహాత్మక సంక్షోభంగా మారింది. చర్చలు, దౌత్య ప్రయత్నాలు జరుగుతున్న సమయంలోనే అమెరికా యంత్రాంగం ఈ దాడిని ప్రారంభించింది. ఇది అంతర్జాతీయ స్థాయిలో అమెరికా విశ్వసనీయతకు తీవ్రమైన దెబ్బ తీసింది.

నిజానికి, అమెరికా ఈ యుద్ధాన్ని ముగించాలనుకుంది, కానీ ఇరాన్‌ను లొంగదీసుకోవాలని భావించింది. సైనిక ఒత్తిడి కారణంగానే ఇరాన్ చర్చల బల్ల వద్దకు వచ్చిందని నిరూపించడమే దాని లక్ష్యం. అయితే, పరిస్థితులు ఆ దిశగా సాగలేదు. ఇరాన్ రాజకీయంగా లొంగలేదు, సైనికంగా ఓడిపోలేదు. దీనికి విరుద్ధంగా, సుదీర్ఘ సంఘర్షణ తర్వాత, అమెరికానే స్వయంగా ఒప్పందం వైపు అడుగులు వేయాల్సిన పరిస్థితిలో పడింది. ఈ ప్రతిపాదిత ఒప్పందం అత్యంత ముఖ్యమైన రాజకీయ వాస్తవం ఇదే. అమెరికా నిజంగానే తాను ప్రకటించిన యుద్ధ లక్ష్యాలను సాధించి ఉంటే, దానికి ఇంత త్వరగా ఒప్పందం చేసుకోవాల్సిన అవసరం ఉండేది కాదు. కాబట్టి, ఈ ఒప్పందం అమెరికా సాధించిన విజయం కంటే దాని బలం యొక్క పరిమితులను ఎక్కువగా ఎత్తిచూపుతుంది.

ఈ మొత్తం సంఘర్షణను విస్తృత భౌగోళిక రాజకీయ కోణంలో చూస్తే, మరొక ముఖ్యమైన ముగింపు కనిపిస్తుంది. ఈ యుద్ధం తర్వాత అమెరికా, ఇజ్రాయెల్‌లు సాపేక్షంగా బలహీనమైన, రక్షణాత్మక స్థితిలో ఉన్నట్లు కనిపిస్తుండగా, పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ఇరాన్ అత్యంత ప్రభావవంతమైన శక్తిగా అవతరించింది. యుద్ధానికి ముందు, ప్రాంతీయ శక్తి సమతుల్యత గురించి అనేక అంచనాలు ఉండేవి. అయినప్పటికీ, అమెరికా, ఇజ్రాయెల్ ఒత్తిడిలో కూడా ఇరాన్ సైనిక ప్రతిఘటననే కాకుండా, తన రాజకీయ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోగలదని ఈ సంఘర్షణ నిరూపించింది. అమెరికా, ఇజ్రాయెల్‌ల ఉమ్మడి సైనిక శక్తి ఉన్నప్పటికీ, ఇరాన్‌ను రాజకీయంగా లొంగదీసుకోలేకపోయారు, దాని ప్రాంతీయ పాత్రను బలహీనపరచలేకపోయారు. దీనికి విరుద్ధంగా, ఈ యుద్ధం ఇరాన్ వ్యూహాత్మక సామర్థ్యాలను, రాజకీయ సంకల్పాన్ని, ప్రాంతీయ ప్రభావాన్ని మరింత బలోపేతం చేసింది. నేడు పర్షియన్ గల్ఫ్‌లో, విస్తృత పశ్చిమాసియా రాజకీయాలలో ఇరాన్ పాత్ర మునుపటి కంటే చాలా నిర్ణయాత్మకంగా కనిపిస్తోంది. బహుశా ఇది యుద్ధం యొక్క అతిపెద్ద మరియు అనూహ్యమైన ఫలితం.

కాబట్టి, యుద్ధం అసలు ఫలితాలను నిష్పాక్షికంగా అంచనా వేస్తే,



అమెరికా, ఇజ్రాయెల్‌లు తాము ప్రకటించిన లక్ష్యాలను సాధించాయని చెప్పడం కష్టం. దీనికి విరుద్ధంగా, ఈ సంఘర్షణ ఇరాన్ ప్రాంతీయ స్థానాన్ని బలోపేతం చేసింది, దాని అంతర్జాతీయ ప్రతిష్టను పెంచింది, పశ్చిమాసియా అధికార నిర్మాణంలో దానిని ఒక కేంద్ర స్తంభంగా నిలబెట్టింది.

### ఇజ్రాయెల్ సంక్లిష్టత

ఇజ్రాయెల్ పరిస్థితి కూడా తక్కువ సంక్లిష్టంగా ఏమీ లేదు. తన భద్రతకే అత్యంత ప్రాధాన్యత అని ఇజ్రాయెల్ నిరంతరం ప్రకటించుకుంటుంది. అయితే, ఆచరణలో ప్రస్తుత ఇజ్రాయెల్ నాయకత్వానికి యుద్ధమే ఒక రాజకీయ అవసరంగా మారింది. అంతర్గత సంక్షోభాల నుండి తప్పించుకోవడానికి ఇజ్రాయెల్ అధికార నిర్మాణం పదేపదే సైనిక ఘర్షణలపైనే ఆధారపడిందని ఇటీవలి సంవత్సరాల అనుభవాలు చూపుతున్నాయి. ఈ కారణంగా, యుద్ధాన్ని ముగించడం కంటే దానిని పొడిగించడానికే అది ఎక్కువ ఆసక్తి చూపుతున్నట్లు కనిపిస్తోంది.

అందుకే, ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు అధికారికంగా అమెరికా–ఇరాన్ ఒప్పందానికి మద్దతుగా మాట్లాడుతున్నప్పటికీ, ఈ ఒప్పందాన్ని దెబ్బతీయడానికి లేదా బలహీనపరచడానికి ఇజ్రాయెల్ సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేస్తుందనే విస్తృత ఆందోళన ఉంది. లెబనాన్ నుండి పూర్తిగా ఉపసంహరించుకోవాలని, అక్కడ యుద్ధాన్ని ముగించాలనే ఇరాన్ డిమాండ్ కూడా ఈ సందర్భంలో ముఖ్యమైనది.

ఒక ఆసక్తికరమైన నిజం ఏమిటంటే, అమెరికాలో ఇజ్రాయెల్‌కు పూర్వం ఉన్నంత మద్దతు ఇప్పుడు లేదు. గత కొన్ని సంవత్సరాలుగా, ముఖ్యంగా యువకులు, విద్యార్థులు, ప్రగతిశీల సమూహాలలో ఇజ్రాయెల్ విధానాలపై అసంతృప్తి వేగంగా పెరిగింది. ఇటీవలి స్థానిక ఎన్నికలలో ఇజ్రాయెల్ వ్యతిరేక వైఖరిని తీసుకున్న అభ్యర్థుల విజయం ఈ మారుతున్న ప్రజల అభిప్రాయాన్ని సూచిస్తుంది. న్యూయార్క్ వంటి ముఖ్యమైన నగరంలో ఇజ్రాయెల్ విధానాలను విమర్శించే రాజకీయ నాయకత్వం ఆవిర్భవించడం కూడా ఈ మార్పుకు చిహ్నంగా భావించవచ్చు. కాబట్టి, ఇజ్రాయెల్ ఇప్పుడు బాహ్య రంగంలోనే కాకుండా, తన అతిపెద్ద మిత్రదేశమైన అమెరికాలోనే సైద్ధాంతిక సవాళ్లను ఎదుర్కొంటోంది.

ఈ యుద్ధం అత్యంత ముఖ్యమైన, బహుశా అత్యంత విచిత్రమైన పరిణామాలలో ఒకటి ఇరాన్ అంతర్గత రాజకీయాలలో చూడవచ్చు.

యుద్ధానికి ముందు, ఇరాన్ ఛాందసవాద ప్రభుత్వం తీవ్రమైన ప్రజల అసంతృప్తిని ఎదుర్కొంటోంది. ఆర్థిక కష్టాలు, సామాజిక కట్టుబాట్లు, రాజకీయ అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలు వీధుల్లోకి వచ్చారు. అనేక నగరాల్లో నిరంతర ప్రదర్శనలు జరుగుతుండటంతో ప్రభుత్వం విస్తృత వ్యతిరేకతను ఎదుర్కొంది. పాలనలోని అగ్రనాయకత్వాన్ని తొలగిస్తే, ప్రతిపక్షం బలోపేతం అవుతుందని, అధికార మార్పిడికి పరిస్థితులు ఏర్పడవచ్చని చాలామంది పరిశీలకులు విశ్వసించారు.

### చరిత్ర నేర్పిన ముఖ్యమైన పాఠం

కానీ జరిగింది మాత్రం అందుకు పూర్తి విరుద్ధం.

అమెరికా, ఇజ్రాయెల్‌ల దాడులు ఇరాన్‌కు లోపల ఉన్న రాజకీయ విభేదాలను పూర్తిగా వెనక్కి నెట్టేశాయి. విదేశీ దురాక్రమణ నేపథ్యంలో జాతీయవాద భావాలు ఉద్భవించాయి. జనాభాలోని అధిక భాగం ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. గతంలో ప్రభుత్వాన్ని విమర్శించిన వారు కూడా విదేశీ జోక్యాన్ని వ్యతిరేకించడానికే ప్రాధాన్యత ఇచ్చారు. ఈ విధంగా, ఇరాన్ పాలనను ఇబ్బంది పెడుతున్న ప్రజా అసంతృప్తి, తిరుగుబాటు అవకాశాన్ని ఇరాన్ ప్రభుత్వం కాకుండా, అమెరికా మరియు ఇజ్రాయెల్‌లు సైనిక దాడులే అణచివేసాయి. ఇది చరిత్ర నేర్పిన ఒక ముఖ్యమైన పాఠం. విదేశీ జోక్యం తరచుగా ప్రజాస్వామ్యాన్ని లేదా అధికార మార్పిడిని తీసుకురాదు.బదులుగా, అది ఏ ప్రభుత్వాలను బలహీనపరచాలని భావిస్తుందో, వాటినే మరింత బలోపేతం చేస్తుంది. ఇందుకు ఇరాన్ తాజా ఉదాహరణ. నేడు, ఇరాన్ పాలన యుద్ధానికి ముందు కంటే మరింత వ్యవస్థీకృతంగా, చట్టబద్ధంగా, బలం గా కనిపిస్తోంది.

భారతదేశానికి కూడా, ఈ మొత్తం పరిణామం కొన్ని ఇబ్బందికరమైన ప్రశ్నలను లేవనెత్తింది. భారతదేశం – ఇరాన్ మధ్య సంబంధాలు కేవలం ఆధునిక దౌత్య సంబంధాలు మాత్రమే కావు. ఇరు దేశాల మధ్య వేల సంవత్సరాలుగా సాంస్కృతిక, నాగరికత, వాణిజ్య, రాజకీయ సంబంధాలు ఉన్నాయి. ఇరాన్ మునుపెన్నడూ లేని సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో, భారత ప్రధాన మంత్రి ఇజ్రాయెల్ పర్యటన అంతర్జాతీయ స్థాయిలో ప్రతికూల సందేశాన్ని పంపింది.

### భారత్ విదేశాంగ విధాన డొల్లతనం

మరింత ముఖ్యమైన విషయమేమిటంటే, ప్రధాన మంత్రి పర్యటన ముగిసిన మరుసటి రోజే ఇజ్రాయెల్, అమెరికాలు ఇరాన్‌పై దాడి చేశాయి. ఇది భారతదేశ ప్రయోజనాలను, భావోద్వేగాలను అమెరికా కానీ, ఇజ్రాయెల్ కానీ ముఖ్యమైనవిగా పరిగణించలేదనే భావనను సృష్టించింది. అదే సమయంలో, ప్రపంచంలోని చాలా భాగాలలో, భారతదేశం వాస్తవానికి ఇజ్రాయెల్ ప్రాంతీయ విధానాల పట్ల సానుభూతితో ఉందనే సందేశం కూడా వెళ్లింది. ఈ భావన సరైనదా కాదా అనేదానితో సంబంధం లేకుండా, విదేశాంగ విధానంలో భావనలు కూడా వాస్తవ రాజకీయ ప్రభావాలను చూపుతాయి. కాబట్టి, ఈ మొత్తం ఉదంతం భారతదేశ విదేశాంగ విధానంలో ఒక ముఖ్యమైన వైఫల్యాన్ని బహిర్గతం చేస్తుంది. భారతదేశం చారిత్రక సంబంధాలను కలిగి ఉన్న దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పుడు, ఇజ్రాయెల్‌తో భారతదేశం మితిమీరిన సాన్నిహిత్యాన్ని ప్రదర్శించడం సహజంగానే అనేక ప్రశ్నలను లేవనెత్తుతుంది.

చివరగా, ఈ మొత్తం యుద్ధం అతిపెద్ద ముగింపు ఏమిటంటే, యుద్ధం ఏ ప్రాథమిక సమస్యను పరిష్కరించడంలోనూ విజయం సాధించలేదు. అమెరికా తాను ప్రకటించిన లక్ష్యాలను సాధించలేదు, ఇజ్రాయెల్ తన దీర్ఘకాలిక భద్రతను సురక్షితం చేసుకోలేదు, పశ్చిమాసియాలో రాజకీయ అనిశ్చితి కూడా తొలగిపోలేదు. దీనికి విరుద్ధంగా, యుద్ధం కొత్త ఉద్రిక్తతలను, కొత్త శత్రుత్వాలను, కొత్త అనిశ్చితులను సృష్టించింది.

శాంతి ఒప్పందం విజయవంతమైతే, అంతిమంగా చర్చలు, దౌత్యం ద్వారానే సంక్లిష్టమైన అంతర్జాతీయ వివాదాలను పరిష్కరించవచ్చనడానికి అది నిదర్శనం అవుతుంది. యుద్ధం విధ్వంసాన్ని తీసుకురాగలదే తప్ప, శాశ్వత శాంతిని కాదు. కాబట్టి భారతదేశంలోని, మానవత్వం కలిగిన ప్రతి బాధ్యతాయుతమైన పౌరుడు ఈ ఒప్పందాన్ని స్వాగతించాలి. భవిష్యత్తులో ఆర్థిక ప్రయోజనాలు, భౌగోళిక రాజకీయ పోటీలు లేదా వ్యూహాత్మక ప్రతిష్టల పేరుతో ఏ దేశమూ యుద్ధంలోకి నెట్టి వేయబడకూడదని ఆశిద్దాం.

# ఆరోగ్యానికి యోగాభ్యాసనం

యోగాసనాలు, ప్రాణాయామము, సూర్య నమస్కారములు మనలను దృఢంగా, ఆరోగ్యంగా, మేధోవంతులుగా చేస్తాయి. యోగాసనాలను సాధన చేసే వ్యక్తులు ఆరోగ్యంగా, ప్రశాంతంగా, సంతోషంగా ఉంటారనడంలో సందేహం లేదు. 'చిత్తవృత్తులను నిరోధించి మనసును శాంతంగా ఉంచేందుకు యోగశాస్త్రాన్ని, అర్థవంతమైన భావ ప్రకటనకు వ్యాకరణాన్ని, శరీరంలోని రోగాలను నయం చేయడానికి వైద్య శాస్త్రాన్ని ప్రపంచ మానవాళికి బహుమతిగా అందించినటువంటి, ప్రాచీన మహార్షులలో ప్రసిద్ధి పొందిన పతంజలి మహర్షి గొప్ప యోగ గురువు గా చెప్పుకోవాలి. 'యోగము' అనగా సంస్కృతం లో ఐక్యత లేక విలీనం అని అర్థం. యోగాభ్యాసం యొక్క లక్ష్యం శరీరానికి, మనస్సుకు, శ్వాసకు సమతుల్యం సాధించడం. దీని అంతిమ లక్ష్యం, ఆత్మసాక్షాత్కారం పొందడమే. యోగ శాస్త్రం 5 వేల ఏండ్లకన్నా పురాతనమైనదని పండితుల అభిప్రాయం. యోగ శాస్త్రం ఆరోగ్యకరమైన జీవనానికి చాలా ఉపయోగపడుతుందనీ, ఇది చాలా అభివృద్ధి చెందిందనీ, శాస్త్రీయమైనదనీ చాలామంది యోగశాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఈ శాస్త్రం శతాబ్దాల తరబడి అధ్యయనం చేయబడి పరిపూర్ణత్వాన్ని పొందినది.

**యోగ శాస్త్ర విధానాలు – పద్ధతులు**

యోగ శాస్త్రం ఆవిర్భవించినప్పటి నుండి, గత కొన్ని శతాబ్దాలుగా వివిధ రకాలైన యోగభ్యాసాలు, పద్ధతులు ప్రపంచంలో వృద్ధి చెందాయి. అష్టాంగ యోగము, హఠయోగము, కుండలినీ యోగము, రాజయోగము, కర్మ యోగము, భక్తి యోగము, జ్ఞాన యోగము, తంత్ర యోగము, మంత్ర యోగము వీటిలో కొన్ని విధానాలు. వీటిలో ప్రతి ఒక్కదానికి ఒక ప్రయోజనం ఉన్నదని యోగాభ్యాస అధ్యాపకులు చెపుతున్నారు.

మన శరీరంలోని శక్తిని తెలివైన పద్ధతిలో నియంత్రించడమే యోగాభ్యాసం యొక్క ఉపయోగాలను పూర్తిగా పొందడంలోని రహస్యం. మన మనసును నియంత్రించడం ద్వారా మన ప్రవర్తనను సాధించాల్సి ఉంటుంది. ఇది మన ప్రవర్తనలోను, సామాజిక పరిచయాలలోనూ, ఇంద్రియ సంబంధిత అనుభవాలలోనూ, తెలివితేటలలో నూ, సానుకూల దృక్పథంలోను మార్పులు తీసుకొస్తుంది.

ప్రస్తుత కాలంలో యోగాభ్యాసము ప్రపంచం నలుమూల ప్రసిద్ధి పొందింది. అనారోగ్యం వలన, ఉద్రిక్తత వల న, ఒత్తిడి వలన వచ్చే సమస్యలను అధిగమించడానికి, దానికి కావలసిన శక్తిని సరైన మార్గంలో పెట్టడానికి పనికి వచ్చే పద్ధతులు మనకు యోగ శాస్త్రంలో లభిస్తాయి. యోగాభ్యాసం చేసే మహర్షులు..యోగాసనాలపై లోతుగా విశ్లేషించిన వాళ్లు చెప్పుతున్న దాన్నిబట్టి

* శరీరాన్ని ఆరోగ్యవంతంగా చేసే 200 పైచిలుకు ఆసనాలు, భంగిమలు, శ్వాసక్రియలు హఠయోగంలో పేర్కొనబడినవని, యోగశాస్త్రం ప్రకా రం మానవ జీవితానికి ముఖ్యమైన శక్తి లేక ప్రాణం శ్వాస కాబట్టి ఈ శ్వాస క్రియను నియంత్రించే ప్రక్రియైన ప్రాణాయామంను హఠయోగం లో ఎక్కువగా వాడుతారని వివరించుతున్నారు.

* యోగాసనాలు ఒక రకమైన వ్యాయామం కింద తరచూ భావించబడుతున్నాయి. యోగాసనాలు వ్యాయామం కాదు. అవి అవగాహన, విశ్రాంతి, ఏకాగ్రత, ప్రేరణ, ధ్యానం మొదలైన వాటిని నేర్చుకోవడానికి మన శరీరాన్ని తయారు చేసే పద్ధతులు. కనుక శరీరం, మనస్సు రెండింటినీ మేళవించి యోగసాధన చేయాలని వివరించుతున్నారు.

* పతంజలి మహర్షి వ్రాసిన 'యోగ సూత్రాల'లో వివరించిన మాదిరిగా యోగ శాస్త్రం మానసిక, శారీరక, ఆధ్యాత్మిక ఆరోగ్యం కోసం ప్రాథమిక సూత్రాలు, ఆచరణలతో కూడిన 8 భాగాలుగా విభజించబడింది. మొదటి నాలుగు అంగాలు శరీరాన్ని, మనసును ఒకే త్రాటిపైకి తెచ్చేందుకు కావలసిన మానసిక, శారీరక అభ్యాసాలతో కూడిన బాహ్య ప్రక్షాళన గురించి విశదీకరిస్తాయి. మిగిలిన నాలుగు అంగా లు ధ్యానం యొక్క వివిధ దశలను విపులీకరిస్తాయి. 'అంతర్జాతీయ యోగా దినం' ప్రతి సంవత్సరం జూన్ 21న నిర్వహించుకోవాలని ఐక్యరాజ్యసమితి 2014 అక్టోబర్ 14న 177 దేశాలు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయి.

**యోగా ప్రాచీన కళ :** 5000 సంవత్సరాల నుండి వస్తున్న యోగాకళను ప్రపంచానికి చికాగో నగరంలో 1893లో జరిగిన సర్వమత సమ్మేళనంలో భారతదేశం నుండి పాల్గొన్న స్వామి వివేకానందుడు పరిచయం చేశాడు. అప్పటి నుండి ప్రపంచ దేశాలు యోగాభ్యాసాన్ని పాటిస్తూ, లక్షల మంది ఆరోగ్యాలను కాపాడుకుంటున్నారు. 2015లో ప్రారంభమైన యోగా దినోత్సవాల ద్వారా ప్రపంచ ప్రజలు యోగాను పాటించి లాభం పొందుతున్నారు. భారతీయ సంస్కృతిలో యోగాను భాగం చేసిన ఘనత 'యోగా ఆధునిక పితామహుడు' 'పతంజలి'కే దక్కింది. పతంజలి రూపొందించిన యోగ శాస్త్రం 196 యోగ సూత్రాల ద్వారా మానవాళి ఆరోగ్యం సంరక్షణలో ఎంతగానో దోహదపడుతుంది. అంతర్జాతీయ యోగా దినం సందర్భంగా ప్రజలలో యోగా పట్ల అవగాహన కల్పించడం, ఆరోగ్యకర సమాజ స్థాపన, మానసిక ప్రశాంతత, శారీరక మానసిక వికాసానికి ఊతమివ్వడం, స్వయం నియంత్రణతో సాఫీగా సాగడం లాంటి ప్రయోజనాలను పొందవచ్చు.

**ఉజ్జిని రత్నాకర్ రావు,**
9490952646

*(జూన్ 21 యోగా దినోత్సవం సందర్భంగా)*

పునర్ నిర్వహిస్తున్న 'నీట్ పరీక్ష'లో విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు, ఒత్తిళ్లకు గురికాకుండా పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్ష రాయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. విద్యార్థులందరూ తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన శనివారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు.


తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) విభాగము

ఫారం-VII

(డిక్లరేషన్ / రూఢి ప్రకటన)

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైనపరిహారాన్ని పొందే హక్కు చట్టం - 2013,(కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ నం.25(1) అనుసరించి)

కలెక్టర్ ఫైల్ నం. G3/1268/2018 — తేది: 17.06.2026
రెవెన్యూ డివిజనల్ అధికారి గారి ఫైల్ నం. H/390/2026 — తేది: 16.06.2026
గెజిట్ నెంబరు. : 56/2026 — తేది: 17.06.2026

తెలంగాణ ప్రభుత్వము / జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి ఆదేశానుసారం ఈ దిగువ నిర్దిష్టపరచిన సిద్దిపేట జిల్లా, కొమురవెల్లి మండలములోని కొమురవెల్లి అయినాపూర్, పోసాన్ పల్లి గ్రామ పరిధిలో ఉన్న భూమి విస్తీర్ణం ఎ. 31.25 1/2 గుంటల ప్రజా ప్రయోజనము నిమిత్తము అనగా జె చొక్కారావు దేవాదుల ప్రాజెక్టు కుడి కాలువ మరియు ఎడమ కాలువ నిర్మాణం నిమిత్తము ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించినందున భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2003 లోని సెక్షన్ 19(1) అనుసరించి ఈ ప్రకటన జారీ చేయనైనది.
కావున సిద్దిపేట జిల్లా,కొమురవెల్లి మండలములోని కొమురవెల్లి అయినాపూర్, పోసాన్ పల్లి గ్రామ పరిధిలో విస్తీర్ణము ఎ. 31.25 1/2 గుం.లు గల భూమి ఈ క్రింది అనుబంధములో చూపిన వానిని పైన చూపబడిన ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైనందున భూసేకరణ నిమిత్తము ప్రకటన (డిక్లరేషన్) జారీచేయనైనది.

| క్రమ సంఖ్య | నోటిఫికేషన్ క్రమ సంఖ్య | సర్వే నం. | పట్టా రకం | భూమి స్వభావం | సేకరణ చేయు విస్తీర్ణము (ఎ.గుం.) | భూమి పట్టాదారు / అనుభవదారు పేరు మరియు చిరునామా | తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | నిర్మాణములు / వృక్షములు ఇతరములు (సంఖ్య మరియు రకముతో సహా) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | కొమురవెల్లి గ్రామము 1LA-D3-LMC | | | | | | |
| 1 | 1 | 438 | ప్రభుత్వ భూమి (అసైన్డ్ పట్టా) | ఖుష్కీ | 19.37 1/4 | అసైన్డ్ దార్ / ఇతరులు | 438 | 458 | 452 | 438 | |
| 2 | 2 | 441/A/1/3/1/1 | పట్టా | ఖుష్కీ | 0.28 1/2 | పాశంకిష్టమ్మ భర్త సిద్ధయ్య | 440 | 442 | 441 | 442 | |
| 3 | 3 | 442/B/2/1/2 | పట్టా | ఖుష్కీ | 0.07 | 1. కోల అన్న రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి | 440 | 438 | 441 | 438 | |
| 4 | 3 | 442/B/2/2 | పట్టా | ఖుష్కీ | 0.07 | 2. పండి సంపత్ యాదవ్ తండ్రి వెంకటయ్య | 440 | 438 | 441 | 438 | |
| 5 | 3 | 442/B/3/1/1 | పట్టా | ఖుష్కీ | 0.07 | 3. నాలువలు రవీందర్ తండ్రి కిషన్ పటేల్ | 440 | 438 | 441 | 438 | |
| 6 | 3 | 442/B/4/1/1 | పట్టా | ఖుష్కీ | 0.07 | 4. బుర్ర జలజ భర్త మదు సూదన్ రెడ్డి | 440 | 438 | 441 | 438 | |
| 7 | 3 | 442/B/4/2 | పట్టా | ఖుష్కీ | 0.07 | 5. వుల్లానగుల ఏకనందం తండ్రి వెంకటరామయ్య | 440 | 438 | 441 | 438 | |
| 8 | 4 | 447/A/2/1 | పట్టా | ఖుష్కీ | 0.25 | 1.జంగపల్లి నారాయణ తండ్రి రాములు | 446 | 438 | 438 | 438 | |
| 9 | 4 | 447/A 3 | పట్టా | ఖుష్కీ | 0.25 | 2.జంగపల్లి రాజయ్య తండ్రి రాములు | 446 | 438 | 438 | 438 | |
| 10 | 4 | 447/A1/1/1/1/1/1/1/1/1/1 | పట్టా | ఖుష్కీ | 0.22 1/2 | 1.జంగపల్లి లక్ష్మ య్య తండ్రి బాలనర్సయ్య మరియు ఇతరులు | 446 | 438 | 438 | 438 | |
| 11 | 5 | 452/A/3/1 | పట్టా | ఖుష్కీ | 0.06 1/4 | సార్ల మీన్నమ్మ భర్త యాదయ్య | 478 | 452 | 477 | 438 | |
| 12 | 5 | 452/B | పట్టా | ఖుష్కీ | 0.06 1/4 | Guniganti Farms PvtLmt@ BUSHARANI | 478 | 452 | 477 | 438 | |
| 13 | 6 | 478/B/1/1 | పట్టా | ఖుష్కీ | 0.00 1/4 | ఓర రామ్మోహన్ తండ్రిరామచంద్రం | 478 | 452 | 477 | 438 | |
| 14 | 6 | 478/B/4 | పట్టా | ఖుష్కీ | 0.01 1/4 | కొమురవెల్లి రమేష్ తండ్రి రాజేశం | 478 | 452 | 477 | 438 | |
| 15 | 6 | 478/B/2/1 | పట్టా | ఖుష్కీ | 0.00 1/4 | సరాఫ్ చంద్రకళ భర్త మోహన్ దాస్ | 478 | 452 | 477 | 438 | |
| 16 | 6 | 478/B/3/1 | పట్టా | ఖుష్కీ | 0.00 1/4 | అన్నడి రామకృష్ణ తండ్రిభూపతి రెడ్డి | 478 | 452 | 477 | 438 | |
| 17 | 6 | 478/A1 | పట్టా | ఖుష్కీ | 0.05 | గీస చిన్న పోశయ్య తండ్రి సాయిలు | 478 | 452 | 477 | 438 | |
| 18 | 6 | 478/A/2/2 | పట్టా | ఖుష్కీ | 0.13 | సార్ల రాజు తండ్రి మల్లయ్య | 478 | 452 | 477 | 438 | |
| 19 | 6 | 478/A2/1/1/1 | పట్టా | ఖుష్కీ | 0.10 | సార్ల రాజు తండ్రి మల్లయ్య | 478 | 452 | 477 | 438 | |
| | కొమురవెల్లి గ్రామం మొత్తం విస్తీర్ణం | | | | 24.16 1/2 | | | | | | |
| | | | | | పోసాన్‌పల్లి TAIL CHANAL OF TUNNEL OG RMC | | | | | | |
| 1 | 1 | 242/E/1 | పట్టా | ఖుష్కీ | 0.12 | ఎర్రబోయిన బాలక్ష్మి తండ్రి మల్లయ్య | 243 | VB | 246 | 241 | |
| | పోసాన్‌పల్లి గ్రామం మొత్తం విస్తీర్ణం | | | | 0.12 | | | | | | |
| | | | | | అయినపూర్ 1LA-D3-LMC | | | | | | |
| 1 | 1 | 144/1 | పట్టా | ఖుష్కీ | 0.35 | బెజ్జంకి జయ ప్రకాశ్ రావు తండ్రి రాజగోపాల్ రావు (వుడెం గోవర్ధన్ రెడ్డి తండ్రి దశరథ రెడ్డి) | 145 | 143 | VB | 145 | |
| 2 | 2 | 143/B/1 | పట్టా | ఖుష్కీ | 0.07 | వుడెం గోవర్ధన్ రెడ్డి తండ్రి బస్వా రెడ్డి | 144 | 145 | | 142 | |
| 3 | 3 | 143/C/2 | పట్టా | ఖుష్కీ | 0.16 | పాశం బాలయ్య తండ్రి మల్లయ్య | 144 | 145 | | 142 | |
| 4 | 3 | 143/C/1 | పట్టా | ఖుష్కీ | 0.17 | శరమల్లు కనకయ్య తండ్రి మల్లయ్య | 144 | 145 | | 142 | |
| 5 | 3 | 143 | పట్టా | ఖుష్కీ | 0.14 | అమరేందర్ రెడ్డి (అనుభవాదారు) | 144 | 145 | | 142 | |
| 6 | 4 | 142/1 | పట్టా | ఖుష్కీ | 1.19 | వుడెం గోవర్ధన్ రెడ్డి తండ్రి బస్వా రెడ్డి | 145 | 143 | 143 | 140 | |
| 7 | 5 | 140 | ప్రభుత్వ భూమి | ఖుష్కీ | 3.09 | అసైన్డ్ దార్/ ఇతరులు | 143 | 136 | | 116 & 156 | |
| | అయినాపూర్ గ్రామం మొత్తం విస్తీర్ణం | | | | 6.37 | | | | | | |
| | కొమురవెల్లి మండల మొత్తం విస్తీర్ణం | | | | 31.25 1/2 | | | | | | |

ఇట్టి భూసేకరణ సంబందించి గతంలో జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్ పై సెక్షన్ (15) క్రింద నిర్ణీత గడువులో వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించిన పిదప, ఇట్టి రూఢి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయబడుచున్నది ఈ భూ సేకరణ జె చొక్కారావు దేవాదుల ప్రాజెక్టు కుడి కాలువ మరియు ఎడమ కాలువ నిర్మాణంల కొరకు సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలములోని కొమురవెల్లి,అయినాపూర్, పోసాన్ పల్లి, గ్రామ పరిధిలోని ఇట్టి భూసేకరణ వారి వారి కమతాలలో అతి స్వల్ప విస్తీర్ణమునకు పరిమితమైనందున మరియు ఇట్టి కాలువ నిర్మాణము వలన వారి వారి మిగిలిన భూములకు నీటి సరఫరా పెరిగి, జీవనోపాధులు మెరుగు అవుతున్నందు వలన మరియు ఇట్టి భూసేకరణ వలన ఎలాంటి ఇతర కుటుంబాల జీవనోపాధులు గాను, ఆవాసాలు గాని ఎలాంటి ప్రభావితం కానందున, పునరావాస మరియు పునరుపాధి వర్తించదు.
భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొండ భాగములో లభ్యమైనచో ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.
పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ భూసేకరణ రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, సిద్దిపేట గారి కార్యాలయము, ఏదైనా దినమున పనివేళలో పరిశీలించుకొన్ను నిమిత్తము అందుబాటులో ఉందును.

| సం/- | సం/- | సం/- | సం/- |
|---|---|---|---|
| తహశీల్దార్, కొమురవెల్లి మండలం | రెవెన్యూ డివిజనల్ అధికారి సిద్దిపేట | అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సిద్దిపేట జిల్లా | కలెక్టర్ సిద్దిపేట జిల్లా |

DIPR RO NO. 321/LA/PP/Advt/Pub/2026-27


కార్మిక చట్టాల రద్దుతో...

# దేశం 20 ఏళ్లు వెనక్కు

మోదీపై ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ ధ్వజం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఏ దేశాభివృద్ధికైనా అసలైన బలం శ్రామికులేనని, కార్మికులు చిందించిన రక్తం, చెమట వల్లే దేశం ప్రగతి సాధిస్తుందని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి కార్మికుల శ్రమను హీనంగా చూపే ప్రయత్నం చేయడాన్ని ఆయన శనివారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని, నల్లధనాన్ని వెనక్కి తెచ్చి ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తామన్న వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసిందని బాల్‌రాజ్ మండిపడ్డారు. కరోనా సంక్షోభ సమయంలో పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ జరపకుండా, చట్టబద్ధత లేని 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి అంబానీ, అదానీల ఆస్తులు పెంచడానికి కేంద్రం తాపత్రయపడిందని ధ్వజమెత్తారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు 28 సార్లు సార్వత్రిక సమ్మెలు, ఆందోళనలు చేసినా మోదీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించిందన్నారు. పెట్టుబడిదారులకు రూ.14 లక్షల కోట్ల రాయితీలు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం.. నోయిడాలో కనీస వేతనాల కోసం సమ్మె చేస్తున్న లక్షలాది వలస కార్మికులపై కనీస సానుభూతి కూడా చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడం ద్వారా దేశాన్ని 20 ఏళ్లు వెనక్కి తీసుకుపోయిన చరిత్ర బిజెపిదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలను విపరీతంగా పెంచి కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని వివరించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పరిశ్రమల అధిపతులకు అభినందనలు తెలిపారే తప్ప, దేశంలోని 47 కోట్ల మంది కార్మికులకు సంబంధించి ఒక్క మాట కూడా మాట్లాడక పోవడం వారి కార్మిక వ్యతిరేక వైఖరికి నిదర్శనమన్నారు. కార్మికులను నట్టేట ముంచుతున్న ప్రభుత్వాలకు కాలం చెల్లక తప్పదని బాల్‌రాజ్ హెచ్చరించారు.

## జయశంకర్ సార్ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ జాతిపిత, స్వరాష్ట్ర స్వాప్నికులు ప్రొఫెసర్ కె.జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడి త్యాగాన్ని, కృషిని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలుగా ఆయన జీవితాన్ని గడిపారని గుర్తు చేసుకున్నారు. ఆ మహనీయుడి త్యాగాన్ని తెలంగాణ సమాజం, ప్రజా ప్రభుత్వం సదా గుర్తుంచుకుంటుందని తెలిపారు. ఆ మహనీయుడి ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని చెప్పారు. ప్రొఫెసర్ కె.జయశంకర్ ఆశయ సాధనకు కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేయడాన్ని జయశంకర్ సార్ వ్యతిరేకించారని తెలిపారు. ఎపిలో విలీనంతో జరిగిన అన్యాయాన్ని ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఆరు దశాబ్దాలు సజీవంగా ఉంచిన ఘనత ఆయనదేనని సిఎం కొనియాడారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో సిపిఐ రాజీలేని పోరాటం

- ఓట్ల తొలగింపునకు వ్యతిరేకంగా ఈనెల 23న భారీ ప్రదర్శన
- అర్బన్ నక్సల్స్ పేరిట కేంద్ర ప్రభుత్వ వేధింపులు సిగ్గుచేటు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని




**ప్రజాపక్షం/గజ్వేల్ :** ప్రజా సమస్యల పరిష్కారంలో సిపిఐ రాజీలేని పోరాటం చేస్తుండగా, వివిధ అంశాలపై అసెంబ్లీలో పాలక పక్షాన్ని నిలదీస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా సిపిఐ శిక్షణా తరగతుల్లో భాగంగా శనివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మీడియా సమావేశంలో మాట్లాడారు. జీవించే హక్కును కాలరాస్తున్న కేంద్రంలోని బిజెపి సర్కార్ రాష్ట్రంలోని 80 లక్షల ఓట్లు తొలగించేందుకు సిద్ధమైనట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈనెల 23న హైదరాబాద్‌లో భారీ ప్రదర్శన నిర్వహిస్తుండగా, 24న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్యం చేయనున్నట్లు స్పష్టం చేశారు. దేశంలో బిజెపి బలపడడానికి కుట్రలకు తెరలేపుతుండగా, ప్రజా చైతన్యంతో ప్రధాని మోడీ వ్యతిరేక విధానాలను ఎండగడతామని తెలిపారు. అర్బన్ నక్సల్స్ పేరిట హరగోపాల్ వంటి మేధావులను వేధిస్తుండడం సిగ్గుచేటుగా, కేంద్రం పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ప్రజా సమస్యలు ప్రతిబింబించే విధంగా పాలక పక్షాన్ని అసెంబ్లీలో నిలదీస్తూ ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నట్లు చెప్పారు. అంతేగాకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ ప్రమాదంలో పడగా, సిపిఐ ప్రత్యేక కృషి ఫలితంగా ఆర్టీసీ సమస్యలు పరిష్కారం కాబోతున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల ఇబ్బందులు, ఆర్టీసీ విలీనం, గౌరవప్రదమైన పిఆర్సి, పెండింగ్ సమస్యల పరిష్కారం తదితర వాటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి కార్మికుల్లో అపనమ్మకం తొలగించాలని అన్నారు. రాష్ట్రంలో విడతలవారీగా కాకుండా, అర్హులైన పేదలందరినీ గుర్తించి ఒకేసారి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలతో పేదలు ఇండ్లు నిర్మాణం చేసుకోగా, వాటిని తొలగించే చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం విరమించుకోవాలని సూచించారు. 58,59 జీఓల ప్రకారం క్రమబద్ధీకరించిన పేదలకు అనుమతి పత్రాలు అందించాలని స్పష్టం చేశారు. సింగరేణిలో ఎలాంటి అక్రమాలకు అవకాశం లేదని, అయితే షేర్లు, లోన్ల కోసం లేని బొగ్గును ఉన్నట్లుగా చూపించినట్లు తెలుస్తోందని అన్నారు. రైతు సమస్యల పరిష్కారంలో భాగంగా అర్హులందరికీ పంట రుణమాఫీ చేయాలని, బోనస్ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న వేలాది మంది ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరిగిపోతున్న అసంతృప్తిని దృష్టిలో పెట్టుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ప్రకాష్‌రావు, మంద పవన్, దయానంద రెడ్డి, రాజేశం, శివలింగ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలకు ఎర్రజెండానే ప్రత్యామ్నాయం**

దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితుల్లో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపగల శక్తి ఎర్రజెండా మాత్రమేనని, భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతూ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా నిలుస్తోందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో నిర్వహిస్తున్న సీపీఐ ఉమ్మడి మెదక్ జిల్లా కౌన్సిల్ సభ్యుల రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తూ, వారి హక్కుల కోసం పోరాటం చేసే పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని ఆయన అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం నుండి నేటి వరకు ప్రజా ఉద్యమాలకు సీపీఐ అండగా నిలిచిందని, రైతులు, కార్మికులు, కూలీలు, పేదలు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రాంతంలోనూ భూస్వామ్య, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో కమ్యూనిస్టుల పాత్ర చారిత్రాత్మకమైందని పేర్కొన్నారు. ప్రతి పార్టీ కార్యకర్త ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ శిక్షణ తరగతులు పార్టీ సిద్ధాంతాలను, కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను, సమకాలీన రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయని అన్నారు. కార్యకర్తలు ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకుని గ్రామాలు, పట్టణాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు వీర్ల ప్రకాష్ రావు, బట్టు దయనంద రెడ్డి, సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, మెదక్ జిల్లా కార్యదర్శి ఖాలేక్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్, సహాయ కార్యదర్శి రెహ్మాన్, ఆనంద్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కొమ్ముల భాస్కర్, నాయకులు యెడల వనేశ్, జేరిపోతుల జనార్ధన్, పిల్లి రజిని, స్వర్గం రాజేశం, శివలింగు కృష్ణ, గజాభీమకర్ బన్సీలాల్, నర్సింహారెడ్డి, సంగెం మధు, రామగళ్ల నరేష్, హరిఫ్ తదితరులు పాల్గొన్నారు.




## మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం నిరంతర కృషి : మంత్రి అజారుద్దీన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. శనివారం బంజారాహిల్స్‌లో ఉన్న బంజారా భవన్‌లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద పెద్ద సంఖ్యలో మహిళా లబ్ధిదారులకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మహిళల సాధికారత, సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళల ఆర్థిక, విద్యా, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంఎల్‌సి వెంకట్ బల్మూర్, ప్రభుత్వ ఉన్నతాధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పాల్గొన్నారు.

# విద్య, సంక్షేమం, ఉపాధితోనే బిసి సాధికారత




మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసివర్గాల విద్యా, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందనిబిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. విద్య, సంక్షేమం, ఉపాధి ద్వారా బిసి యువతను సాధికారత కలిగిన వర్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో జిల్లా బిసి అభివృద్ధి అధికారులు, స్టడీ సర్కిల్ డైరెక్టర్లతో ఆయన రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2025–26 విద్యా సంవత్సరంలో బిసి సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు ఏకంగా 96.05 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర సగటు ఉత్తీర్ణత (95.15శాతం) కంటే అధికమని, రాష్ట్రవ్యాప్తంగా 285 హాస్టళ్లు వంద శాతం ఫలితాలు సాధించాయని వెల్లడించారు. ఇంటర్‌లో మెరుగైన ఫలితాలను సాధించిన జిల్లాలను అభినందిస్తూనే, తక్కువ ఫలితాలు వచ్చిన జిల్లాల అధికారులను మందలించారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు యూనిఫాం, నోట్ బుక్స్, షూస్, ట్రాక్‌సూట్, బ్యాగ్‌లతో కూడిన సమగ్ర వెల్కమ్ కిట్ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జూన్ నెలాఖరులోపు అన్ని హాస్టళ్లలో 'పేరెంట్‌టీచర్' సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హాస్టళ్లలో పరిశుభ్రత, ఆర్‌ఓ ప్లాంట్ల నిర్వహణ, పెస్ట్ కంట్రోల్ చర్యలు చేపట్టాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారం అందించాలని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థికి అకడమిక్, హెల్త్ ప్రొఫైల్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

**హెచ్ఎండిఏ గ్రౌండ్స్‌లో కుల వృత్తుల ప్రదర్శన :** బోనాల పండుగ నేపథ్యంలో జూలై 14 నుండి 24 వరకు హెచ్ఎండిఏ గ్రౌండ్స్‌లో కుల వృత్తుల ప్రదర్శన, మట్టి కుండల స్టాల్స్ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అలాగే బిసి, ఈబిసి వర్గాలకు సంబంధించిన కళ్యాణ లక్ష్మి దరఖాస్తులను పెండింగ్ లేకుండా గ్రీన్ ఛానల్ ద్వారా సకాలంలో లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు.

**బిసి స్టడీ సర్కిళ్లలో సంస్కరణలు :** పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం బిసి స్టడీ సర్కిళ్లలో మరిన్ని సంస్కరణలు తెస్తున్నామని మంత్రి తెలిపారు. 12 యూట్యూబ్ ఛానళ్ల ద్వారా నిరంతరం గైడ్‌లైన్స్ అందిస్తున్నామని చెప్పారు. త్వరలోనే సిద్దిపేటలో నూతనంగా నిర్మించిన బిసి స్టడీ సర్కిల్ సొంత భవనాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ సమీక్షా సమావేశంలో బిసి సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి.హన్మంతరావు, కమిషనర్ బాలమయదేవి, అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, మామిడి హరికృష్ణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## జులై 20లోగా మెడికల్ బోర్డు పెట్టకుంటే అదేరోజు నిరాహార దీక్ష

ప్రభుత్వానికి తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అల్టిమేటం

భూపాలపల్లి కాకతీయ ఖని- 5 గనిపై గేట్ మీటింగ్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి నెల రోజుల సమయం ఇస్తున్నా ఈలోగా నెలకు రెండు మెడికల్ బోర్డులు నిర్వహించాలని లేదంటే జులై 20న నిరాహార దీక్ష చేపడుతానని టిఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రభుత్వానికి ఘాటుగా హెచ్చరిక జారీ చేశారు. శనివారం భూపాలపల్లి ఏరియాలోని కాకతీయ ఖని 5 గనిపై హెచ్ఎంఎస్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సింగరేణి బాయి బాట చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. గత ఐదురోజులుగా కార్మికులతో మాట్లాడుతున్నాను, వాళ్లకు కనీసం తాగటానికి మంచి నీళ్లు కూడా ఇవ్వటం లేదని ఆరోపించారు. డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో ఓ పెద్ద మనిషి కలిసి తన గోస చెప్పుకుంటే కళ్లలో నీళ్లు వచ్చాయన్నారు. కార్మికులను ఇబ్బంది పెడితే వారి గోసం ఈ ప్రభుత్వానికి తగులుతుందని చెప్పారు. కేటీకే5 ఇంక్లైన్‌లో మహిళా కార్మికులకు వాష్‌రూమ్ సౌకర్యాలు కూడా లేవని అన్నారు. బొగ్గుబాయిల దగ్గర ఉండే ప్రజలు కనీసం కార్మికుడిగానైనా సింగరేణిలో జాబ్ వస్తుందని భావిస్తారని, రిటైర్‌మెంట్ అవుతున్న వాళ్లు తమ పిల్లలకో, బంధువులకో డిపెండెంట్ ఉద్యోగాలు ఇప్పించుకోవాలని భావిస్తారు. కానీ ఈ ప్రభుత్వం మాత్రం మెడికల్ బోర్డు పెట్టకుండా రిటైర్ మెంట్‌కు దగ్గర్లో ఉన్న వాళ్లను ఆవేదనకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భూపాలపల్లిలో ఇవ్వాళ మొదటి జెండా ఎగురవేశాం. రానున్న రోజుల్లో ఇక్కడ ఎమ్మెల్యే సీటు కూడా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఉన్న ఎమ్మెల్యే భూకబ్జాలు చేశారు. చెరువులను కూడా వదలలేదు. ఈ ప్రాంతంలో ఓపెన్ కాస్ట్ కోసం 140 ఎకరాలను ప్రజలు ఇస్తే వారికి ఇప్పటికీ కూడా పరిహారం ఇవ్వలేదు. దీనిపై గతంలో ఉన్న ఎమ్మెల్యే గానీ ఇప్పుడున్న ఎమ్మెల్యే గానీ మాట్లాడటం లేదు. భూములు ఇచ్చిన వారికి కచ్చితంగా పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**భూపాలపల్లిలో భారీ ర్యాలీ..** భూపాలపల్లి వందలాది మంది మహిళలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత జిల్లా కేంద్రంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫసర్ జయశంకర్ సార్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత బస్టాండ్ వద్ద తెలంగాణ తల్లికి పూలమాల వేసి.. టీఆర్ఎస్ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ రాష్ట్ర నాయకులు సారయ్య, మాజీ మంత్రి బోడ జనార్దన్, తెలంగాణ రక్షణ సేన జిల్లా ఇన్చార్జి నరేష్ నేత స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# రైతు వేదికలతో సాగు విప్లవం

95 వారాల్లో 22.63 లక్షల మందికి వ్యవసాయ విజ్ఞానం



ఫైల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు వేదికలు', 'రైతు నేస్తం' కార్యక్రమాలు రాష్ట్రంలో వ్యవసాయ విప్లవానికి బాటలు వేస్తున్నాయి. రైతులకు గ్రామ స్థాయిలోనే శాస్త్రీయ సాగు పద్ధతులు, నూతన సాంకేతికతలు, ప్రభుత్వ పథకాలను చేరవేసే లక్ష్యంతో సాగుతున్న ఈ ప్రయాణం అద్భుత ఫలితాలను ఇస్తోంది. గత 95 వారాలుగా విజయవంతంగా కొనసాగుతున్న 'రైతు నేస్తం' కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 22,63, 918 మంది రైతులు నేరుగా లబ్ధి పొందారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,601 రైతు వేదికలలో ఇప్పటికే 1,600 వేదికలకు హైటెక్ వీడియో కాన్ఫరెన్సింగ్ సదుపాయాన్ని కల్పించారు. దీనివల్ల రైతులు తమ సొంత గ్రామాల నుంచే నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి మాట్లాడి, తమ పంటలకు సోకుతున్న తెగుళ్లు, ఇతర సమస్యలకు తక్షణ పరిష్కారాలను పొందుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సమన్వయంతో ప్రతి మంగళవారం ఈ కార్యక్రమం క్రమం తప్పకుండా నిర్వహిస్తూ .ఆధునిక పద్ధతుల్లో సాగు చేసి మంచి దిగుబడులు, లాభాలు సాధించిన రైతుల విజయగాథలను తోటి రైతులతో పంచుకుంటూ వారిలో స్ఫూర్తి నింపుతున్నారు. ల్యాబ్ (పరిశోధన కేంద్రాలు)లో అభివృద్ధి చేసిన కొత్త వంగడాలు, సాంకేతికతలను నేరుగా ల్యాండ్(రైతు పొలం)కు చేరవేస్తున్నారు.

**మంత్రి, ఉన్నతాధికారుల ప్రత్యేక పర్యవేక్షణ – దిశానిర్దేశం**

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ వ్యవసాయ పథకాలను మంత్రి రైతు నేస్తం ద్వారా నేరుగా రైతులకు చేరవేస్తున్నారు. అలాగే, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్. బి. గోపి ప్రతి కార్యక్రమంలోనూ పాల్గొంటూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు, అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయి మార్గదర్శకాలను అందిస్తున్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సైతం పలు సందర్భాల్లో రైతు వేదికల ద్వారా రాష్ట్రవ్యాప్త రైతులతో వీడియో కాన్ఫరెన్స్‌లో నేరుగా మాట్లాడి, పంటల ప్రణాళిక, మార్కెటింగ్, అభివృద్ధి వ్యూహాలపై దిశానిర్దేశం చేయడం విశేషం.

**విస్తృత అవగాహన – ఆధునిక సాంకేతికత**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 200కు పైగా వ్యవసాయాధారిత అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. వరి, పత్తి, మొక్కజొన్న, పప్పు ధాన్యాలు, ఉద్యాన పంటల సాగు విధానాలు. డ్రోన్ల వినియోగం, డిజిటల్ వ్యవసాయం, భూసార పరిరక్షణ, సహజ వ్యవసాయం అంశాలను రైతులకు వివరించడం ద్వారా వ్యవసాయంలో మెళకువలను అందిస్తున్నారు. అదేవిధంగా ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులు, వర్షాల హెచ్చుతగ్గుల నేపథ్యంలో నీటి పొదుపు చర్యలు, ప్రత్యామ్నాయ పంటల సాగు వాతావరణ ఆధారిత సలహాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈ నేపథ్యంలో రైతు సోదరులంతా ప్రతి మంగళవారం నిర్వహించే 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్.బి.గోపి కోరారు. శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబించి, అనవసర ఖర్చులను తగ్గించుకుంటూ అధిక దిగుబడులు, తద్వారా ఆశించిన ఆర్థిక ప్రయోజనాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.


GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగరపాలక సంస్థ

| NIT No. | పని వివరణ | అంచనా విలువ / ECV | డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | ఇఇ / ఎస్ఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 18 | 3 పనుల కొరకు రాజేంద్రనగర్ సర్కిల్-19, రాజేంద్రనగర్ జోన్‌లో ఆటో గ్రాబర్‌తో UGD నిర్వహణ మరియు ఎయిర్‌టెక్ మెషీన్‌తో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను శుభ్రపరిచే నిర్వహణ. | రూ. 29.20 లక్షలు | తేది: 22.06.206 సా.4.30 గం.లకు | తేది: 25.06.2026 సా.4.40 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్ర నగర్, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9989930608. ఇ-మెయిల్: eec11.ghmc2@gmail.com |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్ సర్కిల్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 4658-PP/CL/ADVT/2026-27, Date: 20-06-2026

## రాజీ మార్గాలతోనే పెండింగ్ కేసులు పరిష్కరించుకోవచ్చు

మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, జడ్జి ఎస్.స్వాతిరెడ్డి




ప్రజాపక్షం/షాద్‌నగర్: రాజీ మార్గంతోనే పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మర్, 16వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్.స్వాతిరెడ్డి అన్నారు. శనివారం షాద్‌నగర్ కోర్టు సముదాయంలో మండల న్యాయ సేవా అధికార సంస్థ షాద్‌నగర్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ ఆదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ఎస్.స్వాతిరెడ్డి మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమని, ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే లోక్ ఆదాలత్‌లో వివిధ రకాల కేసులను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఈ జాతీయ లోక్ ఆదాలత్‌లో సివిల్ తగాదాలు ఒక కేసు, క్రిమినల్ తగాదా కేసులు 230, బ్యాంకు కేసులు ఒకటి, విద్యుత్ కేసులు 978, డ్రంగ్ అండ్ డ్రైవ్ కేసులు 1355 మొత్తం 2569కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. దాంతో రూ.18,23,500లు వసూ ళ్ళు అయినట్లు తెలిపారు. జాతీయ లోక్ ఆదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు మంచి అవకాశమనే విషయాన్ని ప్రతి కక్షదారుడు గుర్తించుకోవాలని, రాజీమార్గమే రాజమార్గమన్న విషయాన్ని ఆలోచనలో పెట్టుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మల్యాల సాహితి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.ప్రవీణ్‌కుమార్, ప్రభుత్వ న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి, శేఖర్ బాం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసమూర్తితోపాటు న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

## అధికారులు బాధ్యతగా విధులు నిర్వహిస్తేనే ప్రజల్లో గుర్తింపు



ప్రజాపక్షం/కేశంపేట: అధికారులు బాధ్యతగా విధులు నిర్వహిస్తే ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని తొమ్మిది రేకుల సర్పంచ్ బీసా కవిత కరుణాకర్‌రెడ్డి అన్నారు. శనివారం తొమ్మిది రేకుల గ్రామంలో పంచాయతీ కార్యదర్శుల సన్మాన కార్యక్రమంలో పాల్గొని ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శిగా అవినాష్‌గౌడ్‌కు ఆప్యాయ వీడ్కోలు పలికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్యకు ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవిత కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ కార్యదర్శి అవినాష్ గౌడ్ గత ఆరు సంవత్సరాల నుండి గ్రామంలో అంకితభావంలో పని చేశారని, ప్రజల మన్ననలు పొందారని, అదే తరహాలో కొత్తగా వచ్చి కార్యదర్శి తిరుపతయ్య ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవినాయక్, మాజీ ఉప సర్పంచ్ నరసింహారెడ్డి, చిట్టిరెడ్డి వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యులు లచ్చిరామ్‌నాయక్, పోగుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించడం విరుద్ధం




ప్రజాపక్షం/షాద్‌నగర్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించడం విరుద్ధమని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప అన్నారు. శనివారం షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మైనార్టీ నాయకుడు మహ్మద్ ఇబ్రహీం, చందులాల్‌లు కలిసి ఛలో గాంధీ భవన్‌లో చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా చైర్మన్ బసవేశ్వర్ అప్ప మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. రాజ్యసభ ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, న్యాయం పాటించాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలను రక్షించాలని డిమాండ్ చేశారు. సత్యాగ్రహ దీక్షకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని మీనాక్షి నటరాజన్‌కు మద్దతు ఇచ్చా రు. రాజ్యాంగ విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు.

## జెఇఇ అడ్వాన్స్‌లో 73వ ర్యాంకు



ప్రజాపక్షం/కొత్తూరు: జెఇఇ అడ్వాన్స్‌లో కొత్తూరు తండాకు చెందిన విద్యార్థి 73వ ర్యాంక్ సాధించడంతో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అభినంధించారు. శనివారం కొత్తూరు తండాకు చెందిన పాత్లావత్ రవినాయక్ చిన్న కుమారుడు గౌతంను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కలిసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందని వివరించారు. ఆల్ ఇండియా ఎస్‌టి కేటగిరిలో 73వ ర్యాంకు సాధించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ఐఐటిలో సీటు సాధించడమే లక్ష్యంగా పెట్టుకొని విద్యను అభ్యసించి జేఈఈలో 73వ ర్యాంక్ సాధించినట్లు గౌతం తెలిపారు.

## రైతు సంక్షేమమే మోదీ ప్రభుత్వ లక్ష్యం

బిజెపి మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీ కాంత్‌రెడ్డి

ప్రజాపక్షం/కొందుర్గు: రైతు సంక్షేమమే ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ లక్ష్యమని బిజెపి మండల అధ్యక్షుడు చిట్టెం లక్ష్మీ కాంత్‌రెడ్డి అన్నారు. శనివారం కొందుర్గు మండల కేంద్రంలోని రైతు వేదికలో పిఎం కిసాన్ 23వ విడత నిధుల విడుదల సందర్భంగా బిజెపి ఆధ్వర్యంలో అధికారులతో కలిసి మిఠాయిలు తినిపించుకుంటే సంబరాలు చేసుకున్న నేతలు. ఈ సందర్భంగా చిట్టెం లక్ష్మీ కాంత్‌రెడ్డి మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వంలో రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందిందని గుర్తు చేశారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువస్తుందని వివరించారు. రైతులకు అండగా నిలుస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మయ్య గౌడ్, గుండేటి శివారెడ్డి, కొమరబండ శ్రీశైలం, సున్నాల అంజయ్య, బోయ శ్రీశైలం, బోయ వీరన్న, బోయ శేఖర్, అంజిరెడ్డి, చంద్రశేఖర్‌చారి, శ్రీకాంత్, నరసింహ, బాల్‌రెడ్డి, గంగాధర్, కృష్ణ యాదవ్, భాస్కర్ పటేల్‌లు పాల్గొన్నారు.

# త్వరితగతిన పౌరసేవలు అందించాలి

సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన






ప్రజాపక్షం/హైదరాబాద్ : వర్షాకాల సంసిద్ధత, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, అభివృద్ధి పనుల పురోగతిపై కుత్బుల్లాపూర్ జోన్ అధికారులతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) కమిషనర్ డాక్టర్ జి. సృజన సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. పౌర సేవల మెరుగుదల కోసం శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఆమోదం పొందిన పనులను నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఇంజినీరింగ్ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. టెండర్ ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయడంతో పాటు క్షేత్రస్థాయి పర్యవేక్షణను పటిష్టం చేయాలని సూచించారు. వర్షాకాల సంసిద్ధత చర్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నీటి నిల్వ ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని, పోలీస్, డిఆర్‌ఎఫ్, హైడ్రా బృందాలతో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రోడ్డు తవ్వకాలు, మౌలిక వసతుల పనుల వద్ద భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. పారిశుద్ధ్య సేవల మెరుగుదల కోసం దీర్ఘకాలంగా గైర్హాజరైన కార్మికుల స్థానంలో కొత్త సిబ్బందిని నియమించాలని, పచ్చ వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల నిర్మూలనకు చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. దోమల నివారణ కార్యక్రమాలను రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల సహకారంతో మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. సోషల్ మీడియా, ప్రజావాణి, ఇతర వేదికల ద్వారా అందుతున్న ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. కార్పొరేషన్‌కు చెందిన పార్కులు, మార్కెట్లు, కమ్యూనిటీ హాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఖాళీ స్థలాల పరిరక్షణ, నిర్వహణ, ఆదాయ వనరుల వినియోగంపై కూడా సమావేశంలో సమీక్షించారు. సంబంధిత ఆస్తుల పూర్తి వివరాలను సమర్పించాలని డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. పౌరులకు మెరుగైన సేవలు అందించాలంటే క్షేత్రస్థాయి పర్యవేక్షణ, బాధ్యతాయుత పరిపాలన, శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని కమిషనర్ స్పష్టం చేశారు.

**అవసరమైన పనులను వేగంగా పూర్తి చేయాలి**

పౌర సేవలను మెరుగుపరచడం, స్థానిక సమస్యలను వేగంగా పరిష్కరించడం లక్ష్యంగా నిర్వహిస్తున్న 'వన్ వార్డ్ ఎవరీ డే' కార్యక్రమంలో భాగంగా భాగ్యనగర్ వార్డులో అధికారులు విస్తృత సమీక్ష నిర్వహించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) కమిషనర్ డాక్టర్ జి.సృజన జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఇతర అధికారులతో కలిసి కూకట్‌పల్లి జోన్‌లోని ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలో భాగ్యనగర్ వార్డును సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంటి హిల్స్, జలవాయు విహార్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశమై స్థానిక సమస్యలు, మౌలిక వసతుల అవసరాలపై చర్చించారు. భీమునికుంట చెరువు వద్ద యుజిడి రీమోడలింగ్, అవుట్‌లెట్ విస్తరణ పనులు, జలవాయు విహార్‌లో సిసి రోడ్డు పనులు, రెండు కాలనీల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు వంటి అంశాలపై సమీక్షించారు. అలాగే సీవర్ క్లీనింగ్ యంత్రాల వినియోగం, ట్రాఫిక్ నిర్వహణ చర్యలు, అనధికార నిర్మాణాలపై చర్యలు, పార్కుల్లో ఎండిన ఆకుల కంపోస్టింగ్, వ్యర్థాల నిర్వహణ వంటి పలు అంశాలపై అధికారులతో చర్చించారు. స్థానిక నివాసితులు తమ సమస్యలు, సూచనలను కమిషనర్ దృష్టికి తీసుకురాగా, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్ సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, పౌర సే వలను మరింత సమర్థవంతంగా అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని కార్పొరేషన్ కొనసాగిస్తోందని కమిషనర్ తెలిపారు.

## జిహెచ్‌ఎంసి పరిధిలో ఆక్రమణల తొలగింపు ప్రత్యేక డ్రైవ్

283 ఆక్రమణలు తొలగింపు

పాదచారుల సౌకర్యం, ట్రాఫిక్ సాఫీ కోసం బల్దియా చర్యలు





ప్రజాపక్షం/హైదరాబాద్ : పాదచారుల సౌకర్యం, ట్రాఫిక్ సాఫీగా సాగడం, పట్టణ రవాణా మెరుగుదల లక్ష్యంగా జిహెచ్‌ఎంసి పరిధిలో రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణల తొలగింపుకు అధికారులు ప్రత్యేక డ్రైవ్‌ల నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం నగరంలోని పలు సర్కిళ్లలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులతో సమన్వయం చేసుకుని పాదచారుల మార్గాలు, రహదారి అంచులపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. ప్రతి జోన్‌లో ఒక ప్రధాన రహదారిని ఎంపిక చేసి, సంబంధిత సర్కిళ్ల సిబ్బందిని సమీకరించి కార్యాచరణ షెడ్యూల్ ప్రకారం ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. జిహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, చీఫ్ సిటీ ప్లానర్ కె. శ్రీనివాస్, సంబంధిత జోనల్ కమిషనర్లు ఈ డ్రైవ్‌ను పర్యవేక్షించగా, అన్ని సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో శంషాబాద్ సర్కిల్‌లో ఆర్‌జిఐ పోలీస్ స్టేషన్ నుంచి మిషన్ కంపౌండ్ వరకు 15 శాశ్వత, 56 తాత్కాలిక ఆక్రమణలను తొలగించారు. చార్మినార్ సర్కిల్‌లో ఎస్‌బిఐ బ్యాంక్ నుంచి రిలయన్స్ ట్రెండ్స్ వరకు 16 శాశ్వత, 33 తాత్కాలిక ఆక్రమణలు తొలగించగా, గోల్కొండ సర్కిల్‌లో 28 శాశ్వత, 59 తాత్కాలిక ఆక్రమణలను తొలగించారు. ఖైరతాబాద్ సర్కిల్‌లో 21 తాత్కాలిక ఆక్రమణలు, సికింద్రాబాద్ సర్కిల్‌లో 20 శాశ్వత, 35 తాత్కాలిక ఆక్రమణలు తొలగించినట్లు వెల్లడించారు. ఈ ఒక్కరోజే మొత్తం 283 ఆక్రమణలు తొలగించగా, అందులో 79 శాశ్వత, 204 తాత్కాలిక ఆక్రమణలు ఉన్నట్లు జిహెచ్‌ఎంసి అధికారులు తెలిపారు. ఇక ఈ ఏడాది ఏప్రిల్ 4 నుంచి ఇప్పటివరకు 2,620 ఆక్రమణలను ప్రత్యేక డ్రైవ్‌ల ద్వారా తొలగించామన్నారు. పాదచారుల మార్గాలు, రహదారి అంచులను ఆక్రమించకుండా పౌరులు, దుకాణదారులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆక్రమణలను తొలగించడంలో ఎలాంటి వెనుకడుగు ఉండదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరంగా కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

## దాడులకు పాల్పడిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి



ప్రజాపక్షం/రంగారెడ్డి: ప్రభుత్వ ఉద్యోగులపై దాడులకు పాల్పడిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా)రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎస్. జనార్ధన్ రావు అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్,జిపిఒపై దాడిని ఖండించిన తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా),బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి కి శనివారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ట్రెసా నాయకులు మాట్లాడుతూ అబ్దుల్లాపూర్ మెట్ మండలంలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ పరిపాలన అధికారి (జిపిఒ)పై ఈ నెల 18 జరిగిన దాడిని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా), రంగారెడ్డి జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వ విధులను నిర్వహిస్తున్న అధికారులపై దాడులు జరగడం అత్యంత ఆందోళనకరమని, ఇటువంటి సంఘటనలు ప్రభుత్వ ఉద్యోగుల భద్రతకు ముప్పుగా మారడంతో పాటు చట్టబద్ధమైన పరిపాలనకు ఆటంకం కలిగిస్తాయని ట్రెసా పేర్కొంది. ప్రజలకు సేవలందించే క్రమంలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బందిపై దాడులు జరగడం సహించరానిదని సంఘం అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో సంఘం నాయకులు జిల్లా కలెక్టర్,జిల్లా మేజిస్ట్రేట్‌ను కలిసి దాడికి పాల్పడిన వ్యక్తులపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి,కఠిన చట్టపరమైన చర్యలు చేపట్టాలని,ఫీల్డ్ విధులు నిర్వహించే రెవెన్యూ సిబ్బందికి తగిన భద్రతా ఏర్పాట్లు కల్పించాలని,భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలకోరారు. ఈ కార్యక్రమంలో ట్రెసా రాష్ట్ర జనరల్ సెక్రటరీ,గౌతమ్ కుమార్,రంగారెడ్డి జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తాం



ప్రజాపక్షం/షాద్‌నగర్: బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి సమావేశాన్ని ఏర్పాటు చేసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉప నయనాలు, వివాహాలు వంటి శుభకార్యాలు నిర్వహించేందుకు సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనాలపై ఆధారపడాల్సి వస్తుందని బ్రాహ్మ ణ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. బ్రాహ్మణ సంఘం కోసం వెయ్యి గజాల స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుండి ఆర్థిక సహాయం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. బ్రాహ్మణ సంఘం సమస్యలను త్వరలోనే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు వావిలాల సుజీవన్, సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్ర, వేణుగోపాలకృష్ణ, రామ సత్యనారాయణ రవి శర్మ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడితే ఉపేక్షించేది లేదు

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ : వ్యవసాయ రంగానికి చెందిన బోరుమోటర్లకు మీటర్లు బిగిస్తే ఉపేక్షించేది లేదని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలోనే రైతులకు ఎంతో మేలు జరిగిందని గుర్తు చేశారు. రైతుబంధును ఏకకాలంలో ఇవ్వడంతో పాటు యూరియా యాప్ లేకుండానే అవసరం ఉన్న మేరకు ఎరువులు అందించినట్లు గుర్తు చేశారు. అన్నదాతలు పండించిన అన్ని రకాల పంటలకు పూర్తి స్థాయిలో గిట్టుబాటు ధరలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకా రైతులకు అనేక కష్టాలు రావడంతో పాటు ఎరువుల కోసం అనేక అవస్థలు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రతి రైతు మరణించిన వారం రోజుల్లోనే రూ.5లక్షల చెక్కును కుటుంబానికి అందించినట్లు గుర్తు చేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, మిషన్ కాకతీయ వంటి సాగునీటి ప్రాజెక్టులతో బీడుభూములు సైతం అభివృద్ధి సాధించాయని పేర్కొన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అనేక లిఫ్టులను పూర్తి చేశామని, లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ పనులు పూర్తి కాకపోయినా ఆ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళికలను గత ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించామని, ఎక్కడ నిర్లక్ష్యం చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులను పట్టించుకునే నాధులే లేకుండా పోయారని గుర్తు చేశారు.

**మట్టి మాఫీయాపై చర్యలు తీసుకోవడంలో విఫలం**

మట్టి మాఫీయా రాజ్యమేలుతుంటే పోలీసులు, రెవిన్యూ శాఖల అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. చెరువుల్లో, కుంటల్లో విలువైన ఒండ్రు మట్టిని హైద్రాబాద్‌కు తరలిస్తుంటే అధికారులు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని వివరించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు స్వార్థ ప్రయోజనాల కోసం సహజ నీటి వనరులను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. మట్టి రవాణా బహిరంగంగా సాగుతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. చెరువులు, పాటు కాల్వలు కబ్జాకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని వాపోయారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు వి.నారాయణరెడ్డి, ఈట గణేష్, ఎంఎస్ నటరాజన్, లక్ష్మణ్‌నాయక్, దేవేందర్ యాదవ్, గోపాల్, చీపిరి రవియాదవ్, జట్ట కుమార్, యుగంధర్, అశోక్, భీశ్వ రామకృష్ణ, రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

## రైతులకిచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం : మంచిరెడ్డి

ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం : రైతుల కిచ్చిన హామీలు నెరవేర్చటంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి విమర్శించారు. శనివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోషా,బోనస్‌ల పేరుతో రైతులను మాయ మాటలతో మోసం చేస్తున్నారని విమర్శించారు. రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాటానికి నడు బిగించి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతులు ఆరు కాలం కష్టపడి పెట్టుబడి పెట్టి వివిధ రకాల పంటలు పండిస్తే గిట్టు భాటు ధర కల్పించటంలో నిర్లక్ష్యవైఖరి అవలంభిస్తుందన్నారు. నియోజక వర్గం అభివృద్ధికి నిధులు తేవటంలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అలసత్వం వహిస్తున్నారని వాఖ్యానించారు. గత బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కెసిఆర్ హాయంలోనే ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని ధీమా వ్యక్తం చేశారు.జిహెచ్‌ఎంసిలో నియోజక వర్గంలోని అన్ని గ్రామాలు విలీనం చెంది అస్తవ్యస్తంగా తయారైన స్థానిక ఎమ్మెల్యే నోరు విప్పక పోవటం సిగ్గు చేటని విమర్శించారు. రైతులకిచ్చిన హామీలన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే రైతుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి,నాయకులు కృపేష్, రమేష్ గౌడ్,వంగేటి లక్ష్మారెడ్డి, బుగ్గరాములు,చీరాల రమేష్, వేణుగోపాల్ రావు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.



## పార్కును కాపాడాలని చైతన్య మహిళా అధ్యక్షురాలు ఆశాజ్యోతి డిమాండ్

ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : పార్కు స్థలంలో ఆలయంను అడ్డుపెట్టుకుని పార్కును అక్రమంగా కబ్జా చేసి కాలనీ వాసులపై దౌర్జన్యం చేలయించాలని ప్రయత్నం చేస్తున్న కాలనీకి చెందిన అతనిపై చైతన్య మహిళా మండలి తీవ్రంగా వ్యతిరేకించి వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మహిళా మండలి అధ్యక్షరాలు రేగట్టె ఆశాజ్యోతి విమర్శించారు. వనస్థలిపురం ఫేస్1లో బీ టైఫ్ క్వార్టర్స్‌లోని వారి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2వేల గజాలకు పైగా ఉన్న పార్కు స్థలం పార్కుకు కేటాయించారు. ఆ స్థలంలో 1988లో మారుతి అనే కాలనీ వాసి చిన్న రేకుల షెడ్డు నిర్మించి బండరాయిపై అంజనేయుడి విగ్రహం పెట్టించి పూజలు చేసే వారు. కాలక్రమేనా ఆలయంగా రూపాంతరం చెందింది. అలా అక్రమణదారుల చేతులోకి వెళ్లడంతో దేవుళ్లను మార్చేసి.. శివాలయంగా మార్చి విస్తీర్ణ క్రమంగా పెంచుతూ.. సుమారు 800 గజాల వరకు పార్కు స్థలం అక్రమించారు. అలా మిగిలిన 1200 గజాలకు పైగా ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలని స్థానికులు, సీనియర్ సిటిజన్లు నిర్ణయించారు. పార్కు ఉన్న స్థలంలో స్థానిక మహిళలు చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో వారి సొంత పైసలతో రూ. 85 వేల వరకు వెచ్చించి.. ఆస్థలంలో ఉపాధి సామాజిక అవసరాల కోసం అప్పటి ప్రజా ప్రతి నిధులను ఒప్పించి ఓ భవనం నిర్మించారు. గత కొన్నేండ్లుగా పార్కు స్థలంపై కన్నేసిన కొందరు అక్రమాలు నిర్వహిస్తూ... ఆలయ కమిటీ, ట్ర స్టు పేరుపెట్టి పార్కు స్థలంలో వివిధ ఆలయ కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ప్రభుత్వం నాటిన మొక్కలను ఉద్దేశ్యపూర్వకంగా తొలగిస్తూ.. ఆ స్థలం ఆలయానిదే అనే తరహాలో కాలనీ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్న విషయం కాలనీ వాసులు అర్థం చేసుకోలేని పరిస్థితిలో ఉన్నారని ఆమె వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో సీనియర్ సిటిజన్స్ చైతన్య మహిళా మండలి సభ్యులు డి.రజిని, పి. కవిత, కె.రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం..

ప్రజాపక్షం/యాచారం : రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని తెలంగాణ రైతు సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంతం మాధవరెడ్డి విమర్శించారు. శనివారం యాచారం మండల పరిధిలోని గున్‌గల్, గడ్డమల్లాయగూడ, చౌదర్‌పల్లి, ధర్మన్నగూడ, తులేకుర్థు, నందివనపర్తి, మొగుళ్ళవంపు గ్రామాల్లో రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతు బంద్, రైతుభీమా అర్హులైన రైతులందరికి వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఋణ మాఫీ చేయాలని కొరారు. వర్షాకాలంలో రైతులకు యూరియా కష్టాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నకిలీ విత్తనాలను నకిలీ ఎరువులను ప్రభుత్వం కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సకాలంలో ఎరువులు విత్తనాలను అందజేయాలని కోరారు. ప్రభుత్వం వ్యవసాయ ప్రణాళికలు సిద్ధం చేసి యూరియాను యాఫ్ ద్వారా కాకుండా రైతులకు సరిపరా చేయాలన్నారు. రైతుల సమస్యలను తెలుసుకోని పరిష్కరించడానికి కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు టి.ప్రసాద్, రైతు సంఘం నాయకులు కె. నరేందర్,వి. లక్ష్మారెడ్డి, జి. వేణు, ఎం.యాదయ్య తదితరులు పాల్గోన్నారు.



## పూడికతీతలో అధికారుల నిర్లక్ష్యం



**ప్రజాపక్షం / కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి మండలం మూసాపేట సర్కిల్ పరిధిలోని శ్రీశ్రీనగర్, రాజీవ్ గాంధీ నగర్, ప్రశాంతి నగర్ కాలనీలకు ఆనుకుని ఉన్న నాలా పూడికతీత పనులను జిహెచ్‌ఎంసి అధికారులు సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల వర్షాకాలంలో మళ్లీ కాలనీలు ముంపు ముప్పును ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందని కూకట్‌పల్లి సిపిఐ మండల కార్యదర్శి జి.కృష్ణ ఆరోపించారు. శనివారం ఆయన నాలాను పరిశీలించి, మీడియాతో మాట్లాడుతూ ఇటీవల నాలాలో పూడికతీత పనులు చేపట్టినప్పటికీ, తొలగించిన మట్టిని పూర్తిగా బయటకు తరలించకుండా నాలా పక్కనే వదిలేయడం జరిగిందన్నారు. దీంతో వర్షపు నీరు సాఫీగా వెళ్లే మార్గం లేకుండా పోయి, భారీ వర్షాలు కురిసే సమయంలో కాలనీల్లో మళ్లీ ముంపు పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గత సంవత్సరం ఇదే నాలా కారణంగా శ్రీశ్రీనగర్, రాజీవ్ గాంధీ నగర్, ప్రశాంతి నగర్ తదితర కాలనీల్లోకి వరదనీరు చేరి పేద కుటుంబాలు తీవ్ర నష్టాలను చవిచూసాయని గుర్తు చేశారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. గత ఏడాది జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని నాలా పూడికతీత పనులు పూర్తిస్థాయిలో సక్రమంగా నిర్వహించాలని, నాలాలో పేరుకుపోయిన మట్టిని పూర్తిగా తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నాలా స్థలాన్ని కబ్జా చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకుని, సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీనగర్ సిపిఐ శాఖ కార్యదర్శి కె.మనుచారి, గంగన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.



## వైద్యులపై దాడులు సహించం.. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### కాకతీయ ఆస్పత్రిపై దాడిని ఖండిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.అశోక్ కుమార్

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** రోగులకు నిస్వార్థంగా వైద్య సేవలు అందిస్తున్న కాకతీయ ఆస్పత్రిపై జరిగిన దాడిని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ)ఉప్పల్ శాఖ తీవ్రంగా ఖండించింది. ఆస్పత్రులు, వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు చేయడం సమాజానికి మంచిది కాదని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న వైద్యులపై దాడులు చేయడం బాధాకరమని అన్నారు. కాకతీయ హస్పిటల్‌లో జరిగిన సంఘటన దురదృష్టకరమన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే చట్టబద్ధ మార్గాల్లో పరిష్కరించుకోవాలని, హింసాత్మక చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ఆస్పత్రుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాకతీయ హస్పిటల్ పై దాడి చేసిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె.అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.వి.ప్రసాద్, సభ్యులు డాక్టర్ వేణుగోపాల్ రావు, డాక్టర్ మహేష్ రెడ్డి, డాక్టర్ మాధవి, కాకతీయ ఆస్పత్రి సిఇఒ, డాక్టర్ సతీష్, డాక్టర్ సంతోష్, కాకతీయ ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## పేదవాడి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం

### ఎఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రతి నిరుపేదకు చెందిన కలను సాకారం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డిలు అన్నారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపల్ లక్ష్మాపూర్‌లో దండు లలిత యాదగిరికి మంజూరైన నూతన ఇందిరమ్మ ఇంటిని మూడు చింతలపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడానికి సిఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఆ దిశగా రాష్ట్రం ముందుకు దూసుకెళ్తుందని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బండి జగన్నాథం, ఉపాధ్యక్షుడు గుర్రం బస్వారెడ్డి, కౌన్సిలర్లు శ్రీవాణి వైద్యనాథ్, సరిత శ్రీనివాస్, గ్రామాధ్యక్షుడు కటికెల గోపి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## మానసిక, శారీరక వికాసానికి అంగన్‌వాడీలు దోహదం

### ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులు శారీరకంగా, మానసిక వికాసానికి తోడ్పటంతో పాటు ప్రాథమిక విద్యకు బలమైన పునాది వేస్తున్నాయని మేడ్చల్ జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. శనివారం శామీర్‌పేట డివిజన్ సింగాయిపల్లిలోని అంగన్‌వాడి కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ జమున ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే విద్యపై ఆసక్తి పెంపొందించేలా అంగన్‌వాడి టీచర్లు చర్యలు తీసుకుంటున్నారని, ప్రతి చిన్నారి విద్యావంతుడిగా ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాల్లో ఎంఎంసి కమిషనర్ పరిశీలన

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** వర్షాల వల్ల స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అత్యవసర సందర్భాల్లో సకాల చర్యలకు అందుబాటులో ఉండాలని ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన మల్కాజిగిరి డిప్యూటి కమిషనర్ జకియా సుల్తానాతో కల్సి మౌలాలి జడ్టీఎస్, సత్తిరెడ్డినగర్, తదితర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేసారు.

వర్షపు నీటి పారుదల వ్యవస్థ, డ్రైనేజి సమస్యలు, నీటి నిలువకు కల కారణాలను అడిగి తెల్సుకొని ఎలాంటి చర్యలు తీసుకొంటున్నారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా గతంలో మాదిరి ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ ప్రాంతాల్లో మరోసారి ముంపుకు గురికాకుండా చూడాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ కోరారు. ఈ పర్యటనలో డిఈ లౌక్య, ఎఇ జ్యోతి, శానిటేషన్ సూపర్‌వైజర్ రజనీకాంత్, హార్టికల్చర్ వెంకటేష్‌లు పాల్గొన్నారు.



## నీట్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ దీపక్ తివారి, ఎస్‌పి స్నేహమెహ్రా



**ప్రజాపక్షం/వికారాబాద్ :** నీట్ పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి, జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా చర్యలు పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు సిసికెమెరాలు, సిట్టింగ్ ఏర్పాట్లు, తదితర అంశాలను తనిఖీచేశారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా అన్ని శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 5పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, పూర్తిస్థాయిలో చెక్ చేయలనీ ఎస్‌పి ఆదేశించారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్ష నియమ నింబంధనలను తప్పని సరిగా పాటించాలని అధికారులు సూచించారు. పరీక్ష నిర్వహణలో సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలోఅదనపు కలెక్టర్ ఉమశంకర్ ప్రసాద్, ట్రైనింగ్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్, డిఎస్‌పి అంజయ్య, సాయిలత, లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## యవతలో క్రీడా స్ఫూర్తి పెంపొందేందుకు క్రీడా పోటీలు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** యవతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించటమే లక్ష్యంగా తరచు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని వినియోగించుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని రుద్ర బ్యాడ్మెంటన్ టోర్నమెంట్ నిర్వాహకులు లింగమూర్తి, గడప మహేందర్, ధనశేఖర్, శ్రీజిత్‌లు సూచించారు. నేరేడ్‌మెట్‌లోని దేవినగర్ ప్రాంతంలో ఉన్న అకాడమిలో మల్లాడి సత్యనారాయణ మెమోరియల్ పేరిట బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శనివారం జరిగింది. మల్కాజిగిరి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. టోర్నమెంట్‌లో విజేతలైన శ్యామ్, రాహుల్, రన్నర్స్‌గా నిలిచిన భీంరావు, సిద్దులకు అకాడమి మేనేజర్ శివారెడ్డి, శ్రీనివాస్‌ల సమక్షంలో బహుమతులను అందచేసారు.



## అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్, బాచుపల్లి, సాయి అనురాగ్ కాలనీలో నూతనంగా నిర్మించిన ఎస్సీ కార్యాలయాన్ని మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డితో కలిసి కొలను హన్మంత రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా హన్మంత రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి, వాటి పరిష్కార మార్గాలకు ఇలాంటి కార్యాలయాలు దోహదపడతాయని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఇలాంటి కార్యాలయాలు అవసరమని చెప్పా రు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాతే అభివృద్ధి కొనసాగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అర్హులకు అందేవిధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ కాంగ్రెస్ అధ్యక్షులు కొలను రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొలను జీవన్ రెడ్డి, నాయకులు జనార్ధన్ రావు, శంకర్ రావు, కిరన్, భాష, విక్రమ్ పాల్గొన్నారు.



## 'ఎస్‌ఐఆర్' సమర్థవంతంగా నిర్వహించాలి

### మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సచిత్ గంగ్వార్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ (ఎస్‌ఐఆర్) కార్యక్రమాన్ని బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌వో) సమర్థవంతంగా, ఉన్నతాధికారుల సమన్వయంతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సచిత్ గంగ్వార్ ఆదేశించారు.

శనివారం నేరేడ్‌మెట్‌లోని ఎస్‌ఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన బిఎల్‌వోల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎస్‌ఐఆర్‌కు సంబంధించిన ముఖ్యాంశాలను ఆయన విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డిప్యూటి కమిషనర్ జకియా సుల్తానా, మల్కాజిగిరి అసిస్టెంట్ కమిషనర్ నరసింహా రెడ్డి, మౌలాలి అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ దయానంద్, జగదీశ్వర్‌రెడ్డి, యూసిడి విభాగ డిపిఓ నిరుపమ తదితరులు పాల్గొన్నారు.

## పిఎంవిబిఆర్‌వై పథకం సద్వినియోగం చేసుకోవాలి

### బిఆర్‌ఎస్ ఎల్పి విప్ కెపి వివేకానంద




**ప్రజాపక్షం/నిజాంపేట్ :** జీడిమెట్ల పరిశ్రమలు మరిన్ని ఉద్యోగాలకు నాంది పలకాలని, పిఎంవిబిఆర్‌వైపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బిఆర్‌ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ ప్రాంతీయ ఉపాధి కార్యాలయంలో నిర్వహించిన ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పిఎంవిబిఆర్‌వై) లబ్దిదారులకు ప్రోత్సాహక నగదు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కెపి వివేకానంద విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం అర్హులైన లబ్దిదారులకు ప్రోత్సాహక నగదుని అందజేశారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఉపాది కల్పన, నైపుణ్యాభివృద్ధిమరియు పారిశ్రామిక ప్రగతిని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని వివరించారు. ఉద్యోగ జీవితాన్ని ప్రారంభిస్తున్న యువత ప్రారంభ దశలో ప్రోత్సాహం అందించేందుకు ఫస్ట్ టైమర్ ఉద్యోగులకు రూ.పదిహేను వేల వరకు ఒకేసారి ప్రోత్సాహక నగదు అందించడం ఈ పథకం ప్రత్యేకత అని పేర్కొన్నారు. యువతలో ఆత్మవిశ్వాసం పెరిగి, ఉద్యోగ రంగంలో మరింత సమర్థవంతంగా రాణించే అవకాశం లభిస్తుందని తెలిపారు. కుత్బుల్లాపూర్ జోన్‌తో సహా ఈ పథకం ద్వారా 242 మంది యజమానులు సుమా రు రూ.2.39 కోట్ల ప్రోత్సాహకాలను పొందగా 9,841 మంది ఉద్యోగులు సుమారు రూ.5.29 కోట్ల ప్రోత్సాహకాలను పొందారని వివేక్ వివరించారు. ఈ గణాంకాలు ఉద్యోగ కల్పనలో పరిశ్రమలు, యువత చురుకుగా భాగస్వాములు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా మరిన్ని సంస్థలు లబ్ది పొందడంతో పాటు స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పొంగిన కాలువలు.. ప్రజలకు నరకయాతన

### ఘనాపూర్ తండాలో మురుగు సమస్యతీవ్రం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఘట్కేకేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ పరిధిలోని ఘనాపూర్ గ్రామం ఫకీర్ టెక్కె తండాలో భూగర్భ మురుగునీటి కాలువల సమస్య తీవ్రరూపం దాల్చింది.గత మూడు నెలలుగా మురుగునీరు పొంగిపొర్లుతూ ఇళ్లలోని స్నానాల గదులు,నీటి నిల్వ గుంతల్లోకి చేరుతుండటంతో తండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మురుగునీరు చేరడంతో స్నానాల గదులను ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడిందని కుటుంబ సభ్యులు వంటగదుల్లోనే స్నానాలు చేయాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని మాజీ సర్పంచ్ వేముల సంజీవ గౌడ్ ఆరోపిస్తున్నారు.మురుగునీటి కారణంగా దుర్వాసన వ్యాపిస్తోందని అంటువాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించి తండా ప్రజలను ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని వారు అధికారులను కోరుతున్నారు.



## రామ్‌దేవ్ రావు హాస్పిటల్‌కు బెస్ట్ పొల్యూషన్ కంట్రోల్ అవార్డు

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కూకట్‌పల్లిలోని రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ ప్రతిష్ఠాత్మక హెల్త్‌కేర్ లీడర్‌షిప్ కాన్ఫరెన్స్‌లో బెస్ట్ పొల్యూషన్ కంట్రోల్ అవార్డును అందుకుని మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. హైటెక్‌సిటీలోని యశోద హాస్పిటల్స్ వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రి తరపున సిఇఒ డా.ఎన్.యోబు ఈ అవార్డును శుక్రవారం అందుకున్నారు. కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, బయోమెడికల్ వ్యర్థాల సమర్థ నిర్వహణ, హరిత ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల అమలులో ఆసుపత్రి చేసిన విశిష్ట కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. ఆరోగ్యరంగంలో నాణ్యమైన సేవలతో పాటు పర్యావరణ బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తున్న ఆసుపత్రిగా రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ నిలుస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై అవార్డును అందజేశారు. ఈ అవార్డు ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, సహాయక సిబ్బంది సమిష్టి కృషికి నిదర్శనమని, భవిష్యత్తులో మరింత ఉన్నత ప్రమాణాలతో సేవలు అందించేందుకు ఇది ప్రేరణగా నిలుస్తుందని డా.ఎన్.యోబు తెలిపారు.



## విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి రూ.30వేల కోట్ల నిధులు కేటాయించడం ద్వారా విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ అన్నారు. శనివారం బాలానగర్ మండల పరిధిలోని బబ్బుగూడ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు రేణుక, స్ఫూర్తి, విఘ్నేష్‌లకు ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ సమాజంలో గుర్తింపు, గౌరవం విద్య ద్వారానే లభిస్తాయని అన్నారు. ప్రతి విద్యార్థి విజయమే లక్ష్యంగా పెట్టుకుని పోటీపడి చదవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తుందని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, డివిజన్ అధ్యక్షుడు సతీష్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి (ఏఎంసీ డైరెక్టర్), రవి గౌడ్, నరసింహులు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు, టీచర్లకు కొత్త కిషోర్ గౌడ్ సన్మానం

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బోడుప్పల్ జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో 2026 విద్యా సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ అభినందించి, ఘనంగా సత్కరించి రూ.12000/– రూపాయలను విద్యార్థులకు అందించారు. అత్యధిక మార్కులు సాధించి స్కూల్ టాపర్ గా నిలిచిన విద్యార్థికి రూ.5000/ రూపాయలు, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన ఇద్దరు విద్యార్థులకు 3000/ రూపాయల నగదు బహుమతిని అందించారు. అదేవిధంగా అకుంఠిత దీక్షతో నిరంతరం ఉత్తమ విద్య బోధన చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బంధాన్ని కిషోర్ గౌడ్ ఘనంగా సత్కరించి అభినందించారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగాలని, తల్లిదండ్రులకు, గురువులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఆసర్ల బీరప్ప, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉపేందర్, ప్రశాంత్, అర్జున్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

**ప్రజాపక్షం/తాండూరు:** ప్రతి కార్మీకుడు ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకోవాలని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ నీరాజబాల్‌రెడ్డి సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయం అవరణలో పాతకిండ్, యశోద హస్పిటల్ వారి సౌజన్యంతో మెగాహెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రజాక్, కమీషనర్ రాజేష్‌రెడ్డి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, ఇంచార్జీ శానీటరి ఇన్స్పెక్టర్ రాములు, యశోద, హాస్పిటల్ కార్పోరేట్ రిలేషన్స్ డిప్యూటీ మేనేజర్ ఎస్ శ్రీధర్, వైద్యులు, నీలోఫర్ కౌన్సిలర్‌లు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రియుడితో కలిసి రెండేళ్ల కుమారుడిని కొట్టి చంపిన తల్లి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని రెండేళ్ల కుమారుడిని ప్రియుడితో కల్సి ఓ కర్కోటక తల్లి హతమార్చిన ఉదంతం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. కుమారుడు బెడ్‌పై ప్రమాదవశాత్తు కింద పడి పోవటం వల్లే చనిపోయాడని తల్లి చెప్పిన మాటలను నమ్మి మృతదేహానికి అంత్యక్రియలు సైతం జరిపించిన అనంతరం భర్తకు తలెత్తిన అనుమానాలతో సిసి కెమెరాలు పరిశీలించటంతో భార్యే కొట్టి చంపిందన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చీర్యాల హిడెన్ గార్డెన్‌లో క్యాబ్ డ్రైవర్‌గా జీవనం గడుపుతున్న తీగుళ్ల గ్రామానికి చెందిన స్వామి భార్య జ్యోతి ఒక కుమార్తె, రెండేళ్ల కుమారుడితో కల్సి నివసిస్తున్నారు. జ్యోతి తన వివాహం జరిగిన తొలి రోజుల్లోనే పరిచయం అయిన నవీన్ అనే యువకుడితో అక్రమ సంబంధం ఏర్పరచుకొని భర్త వృత్తి రీత్యా ఇంటి నుండి బయటకు వెళ్లిన సమయంలో ఇంటికి పిలిపించుకొనేది. ఈ క్రమంలో గత నెల 29న భర్త లేని సమయాన్ని చూసి ఇంటికి ప్రియుడు నవీన్‌ను పిలిపించుకొన్న సమయంలో ఆమె రెండేళ్ల కుమారుడు తరచు ఏడుస్తుండటంతో విసిగిపోయిన ఆమె ప్రియుడు నవీ తో కల్సి చితకబాదారు. ప్రియుడు వెళ్లి పోగానే తీవ్ర గాయాలతో ఉన్న బాలుడి విషయాన్ని భర్తకు చెప్పి బెడ్‌పై నుండి ప్రమాదవశాత్తు కింద పడిపోయాడని చెప్పి పిలిపించింది. సమీపంలోని ఆస్పత్రికి తీసుకొని వెళ్లినప్పటికి బాలుడు అప్పటికే మృతి చెందాడని వైద్యులు చెప్పారు. భార్య జ్యోతి మాటలను నమ్మిన భర్త స్వామి బాలుడికి అంత్యక్రియలు సైతం పూర్తి చేసారు. కాగా భార్య ప్రవర్తనపై అనుమానాలు ఏర్పడటంతో కాలనీలోని సిసి కెమెరాలను పరిశీలించిన నేపథ్యంలో తన ఇంటికి ఓ యువకుడు రావటాన్ని గమనించి భార్యను ప్రశ్నించినప్పటికి సరైన జవాబివ్వక పోవటంతో భార్యపై కీసర పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసాడు. విచారణ చేపట్టిన పోలీసులు జ్యోతిని అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించటంతో చివరికి తాను ప్రియుడు నవీన్‌తో కల్సి కొట్టటం వల్లే చనిపోయాడంటూ నేరాన్ని అంగీకరించింది. అంత్యక్రియలు జరిగిన తీగుళ్ల గ్రామంలో గాంధీ వైద్యకళాశాల ఫోరెన్సిక్ వైద్య బృందం, రెవెన్యూ అధికారులు, పోలీసుల సమక్షంలో రీ పోస్టుమార్టం నిర్వహించారు. పరారీలో ఉన్న నవీన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ :** విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిప్యూటీ సిఎం మల్లుభట్టి విక్రమార్కకు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## పోలీసులకు ఆరోగ్య శిబిరం




**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్ :** శాంతి భద్రతల పరిరక్షణలో బిజీగా ఉండే పోలీసుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా బంజారాహిల్స్ ఏసీపీ ఎస్.వెంకట్‌రెడ్డి, మధురానగర్ సీఐ హెచ్.ప్రభాకర్ నేతృత్వంలో శనివారం మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో మెడార్ట్స్ ఆసుపత్రికి చెందిన పోషకాహార నిపుణుడు డాక్టర్ ఏ.కిరణ్ కుమార్, వైద్యులు డాక్టర్ నితిన్, దినేష్, శివశంకర్లు ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మధురానగర్ డీఐ ఎ.శ్రీనివాస్, ఎస్ఐలు శివశంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## మారేడుపల్లిలో ఎక్సైజ్ అధికారుల దాడి

### రూ.18లక్షల విలువైన 17.42 కేజీల గంజాయి స్వాధీనం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఒడిశాలోని బరంపూర్ జిల్లా నుంచి మహారాష్ట్రలోని నాందేడ్‌కు అక్రమంగా తరలిస్తున్న భారీ గంజాయి రవాణాను హైదరాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు భగ్నం చేశారు. మారేడుపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నిర్వహించిన ప్రత్యేక నిఘాలో రూ.18 లక్షల విలువ చేసే 17.42 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అరెస్టు చేశారు.ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ చంద్రశేఖర్ గౌడ ఎస్ఐ కోటమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం పక్కా సమాచారంతో వల పన్ని నిందితుడిని అదుపులోకి తీసుకుంది. ఒడిశాలోని బరంపూర్ జిల్లా నుంచి రైలు మార్గంలో గంజాయిని తీసుకొచ్చిన రాహుల్ సేతి (27) అనే వ్యక్తి, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగిన అనంతరం మారేడుపల్లి స్టేషన్ వద్ద నాందేడ్‌కు చెందిన వ్యక్తులకు మత్తు పదార్థాన్ని అప్పగించేందుకు వేచి ఉండగా అధికారులు అతడిని పట్టుకున్నారు.నిందితుడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. వాటిని తూకం వేయగా మొత్తం 17.42 కిలోలుగా ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.18 లక్షలు ఉంటుందని సిఐ చంద్రశేఖర్ గౌడ తెలిపారు.ఈ ఆపరేషన్‌లో ఎస్ఐలు శ్రీనివాస్, రూప, భూపాల్, హెడ కానిస్టేబుల్ హాఫీజ్, కానిస్టేబుళ్లు మురళి, జంగయ్య, శేఖర్, శోభ, శశిధర్ పాల్గొన్నారు. అరెస్టు చేసిన రాహుల్ సేతిని గంజాయితో పాటు మారేడుపల్లి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి తదుపరి విచారణ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.



## ఆరోగ్యకర వృద్ధాప్యంపై అవగాహన

**ప్రజాపక్షం/యుకుత్‌పురా:** యోగ ఫర్ హెల్తీ ఏజింగ్ అనే అంశంపై మోతి గల్లిలోని ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రిలో ప్రత్యేక యోగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.లక్ష్మీదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యోగా ప్రాముఖ్యత, ఆరోగ్యకర వృద్ధాప్యానికి దాని అవసరంపై వైద్యులు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కె.జ్యోతి, డాక్టర్ పి. రాధాకృష్ణ, ఫార్మసిస్ట్ నవనీత వరలక్ష్మి, గంగమ్మ, అస్లం, జూనియర్ వైద్యులు డాక్టర్ ప్రణయ్ సాగర్, డాక్టర్ సాయిలక్ష్మి, డాక్టర్ వర్ష, డాక్టర్ నాధా మరియం పాల్గొన్నారు.




## అడ్వకేట్స్‌కు హెల్త్ కార్డులు ఇవ్వాలి

**ప్రజాపక్షం/ముషీరాబాద్ :** ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎన్‌రోల్ అయిన అడ్వకేట్స్‌కు హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి అడ్వకేట్స్ హాజరయ్యారు. సంఘం గౌరవాధ్యక్షుడు జి.విద్యాసాగర్, అధ్యక్షుడు కొల్లు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి, కోశాధికారి ఇ.వేణుగోపాల్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి మాట్లాడుతూ.. అడ్వకేట్స్ అందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని.. కొత్తవారి కోసం తాజాగా టెండర్లను జీవిత బీమా కోసం ఆహ్వానించాలని కోరారు. 2019లో ఎన్‌రోల్ అయిన వారితో పాటు కొత్తగా ఎన్‌రోల్ అయిన అడ్వకేట్స్‌కు ఇన్సూరెన్స్ చేయాలన్నారు. ఈ సంవత్సరం మే 22న పిలిచిన టెండర్ల వల్ల కేవలం 20వేల మందికి మాత్రమే ఉపయోగకరమని.. ఇంకా 33 వేలకు పైగా లాయర్లుకు ఇన్సూరెన్స్ చేయవలసిన అవసరం ఉందన్నారు. భార్యాభర్తలు ఇద్దరూ అడ్వకేట్స్ అయినపుడు హెల్త్ కార్డులు ఇద్దరికీ వర్తించడంలేదని, ఒకరికే వర్తిస్తుందని కుటుంబ సభ్యులకు వర్తించడంలేదన్నారు. ధర్నాలో బార్ కౌన్సిల్ సభ్యులు ఎం.శ్రీనివాస్, సిహెచ్.శైలజ, సుజాత, రఘునాథ్, ఆకుల మహేష్‌కుమార్‌గౌడ్, అరుణ, కలవల సుచిత్ర, దేశపాక గురుకృష్ణ, ఖాజా, వెంకటేష్, కుమార్, ప్రవీణ్‌తో పాటు జిల్లాల నుంచి వచ్చిన సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి



### రసాయన ఇంజనీర్లు, నిపుణుల పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ :** రసాయన పరిశ్రమల్లో చోటుచేసుకునే లీకేజీలు, మరమ్మత్తులు, అగ్ని ప్రమాదాల నివారణలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ఈ మేరకు శనివారం భారతీయ రసాయన ఇంజనీర్ల సంస్థ నిపుణులు, పరిశ్రమల ప్రతినిధులు, పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందిన ప్రయోగశాలల ప్రతినిధులు పాల్గొన్న సమావేశంలో ప్రమాదాల గుర్తింపు, నివారణ గురించి విపులంగా చర్చించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పిసిబి సభ్య కార్యదర్శి జి.రవినాయక్ ... లీక్ డిటెక్షన్ అండ్ రిపేర్ అధ్యయనం ప్రాముఖ్యత, అగ్నిప్రమాదాలకు గల కారణాలు, వాటి నివారణకు అనుసరించాల్సిన భద్రతా చర్యలపై విస్తృతంగా చర్చించారు. భారతీయ రసాయన ఇంజనీర్ల సంస్థ నిపుణులు అధ్యయనం, పారిశ్రామిక భద్రతా అంశాలు, ప్రమాదాలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రతి పరిశ్రమలో అర్హత కలిగిన సిబ్బంది ఉండాలని, రసాయనాల నిర్వహణ, లీకేజీల గుర్తింపు, వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్ వాతావరణంలోకి విడుదల కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఉద్యోగికి తగిన శిక్షణ ఇవ్వాలని వారు సూచించారు. భారతీయ రసాయన ఇంజనీర్ల సంస్థకు చెందిన ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్, కన్సల్టెంట్లు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు అధ్యయనం, ప్రాముఖ్యతతో పాటు పారిశ్రామిక భద్రతా చర్యల అవసరంపై ప్రసంగించారు.

## సుప్రీంకోర్టుకు వెళ్లిన కేసును

# వక్రీకరించడం సరికాదు

### మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టత




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు విశాఖ ఇండస్ట్రీ కేసులో రూ.68.73 కోట్ల అంశంపై జరుగుతున్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీస్, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. కొందరు వ్యక్తులు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది ఏ వ్యక్తి నిర్ణయం వల్ల ఏర్పడిన అంశం కాదని, సుప్రీంకోర్టు వరకు వెళ్లి వచ్చిన న్యాయ ప్రక్రియ ఫలితమని ఆయన స్పష్టం చేశారు. శనివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 2004లో ఉప్పల్ స్టేడియం నిర్మాణం జరగుతున్న సమయంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, స్టేడియం నిర్మాణానికి హెసిఎ కార్యదర్శి శివలాల్‌యాదవ్ ఇతర ప్రజాప్రతినిధులు తన తండ్రి కేంద్ర మాజీ మంత్రి కాకా వెంకటస్వామిని కలిసి స్టేడియం నిర్మాణానికి నిధులు కావాలని కోరారని అన్నారు. ఆయన ఆదేశాల మేరకు నేను అంతర్జాతీయ స్థాయిలో స్టేడియం నిర్మాణానికి సహకారం అందించానని తెలిపారు. విశాఖ ఇండస్ట్రీస్ ఎవరి ఒత్తిడి లేకుండా హెచ్‌సిఎ అభ్యర్థన మేరకు మాత్రమే సహకారం అందించిందన్నారు. ఈ విషయాన్ని హెచ్‌సిఎ సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారని గుర్తు చేశారు. అనంతరం విశాఖ ఇంటర్నేషనల్ స్టేడియంగా పేరు పెట్టాల్సి ఉండగా దివంగత రాజీవ్‌గాంధి పేరు పడతామని అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్‌ఆర్ తెలుపడంతో ఆయన మీద గౌరవంతో సమ్మతించామన్నారు. అదే సమయంలో పేరు మార్చినప్పటికీ మిగిలిన హక్కులు కొనసాగుతాయని సమ్మతి తెలిపారని అన్నారు. 2011లో ఒప్పందాన్ని హెచ్‌సిఎ రద్దు చేయగా దీంతో విశాఖ ఇండస్ట్రీస్ ఆర్బిట్రేషన్‌కు వెళ్లాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం కేసు కోర్టులో ఉండగ నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. విశాఖ ఇండస్ట్రీస్‌కు ఇప్పటికీ నయా పైసా కూడా దక్కలేదని, ఆటలపై ఉన్న మమకారంతో తన తండ్రి వెంకటస్వామి పేర వచ్చిన నిధులను మళ్లీ గ్రామీణ క్రికెట్ క్రీడలకు కేటాయిస్తామని తెలపారు. కోర్టులో ఉన్న విషయంపై తప్పుగా ప్రకటనలు చేయడం సరికాదన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని, తప్పుడు ఆరోపణలకు ఖచ్చితంగా కోర్టులో సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# మాజీ సైనికుడి భూమి కాపాడాలి

### మైమునా బేగం




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** తన తండ్రి మాజీ సైనికుడు దివంగత షేక్ అహ్మద్‌కు చెందిన ఐదెకరాల భూమిని కొందరు అక్రమంగా అక్రమించుకున్నారని రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మీర్‌పూర్ గ్రామానికి చెందిన మైమునా బేగం తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భర్త రఫీ, జిపిఎ హోల్డర్ వాసిరెడ్డి సతీష్ కుమార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. తన తండ్రి షేక్ అహ్మద్‌కు 1960లలో ప్రభుత్వం ఎక్స్‌సర్వీస్‌మెన్ కోటా కింద శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామ సర్వే నెం.41/9లో ఐదు ఎకరాల భూమిని కేటాయించిందని తెలిపారు. అనంతరం 1994లో ఫైనల్ పట్టా కూడా జారీ అయిందన్నారు. అయితే 2005లో తన తండ్రి మరణానంతరం భూమిని తన పేరిట మ్యూటేషన్ చేసుకునేందుకు మండల రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించగా, ఆ భూమి నిర్మాత డి. సురేష్ బాబు ఆయన కుటుంబ సభ్యుల పేరుపై నమోదై ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. దీనిపై విచారణ జరపగా, 1992లో కాసాని కృష్ణ అనే వ్యక్తి తన తండ్రి పేరుతో నకిలీ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జిపిఎ) సృష్టించి, ఆ ఆధారంగా 1996లో భూమిని విక్రయించినట్లు తెలిసిందని ఆరోపించారు. ప్రస్తుతం ఈ భూమి దగ్గుబాటి కుటుంబంలోని సురేష్‌బాబు, వెంకటేశ్వర బాబు, రామానాయుడు, లక్ష్మీ నాయుడు, లక్ష్మీ పేరిట ఎకరం చొప్పున ఉన్నట్లు తెలిసిందన్నారు. ఈ అంశంపై న్యాయపోరాటం కొనసాగిస్తూ 2015లో కోర్టును ఆశ్రయించామని, ప్రస్తుతం ఈ కేసు కూకట్‌పల్లిలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణలో ఉందని తెలిపారు. భూమి వద్ద పనులు జరుగుతుండటంపై ప్రశ్నించగా, ఓ కన్‌స్ట్రక్షన్స్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని పేర్కొన్నారు.

జిపిఎ హోల్డర్ వాసిరెడ్డి సతీష్ కుమార్ మాట్లాడుతూ, కోర్టు తుది తీర్పు వెలువడే వరకు మైమూనా బేగం ప్రాణాలకు, ఆస్తికి రక్షణ కల్పించాలని, కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూమి వివాదంపై నిష్పక్షపాత దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని కోరారు.




## హైదరాబాద్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సు

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ :** ఒకే సిటీ, ఒకే విజన్, అపార అవకాశాలు.. అనే నినాదంతో హైదరాబాద్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, సరికొత్త ఆలోచనలతో తెలంగాణకు రండి.. ప్రతి ఆలోచన విజయవంతమవుతుందని గ్యారెంటీ ఇవ్వలేకపోవచ్చు.. కానీ నిజాయితీతో కూడిన ప్రతి ఆలోచనకు ఇక్కడ మద్దతు, అవకాశం, ఎదిగేందుకు కావాల్సిన నమ్మకం లభిస్తాయని హామీ ఇవ్వగలమన్నారు. కార్యక్రమంలో ఎస్ఏఎస్ ఇన్‌ఫ్రా చైర్మన్ డాక్టర్ జీవీ రావు, మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వైస్ చైర్మన్ డాక్టర్ సీహెచ్ ప్రీతి రెడ్డి, లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) సతీష్ దువా, లైఫ్ సైన్సెస్ అండ్ ఫార్మా సీఈఓ సర్వేష్ సింగ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.



## బోనాల ఏర్పాట్లు త్వరగా పూర్తిచేయాలి

**ప్రజాపక్షం/చార్మినార్:** తెలంగాణ సంస్కృతిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన బోనాలు పండుగ ప్రారంభం కానున్న నేపథ్యంలో నగరంలోని వివిధ దేవాలయాలలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను (రహదారులు,తాగు నీరు, లైటింగ్, క్యూ లైన్లు, ఇతర మౌలిక వసతులు) ఉత్సవాలు మొదలయ్యే లోపే త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ కమిటీ తరపున భాగ్యనగర్ బోనాల జాతర ఉమ్మడి దేవాలయ ఉరేగింపు కమిటీ అధ్యక్షుడు మాల్యాల మధుసూదన్‌యాదవ్ హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విన్నవించారు.



## టిఎంయు రంగారెడ్డి రీజినల్ కమిటీ

**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్ :** టీఎంయూ రంగారెడ్డి జిల్లా రీజినల్ కమిటీ, రీజినల్ మేనేజర్ల పరిచయ కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీఎంయూ జనరల్ సెక్రటరీ ఈ.అశ్వత్థామ రెడ్డి నూతనంగా నియమితులైన కమిటీ ప్రతినిధులను పరిచయం చేశారు. బాధ్యతలు చేపట్టిన కమిటీ సభ్యులు...రీజనల్ ప్రెసిడెంట్ ఎల్ఆర్ రెడ్డి, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న, రీజినల్ సెక్రటరీ టి.శ్రీనివాసాచారి, కోశాధికారి కె.శేఖర్, అసిస్టెంట్ సెక్రటరీ, లక్ష్మీ ప్రియ తదితరులున్నారు.




## స్వయం సహాయక సంఘాలను పెంచాలి

**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించేందుకు మరిన్ని స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చార్మినార్ జెడిసి కన్నం సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జెడిసి కార్యాలయంలో శనివారం స్వయం సహాయక సంఘాల పనితీరు, పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో డిసిలు భాస్కర్‌రెడ్డి, సుభాష్‌రావు, ఇంకేషఫ్‌అలీ, సరిత, మంగతాయారు, యూసిడీ పిఓలు రత్నమ్మ, పద్మ, కమ్యూనిటీ కోఆర్డినేటర్‌లు ప్రసన్నలక్ష్మి, రవి, నరసింహ, అలివేలు, రామకృష్ణ, యాదయ్య, విఆర్‌పీలు నరసింహ, సునీత, రిసోర్స్ పర్సన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగ ఉద్యోగులపై వివక్ష



### యుబిఐడిఇఎఫ్ ప్రతినిధుల ఆందోళన

**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్ :** బ్యాంకింగ్ రంగంలో దివ్యాంగుల హక్కుల ఉల్లంఘనలను డిఫరెంట్లీ ఏబుల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధులు న్యూఢిల్లీ లోని దివ్యాంగుల సాధికారత శాఖ భారత ప్రభుత్వం అదనపు కార్యదర్శి మన్మీత్ కౌర్ నందాను కలిసి ఆధారాలతో సహా ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దేశవ్యాప్త బ్యాంకింగ్ రంగంలో దివ్యాంగుల పట్ల సాగుతున్న వ్యవస్థాగత వివక్షను రూపుమాపేందుకు తమ పోరాటాన్ని ఉధృతం చేస్తుందని సంఘం ప్రధాన కార్యదర్శి పి.రాజశేఖర్ ప్రకటించారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం, సమాన అవకాశాల కోసం అనేక చట్టాలను, పథకాలను అమలు చేస్తుంటే, బ్యాంకింగ్ సంస్థలు మాత్రం 'ది రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసేబిలిటీస్ యాక్ట్, 2016'ను తుంగలో తొక్కుతూ, తమ ఉద్యోగుల పట్ల వివక్షను ప్రదర్శిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం పరిపాలనా లోపం కాదని.. ఇది ఒక వ్యవస్థీకృత వివక్ష అని మండిపడ్డారు. మెరిట్ అభ్యర్థులను రిజర్వేషన్ కోటాలో కలిపేసి, కింది స్థాయిలో ఉన్న దివ్యాంగులకు దక్కాల్సిన పదోన్నతులను దొడ్డిదారిన అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అదనపు కార్యదర్శిని కలిసిన వారిలో యూబిఐడిఇఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.స్వామి నాయక్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ అమిత్ పాండే తదితరులు ఉన్నారు.

# మొహర్రం ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాపక్షం/ఫలక్‌నుమా:** మొహర్రం సన్నాహాల సందర్భంగా కొత్వాల్ సజ్జనార్ బీబీకా ఆలవాను సందర్శించారు. ఉన్నతాధికారులు బీబీకా ఆలవా వద్ద ధత్తి సమర్పించి, ఇమామ్ హుస్సేన్ ఆశీర్వాదం కోరుతూ తమ గౌరవాన్ని తెలియజేశారు. మొహర్రం ఊరేగింపు కోసం జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించి, నిర్వాహకులతో సంభాషించారు. చారిత్రాత్మక బీబీ కా ఆలం ఊరేగింపునకు ముందుగా, అధికారులు శ్రీదేవి అనే ఉత్సవ ఏనుగుతో ట్రయల్ రన్ కోసం జెండా ఊపి ప్రారంభించారు. ఈ పర్యటన, శతాబ్దాల నాటి ఊరేగింపు సజావుగా జరిగేలా చూడటంలోనూ, మొహర్రం సందర్భంగా శాంతిభద్రతలను కాపాడటంలోనూ హైదరాబాద్ పోలీసులు కట్టుబడి ఉన్నారని తెలిపారు.

## 'సర్'పై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/అంబర్‌పేట్ :** ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (సర్)పై వివిధ పార్టీలకు చెందిన బిఎల్‌ఏలకు శనివారం చే నంబర్‌లోని మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈఆర్ఓ మారుతి దివాకర్, ఏఈఆర్ఓలు రవీందర్, డెన్సిల్, డిప్యూటీ తహశీల్దార్ అన్నపూర్ణ దేవి పాల్గొన్నారు.

## రేషన్ కార్డుదారులు ఇకెవైసి చేసుకోవాలి



**ప్రజాపక్షం/నల్లకుంట:** పౌరసరఫరాల శాఖ అంబర్‌పేట్ సర్కిల్ పరిధిలోని రేషన్ కార్డుదారులందరూ తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాలని నల్లకుంట డివిజన్ బిఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు గంగిశెట్టి లిఖిత గౌడ్ విజ్ఞప్తి చేశారు. బాగ్‌లింగంపల్లిలోని ఏఎస్ఓ కార్యాలయంలో ఈనెల 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ శిబిరాన్ని రేషన్ కార్డ్ దారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



## అమ్మవారికి పూజలు

**ప్రజాపక్షం/లాల్‌దర్వాజా :** సింహవాహిని మహంకాళి అమ్మవారిని సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి కె.పట్టాభిరామారావు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ జి.అరవింద్‌కుమార్‌గౌడ్ విశిష్ట అతిథికి ఘన స్వాగతం పలికి శాలువాకప్పి సన్మానించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ మాజీ అధ్యక్షుడు బద్రీనాథ్‌గౌడ్, కమిటీ సభ్యులు రంగ హరినాథ్‌గౌడ్, దశరథ్ లాల్ తదితరులు పాల్గొన్నారు.




## ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

**ప్రజాపక్షం/కాచిగూడ :** పాదచారులకు ఇబ్బందికరంగా మారిన ఫుట్‌పాత్ ఆక్రమణలపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. ఈ మేరకు కాచిగూడ చౌరస్తా నుంచి లింగంపల్లి చౌరస్తా వరకు ఫుట్ పాత్‌లపై ఉన్న ఆక్రమణలను భారీ పోలీసు బందోబస్తు నడుమ శనివారం బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. టౌన్ ప్లానింగ్ ఏసిపి కృష్ణకుమారి ఆధ్వర్యంలో సిబ్బంది రోడ్డుకిరువైపులా ఫుట్ పాత్ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన దుకాణాలను, షెడ్లను తొలగించారు. కార్యక్రమంలో కాచిగూడ సిఐ రాజశేఖర్, కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీర కౌశిక్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో ఎలా విలీనం అవుతాం?

**అసమ్మతి ఎంపిల వ్యాఖ్యలను తోసిపుచ్చిన శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రే**



**ముంబయి :** ఐక్య శివసేన ఎప్పుడూ హిందుత్వను, స్థానిక ప్రయోజనాలను కట్టుబడి ఉందని శివసేన (యుబిటి) అధినేత ఉద్ధవ్ థాక్రే స్పష్టం చేశారు. తమ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం అవుతుందనే భయంతోనే తిరుగుబాటు చేశామని ఆరుగురు ఎంపిలు చేసిన వ్యాఖ్యలను ఆయన తోసిపుచ్చారు. నాలుగేళ్లలో రెండోసారి తన పార్టీలో చీలిక ఏర్పడుతున్న తరుణంలో థాక్రే స్పందిస్తూ, శివసేన ఎవరితోనూ విలీనం కావడానికి పుట్టలేదని అన్నారు. తన తండ్రి, దివంగత బాల్ థాక్రే స్థాపించిన ఐక్య శివసేన 60వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ముంబయిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'మరాఠీ ప్రజల హక్కుల కోసం పోరాడటానికి, హిందుత్వను రక్షించడానికి ఈ పార్టీని ఏర్పాటు చేశారని ఆయన పేర్కొన్నారు. శివసేన (యుబిటి) కాంగ్రెస్‌లో విలీనం అవుతుందనే భయంతోనే తాము తిరుగుబాటు చేశామన్న ఆ ఎంపిల వాదనలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. '30 ఏళ్ల పాటు మిత్రపక్షంగా ఉన్నప్పటికీ బిజెపిలో విలీనం కాని మనం, కాంగ్రెస్‌లో ఎలా విలీనం అవుతాం? నిజానికి మహారాష్ట్ర బిజెపినే షిండే సేనలో విలీనం అవుతుందేమోనని నాకు భయంగా ఉంది'అని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌తో తీవ్రమైన రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, బిజెపి చేస్తున్నట్లుగా వారు ఎప్పుడూ శివసేనను నాశనం చేయడానికి ప్రయత్నించలేదన్నారు. పార్టీ జారీ చేసిన విప్‌ను ధిక్కరిస్తూ, శివసేన (యుబిటి)కు చెందిన తొమ్మిది మంది లోక్‌సభ ఎంపిలలో ఆరుగురు గురువారం ఢిల్లీలో జరిగిన కీలక పార్లమెంటరీ పార్టీ సమావేశానికి హాజరుకాలేదు. పార్టీ మారడానికి సిద్ధమైనట్లు కనిపిస్తున్న ఆ ఎంపిలను ఎన్నుకున్నందుకు ఓటర్లకు మాజీ ముఖ్యమంత్రి క్షమాపణలు కోరారు. ఐక్య శివసేనకు బిజెపి ద్రోహం చేసినందున, బాధ్యతతోనే 2019లో తాను ముఖ్యమంత్రి పదవిని స్వీకరించానని ఆయన పేర్కొన్నారు. 'పార్టీ కార్యకర్తలను కలవడానికి, రాష్ట్రవ్యాప్తంగా పర్యటించడానికి నేను బయటకు వెళ్లక పోతే, వారందరూ ఎన్నికల్లో ఎలా గెలిచేవారు?, (2024) లోక్‌సభ ఎన్నికల సమయంలో, నేను ప్రతి నియోజకవర్గంలోనూ ఏడు నుండి పది సభలు నిర్వహించాను. శివ సైనికులు, ఓటర్ల నమ్మకం వల్లే వారు (తిరుగుబాటుదారులు) ఎంపిలు అయ్యారు' అని ఆయన పేర్కొన్నారు. దేశం 'ఒకే పార్టీ, ఎన్నికలు లేని' విధానం వైపు పయనిస్తోందని, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని థాక్రే ఆరోపించారు. బిజెపి అనుసరిస్తున్న పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించే రాజకీయాలు ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు కలిగిస్తున్నాయన్నారు. అలాగే, ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజలకు ఉన్న నమ్మకం సన్నగిల్లుతోందని ఆయన హెచ్చరించారు.

# నింబాల్కర్ హత్యకేసులో నిందితులు నిర్దోషులు

**విడుదలచేసిన స్పెషల్ కోర్టు**



**ముంబయి :** మహారాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పవాన్‌రాజే నింబాల్కర్, అతని డ్రైవర్ హత్యకు సంబంధించి 2006లో జరిగిన హత్య కేసులో మహారాష్ట్ర మాజీ హోం మంత్రి పదమ్‌సింహ్ పాటిల్‌ను శనివారం ఇక్కడి ఒక ప్రత్యేక న్యాయస్థానం నిర్దోషులుగా విడుదల చేసింది. ప్రత్యేక సిబిఐ కోర్టు న్యాయమూర్తి సత్యనారాయణ్ నవందర్ ప్రకారం కుట్రల పరంపరను నిరూపించడంలో ప్రాసిక్యూషన్ వైఫల్యం చెందింది. ప్రాసిక్యూషన్ ప్రధానంగా నిందితుడిగా ఉండి అప్రూవర్‌గా మారిన పరస్మల్ జైన్ వాంగ్మూలంపై ఆధారపడింది. అయితే, ఆ వాంగ్మూలం సందేహాస్పదంగా ఉంది అని, అది సంఘటనలను నిరూపించలేకపోయిందని పేర్కొంటూ ప్రత్యేక న్యాయస్థానం హత్య కేసును తోసిపుచ్చింది. మాజీ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) ఎంపి, మాజీ ఉప ముఖ్యమంత్రి సునేత్ర పవార్ సవతి సోదరుడైన పాటిల్‌తో పాటు మరో ఏడుగురు నిందితులు హత్యకేసు విచారణను ఎదుర్కొన్నారు. పవన్ రాజే నింబాల్కర్ కుమారుడు ఓంప్రకాష్ రాజే నింబాల్కర్ ప్రస్తుతం శివసేన (యుబిటి) నుంచి లోక్‌సభ సభ్యుడుగా ఉన్నారు. 2006 జూన్ 3న పవన్‌రాజే నింబాల్కర్, అతని డ్రైవర్ సమద్ కాజీ ముంబయి నుంచి ఉస్మానాబాద్‌కు (ఇప్పుడు ధారశివ్) వెళుతుండగా నవీ ముంబయిలోని కలంబొలి వద్ద ఇద్దరు కిరాయి హంతకులు వారి కారును అడ్డగించి కాల్పులు జరిపారు. దీంతో వారు అక్కడికక్కడే మరణించారు. ఈ కేసును మొదట నవీ ముంబయి పోలీసులు దర్యాప్తు చేయగా, దర్యాప్తు పురోగతిపై పవన్ రాజే నింబాల్కర్ భార్య తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బాంబే హైకోర్టు ఈ కేసును సిబిఐకి బదిలీ చేసింది. సిబిఐ కేసును స్వీకరించిన తర్వాత 2009 జూన్‌లో పదమ్‌సింహ్ పాటిల్‌ను అరెస్ట్ చేసింది. అయితే, అదే సంవత్సరం సెప్టెంబర్‌లో అలీబాగ్ (రాయిఘడ్ జిల్లా) లోని సెషన్స్ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

ఈ కేసులో పాటిల్‌తో పాటు వ్యాపారవేత్త సతీష్ మండాడే, రిటైర్డ్ స్టేట్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మోహన్ శుక్లాతో పాటు ఇతర నిందితులైన షూటర్లు కూడా ఉన్నారు. సిబిఐ కథనం ప్రకారం...ఈ కేసులో ప్రధాన నిందితుడైన పాటిల్ నేరపూరిత కుట్ర పన్ని అందుకు సంబంధించిన కాంట్రాక్ట్ మొత్తానికి డబ్బు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పవన్ రాజే నింబాల్కర్‌ను హత్యచేయడానికి పరాస్‌మల్ జైన్ మొదట మోహన్‌శుక్లా, మండాడేలను హత్య చేయించేందుకు రూ.30లక్షల కాంట్రాక్ట్‌కు అంగీకరించాడని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. అతడికి తర్వాత క్షమాభిక్ష లభించి ఇతర నిందితులకు వ్యతిరేకంగా అప్రూవర్‌గా మారాడు. 2011 జులైలో ఈ కేసు ట్రయల్ ప్రారంభమైంది. 15ఏళ్ల సుదీర్ఘ విచారణలో ప్రత్యేక న్యాయస్థానం అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడు అన్నాహజారే సహా మొత్తం 128 సాక్షులను విచారించింది. కార్యకర్తను హతమార్చడానికి పాటిల్ ఏకకాలంలో కాంట్రాక్ట్ ఇచ్చాడని జైన్ ఒప్పుకోవడంతో ఈ కేసులో అన్నాహజారే పేరు వెలుగులోకి వచ్చింది. పాటిల్ నుంచి తనకు బెదిరింపులు వచ్చినట్లు అన్నాహజారే సాక్ష్యం ఇచ్చారు.

**నిందితుల నిర్దోషిత్వాన్ని హైకోర్టు ట్రయల్ కోర్టులో సవాల్ చేయనున్న సిబిఐ**

రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పవన్‌రాజే నింబాల్కర్, అతని డ్రైవర్ హత్యకేసులో మహారాష్ట్ర మాజీ హోం మంత్రి పదమ్‌సింహ్ పాటిల్ , మరో ఏడుగురిని నిర్దోషులుగా విడుదల చేయడాన్ని సవాల్‌చేస్తూ సిబిఐ బాంబే హైకోర్టును ఆశ్రయించనున్నట్లు ఇక్కడి అధికారులు శనివారం తెలియజేశారు. నిందితుడిగా ఉండి అప్రూవర్‌గా మారిన వ్యక్తి ఇచ్చిన వాంగ్మూలం సంఘటనల క్రమాన్ని నిరూపించిందని పేర్కొంటూ, ముంబయిలోని ఒక ప్రత్యేక కోర్టు శనివారం పాటిల్ సహా ఇతరులను ఈ కేసులో నిర్దోషులుగా విడుదల చేసింది. నిందితులను నిర్దోషులుగా విడుదల చేయడాన్నిసవాల్ చేస్తూ, సిబిఐ హైకోర్ట్ ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని నిర్ణయించుకుంది. 'ఈ కేసులో నిందితులకు వ్యతిరేకంగా సిబిఐ చాలా బలమైన సాక్ష్యాలను బయట పెట్టినందున ప్రత్యేక కోర్టు తీర్పును హైకోర్టులో సవాల్ చేయనున్నాం' అని సిబిఐ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు.

# నిత్యావసరాలు కొనలేనిస్థితిలో సామాన్యుడు

**ఇతర పార్టీల నుంచి నాయకులను కొనుగోలు చేయడంలో బిజెపి బిజీ**

**కాంగ్రెస్ ధ్వజం**

**న్యూఢిల్లీ :** అధిక ద్రవ్యోల్బణం కారణంగా వేగంగా క్షీణిస్తున్న పొదుపుపై కాంగ్రెస్ శనివారం ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. సామాన్యుడు నిత్యావసరాలు కూడా కొనలేని స్థితిలో ఉండగా, బిజెపి ఇతర పార్టీల నుండి నాయకులను కొనుగోలు చేయడంలో నిమగ్నమై ఉందని మండిపడింది. మోదీ ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ లోపాల భారంతో కుటుంబాలు నాశనమవుతున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. 'అధిక ద్రవ్యోల్బణం కారణంగా వేగంగా క్షీణిస్తున్న పొదుపు. కొనలేని స్థితి, ఆకాంక్షల ద్రోహం, అసమానత, ప్రపంచ విశ్వసనీయత పతనం, యువతలో తీవ్ర ఆగ్రహం! మోదీ ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ లోపాల భారంతో కుటుంబాలు నాశనమవుతున్నాయి' ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు. 'రిటైల్ ద్రవ్యోల్బణం 16 నెలల గరిష్ఠం. ఆహార ద్రవ్యోల్బణం 4.78 శాతం, పళ్ళెంలోంచి టమాటాలు మాయం.

వైద్య ద్రవ్యోల్బణం 15 శాతం దాటింది. రూపాయి పాతాళానికి పడిపోతోంది. విదేశీ పెట్టుబడిదారులు మమ్మల్ని దూరం పెడుతున్నారు. యువతకు ఉద్యోగాలు లేవు, నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోతోంది' అని ఖర్గే పేర్కొన్నారు. బిజెపి ఇతర పార్టీల నుంచి కొనుగోళ్లలో బిజీగా ఉంది, కానీ సామాన్య ప్రజలు కనీస అవసరాలు కూడా తీర్చుకోలేకపోతున్నారని ఖర్గే ధ్వజమెత్తారు.



# నాగాలకు వ్యతిరేకంగా మణిపూర్‌లో... వందలాది మంది నిరసనర్యాలీ

**ఇంఫాల్ :** అపహరణకు గురై, ఆ తర్వాత విగతజీవులుగా కనిపించిన ఆరుగురు నాగా సంతతివారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, శనివారం మణిపూర్ రాజధానిలో వందలాది మంది నిరసనకారులు ప్రదర్శన నిర్వహించారు. ఆల్ నాగ స్టూడెంట్స్ అసోసియేషన్ మణిపూర్ (ఎన్‌ఎస్ఎఎం) ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ, దేవ్లాలాండ్‌లోని టాంగ్‌ఖుల్ బాప్టిస్ట్ చర్చి వద్ద ప్రారంభమై, సుమారు 4 కిలోమీటర్ల మేర సాగి, ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని చింగ్‌మీరాంగ్‌లో ఉన్న మణిపూర్ బాప్టిస్ట్ చర్చి వద్ద ముగిసింది. ఈ హత్యలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ర్యాలీ జరుగుతున్న సమయంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్. బీరెన్ సింగ్ కాన్వాయ్ నార్త్ ఎఒసి ప్రాంతం గుండా వెళుతున్నప్పుడు, వారు తమ నినాదాలను కొద్దిసేపు తీవ్రతరం చేశారు. ఆరుగురు పౌరుల హత్యపై ప్రజాగ్రహాన్ని ఈ ప్రదర్శన ప్రతిబింబిస్తోందని అన్సాం అధ్యక్షుడు థ్ ఆంగ్తేశాంగ్ మారింగ్ అన్నారు. అమాయక పౌరులపై జరిగిన అఘాయిత్యాలకు వ్యతిరేకంగా న్యాయం కోరుతూ ప్రజల గళాన్ని వినిపిస్తున్న ఒక భారీ ర్యాలీ ఇది అని ఆయన విలేకరులతో అన్నారు. మే 13న లీలాన్ వైఫే గ్రామం నుంచి అపహరణకు గురై, దాదాపు నెల రోజుల పాటు బందీలుగా ఉండి, ఆ తర్వాత హత్యకు గురైన ఆరుగురు నాగ పౌరులకు న్యాయం చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. 10న లీలాన్ వైఫే గ్రామం సమీపంలో ఆరుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ విషయంపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మౌనం వహించలేవని, బాధ్యులను న్యాయస్థానం ముందు నిలబెట్టేలా చూడాలని మారింగ్ అన్నారు.

# చిన్నారుల భవిష్యత్తుతో జూదం ఆడొద్దు

**నీట్ అడ్మిట్‌కార్డులో లోపాలపై రాహుల్‌గాంధీ మండిపాటు**

**ఎన్‌టిఎ విద్యార్థుల, వారి తల్లిదండ్రుల సహనాన్ని పరీక్షిస్తోందని ఆగ్రహం**

**పరీక్షలు నిర్వహించే హక్కు ఆ సంస్థకు లేదని విమర్శ**



**న్యూఢిల్లీ :** పరీక్షల్లో తప్పిదాలకు సంబంధించి కేంద్ర సర్కార్‌పై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పిల్లల భవిష్యత్తుతో జూదం ఆడటం మానుకోవాలని ఆయన హితవు పలికారు. నీట్ రీటెస్ట్‌కు సంబంధించి ఎన్‌టిఎ జారీ చేసిన అడ్మిట్ కార్డుల్లో లోపాలు బయటపడ్డాయి. నాగ్‌పూర్‌కు చెందిన ఒక నీట్‌యుజి విద్యార్థికి పునఃపరీక్ష కోసం అబుదాబిలో పరీక్షా కేంద్రం కేటాయించబడటంతో మోదీ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. 'నాగ్‌పూర్‌కు చెందిన ఒక విద్యార్థి నెల రోజులుగా నీట్ పునఃపరీక్ష కోసం సన్నద్ధమవుతున్నాడు. పరీక్షకు ఒక్క రోజు ముందు అతను తన అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అందులో అతనికి కేటాయించిన కేంద్రం అబుదాబిలో ఉన్నట్లు తేలింది. అతని దగ్గర పాస్‌పోర్ట్ లేదు, విదేశాలకు పంపే ఆర్థిక స్తోమత అతని కుటుంబానికి లేదు, పైగా సమయం కూడా లేదు. అతను రాత్రంతా ఏడ్చాడు. పరీక్ష రాయడానికి నిరాకరిస్తున్నాడు. దీనివల్ల కలిగే మానసిక ఒత్తిడి స్థాయిని ఎవరైనా ఊహించగలరా? ఇది ఎలా జరిగింది? ఏ విద్యార్థీ తమ పరీక్షా కేంద్రానికి చేరుకోలేని పరిస్థితిని ఎదుర్కోకూడదు. వాస్తవానికి ఎన్‌టిఎ దేశంలోని విద్యార్థుల, వారి తల్లిదండ్రుల సహనాన్ని పరీక్షిస్తోంది' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. ఒక విద్యార్థికి వారి సొంత నగరంలోనే పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయలేక, విదేశాల్లో కేటాయించే వ్యవస్థకు పరీక్షలు నిర్వహించే హక్కు లేదని గాంధీ స్పష్టం చేశారు. 'కోటాలో నేను చెప్పింది ఇదే: ఇది ఇకపై విద్యా వ్యవస్థ కాదు. ఇది ఒక తరం డబ్బు, సమయం, మానసిక ప్రశాంతతను దోచుకునే వ్యవస్థ' అని ఆయన అన్నారు. పిల్లల భవిష్యత్తుతో జూదం ఆడటం మానేయాలన్నారు. సున్నితమైన, బాధ్యతాయుతమైన, జవాబుదారీతనం కలిగిన విద్య, పరీక్షా విధానాన్ని పొందే అర్హత కలిగి ఉన్నారు వారికి అది లభించేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు. పేపర్ లీక్‌లు, అధిక ఫీజుల వంటి దేశ విద్యా వ్యవస్థకు సంబంధించిన సమస్యలను లేవనెత్తేందుకు రాహుల్ గాంధీ గురువారం ఒక సంతకాల సేకరణ ఉద్యమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు తమ డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచడానికి ఇది ఒక వేదిక అని ఆయన అన్నారు. రాజస్థాన్‌లోని కోటాలో జరిగిన ఒక సమావేశంలో విద్యార్థులతో సంభాషించిన మరుసటి రోజే, ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# డిఎంకె కూటమి నుంచి వైదొలిగిన ఐయుఎంఎల్

**అధికార టివికెతో రాజకీయ ప్రయాణం కొనసాగిస్తామని ప్రకటన**

**చెన్నై :** తమిళనాడులో ప్రతిపక్ష డిఎంకెకు మిత్రపక్షాలు వరుసగా షాక్ ఇస్తున్నాయి. తాజాగా ఆరు దశాబ్దాల పాటు కొనసాగిన రాజకీయ బంధానికి ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) ముగింపు పలికింది. తమిళనాడులో డిఎంకె నేతృత్వంలోని కూటమి నుండి వైదొలుగుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఇకపై అధికారంలో ఉన్న టివికెతో కలిసి తమ రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించనున్నట్లు తెలిపింది. తద్వారా, ద్రవిడ రాజకీయాల్లోని ఈ ప్రధాన పార్టీతో దశాబ్దాలుగా కొనసాగుతున్న చారిత్రాత్మక కూటమికి తెరపడింది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో డిఎంకె నేతృత్వంలోని 'సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్'లో కొనసాగలేమని, అదే సమయంలో 'తమిళగ వెట్రి కళగం' (టివికె) పట్ల ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని పేర్కొంటూ ఐయుఎంఎల్ శనివారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. మే నెలలో ప్రభుత్వం ఏర్పాటు సమయంలో ఆ పార్టీ టివికెకు మద్దతు ఇచ్చింది. పాపనాశం అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎన్నికైన ఆ పార్టీ ఎమ్మెల్యే ఎ.ఎం. షాజహాన్, విజయ్ మంత్రివర్గంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మే 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే, డిఎంకెకు దీర్ఘకాల మిత్రపక్షమైన కాంగ్రెస్ పార్టీ, టివికెతో ఎన్నికల అనంతర ఒప్పందం కుదుర్చుకుని మంత్రివర్గంలో చేరింది. ఆ పార్టీకి చెందిన ఇద్దరు శాసనసభ్యులు మంత్రులుగా నియమితులయ్యారు. భవిష్యత్తు ఎన్నికల్లోనూ టివికెతో పొత్తును కొనసాగించనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. డిఎంకె మిత్రపక్షమైన విసికెకూడా టివికె ప్రభుత్వంలో చేరగా, వామపక్ష పార్టీలు బయటి నుండి ప్రభుత్వానికి బేషరతు మద్దతు ప్రకటించాయి.

# న్యూఢిల్లీలో రేపు బ్రిక్స్ భద్రతా సమావేశం

**ప్రాంతీయ భద్రతపై చర్చ**

**న్యూఢిల్లీ :** బ్రిక్స్ దేశాలకు చెందిన అగ్రశ్రేణి భద్రతా అధికారుల సమావేశం సోమవారం (జూన్ 22) న్యూఢిల్లీలో జరుగుతుంది.మనదేశ జాతీయ భద్రతా సలహాదారు (ఎన్‌ఎస్) అజిత్ దోవల్ ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. పశ్చిమాసియాలో పరిణామాలు, రష్యా–ఉక్రేన్ యుద్ధం నేపథ్యంలో ప్రాంతీయ భద్రతపై ప్రధానంగా ఈ సమావేశంలో చర్చిస్తారు. పాకిస్థాన్ సరిహద్దుల నుండి ఎదురవుతున్న ఉగ్రవాదం,పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద గ్రూపులు జమ్మూ కశ్మీరులో నిర్వహిస్తున్న వారి క్రియాశీల కార్యకలాపాలపై భారత్ ఈ సమావేశంలో తన తీవ్ర ఆందోళనను సభ్యదేశాలకు తెలియజేసే అవకాశం ఉంది. అదేవిధంగా అఫ్గానిస్థాన్–పాకిస్థాన్ మధ్య శత్రుత్వం,ఎడతెగని సంఘర్షణ,పాకిస్థాన్ దాడుల అంశం కూడా ఈ చర్చల్లో చోటు చేసుకుంటుందని సంబంధిత వర్గాలు శనివారం చెప్పాయి. ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి ఉప కార్యదర్శి నెజామిపౌర్ కూడా ఈ సమావేశంలో పాల్గొంటారని భావిస్తున్నారు. సెప్టెంబరునెలలో భారత్‌లో నిర్వహించే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ముందుగా ఒక ఒక ప్రాతిపదికను తయారు చేయడంకోసం ఈ ఉమ్మడి సమావేశం జరుగుతుంది. ప్రస్తుతం భారత్ దీనికి అధ్యక్షస్థానంలో ఉందిగనుక ఆ హోదాలో ఈ సమావేశం నిర్వహిస్తోంది. బ్రిక్స్‌దేశాల జాతీయ భద్రతా అధికారులు, అధిపతులు,పరస్పరం తమ అభిప్రాయాలను ఇచ్చిపుచ్చుకుంటారని విదేశీ వ్యవహారాలమంత్రిత్వశాఖ పేర్కొంది.

# 23వ విడత పిఎం కిసాన్ నిధులు విడుదల

**దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మందికి పైగా రైతులకు లబ్ధి**

**తారకేశ్వర్ :** రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పిం కిసాన్ నిధులను శనివారం ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లో హూగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగిన 'పశ్చిమబంగ దివస్' (పశ్చిమ బెంగాల్ దినోత్సవం) వేడుకల్లో ప్రధాని పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నుంచే దేశ వ్యాప్తంగా 9.44 కోట్ల మందికి పైగా రైతులకు లబ్ధి చేకూర్చేలా రూ. 18,880 కోట్ల విలువైన 'పిఎం కిసాన్' పథకం 23వ విడత నిధులను ఆయన విడుదల చేశారు. రాష్ట్ర దినోత్సవ వేడుకల కోసం ఏర్పాటు చేసిన భారీ కార్యక్రమంలో ప్రధాన మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సువేందు అధికారి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు, ప్రజలు కూడా పాల్గొన్నారు. రైల్వే, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, మత్స్య, పశుసంవర్ధక రంగాలకు సంబంధించిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. కొన్నింటిని జాతికి అంకితం చేయగా, మరికొన్నింటికి శంకుస్థాపనలు చేశారు. ఈ పథకాలలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, అగ్రి స్టాక్, నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్, ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన వంటివి ఉన్నాయని పిఐబి ఒక ప్రకటనలో తెలిపింది. ప్రపంచంలోనే అతిపెద్ద పంటల బీమా పథకం ప్రయోజనాలను పశ్చిమ బెంగాల్ రైతులకు కూడా విస్తరించేందుకు, ప్రధాన మంత్రి ఆ రాష్ట్రంలో 'ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన'ను ప్రారంభించారు. ఈ పథకం ద్వారా 2026–27 నాటికి పశ్చిమ బెంగాల్‌లోని సుమారు 14 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూమిలో దాదాపు 50 లక్షల మంది రైతులకు బీమా రక్షణ కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. దీని కింద సుమారు రూ. 28,140 కోట్ల బీమా విలువ కలిగిన పంటలకు రక్షణ లభిస్తుంది. గణనీయమైన ప్రీమియం సబ్సిడీ ద్వారా రైతులకు మద్దతు లభిస్తుందని పిఐబి ఆ ప్రకటనలో పేర్కొంది. సుమారు రూ. 590 కోట్ల విలువైన కీలక రైల్వే ప్రాజెక్టులను కూడా మోదీ జాతికి అంకితం చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని వివిధ జిల్లాల్లో మొత్తం 315 కిలోమీటర్లకు పైగా విస్తరించి ఉన్న 'ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన'కింద అభివృద్ధి చేసిన 49 రహదారి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు.

# మోదీకి ప్రచారమే ప్రధానం.. ఆ తరువాతే దేశం

**కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధినేత పవన్ ఖేరా**



**న్యూఢిల్లీ :** అమెరికా దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో చర్చించనందుకు ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ప్రభుత్వం దేశం ప్రథమం అనే సూత్రానికి బదులుగా 'ప్రచారమే ప్రథమం' అనే విధానాన్ని అనుసరిస్తోందని ఆరోపించింది.

అమెరికాతో చర్చల సమయంలో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు దేశ ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చేవని పేర్కొంది. అందుకు నిదర్శనంగా ఆ పార్టీ మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్ (2013లో విదేశాంగ శాఖ అధికారి దేవయాని ఖోబ్రగాడే వివాదం సమయంలో), ఇందిరా గాంధీ వ్యవహరించిన తీరును కూడా ప్రతిపక్ష పార్టీ ఉదహరించింది. ఫ్రాన్స్‌లో జరిగిన జి7 శిఖరాగ్ర సమావేశం సందర్భంగా మోదీ–ట్రంప్ ద్వైపాక్షిక సమావేశం, వారు చేసిన బహిరంగ వ్యాఖ్యల నేపథ్యంలో, మోదీ ట్రంప్ ముందు తలదించుకుని కూర్చున్నారని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధినేత పవన్ ఖేరా పేర్కొన్నారు. 'ఆయన సోఫాలో ముడుచుకుని కూర్చుని, ట్రంప్‌ను 'ఎక్సలెన్సీ' (మహోన్నతమైన నాయకుడా) అని సంబోధించారు. ఇది నిజంగా సిగ్గుచేటు. ఒక కంపెనీ ఏజెంట్ తన బాస్‌తో మాట్లాడుతున్నట్లుగా అనిపించింది. ఇంతకు ముందెన్నడూ మేము ఒక ప్రధానిని ఇలా చూడలేదు' అని ఖేరా విలేకరుల సమావేశంలో అన్నారు. అమెరికా ముగ్గురు భారతీయ నావికులను చంపినప్పటికీ, ట్రంప్ కనీసం విచారం కూడా వ్యక్తం చేయలేదు; ఎందుకంటే నరేంద్ర మోదీ అక్కడ దీనంగా కూర్చుని, తనకు లభిస్తున్న ప్రశంసలతోనే సంతృప్తి చెందారని కాంగ్రెస్ నేత అన్నారు. 'నరేంద్ర మోదీ నవ్వుతూనే ఉన్నారు, కానీ భారతీయ నావికుల మరణం గురించి ట్రంప్‌ను ఒక్క ప్రశ్న కూడా అడగలేదు; కేవలం తన చర్మం (ఛాయ) గురించి ప్రశంసలు లభించడమే అందుకు కారణం. (విదేశాంగ మంత్రి) ఎస్. జైశంకర్ మార్కో రూబియో చేతిలో మందలింపులు తిని తిరిగి వస్తారు. నరేంద్ర మోదీ తన చర్మం గురించి ప్రశంసలు విని తిరిగి వస్తారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశ ప్రభుత్వం అంతర్జాతీయ వేదికపై అటువంటి అవమానాన్ని ఎదుర్కొని తిరిగి రావడం చాలా బాధాకరం' అని ఖేరా అన్నారు. పాకిస్థాన్‌ను ఎఫ్‌ఎటిఎఫ్ 'గ్రే లిస్ట్'లో చేర్చడంలో నాటి యుపిఎ ప్రభుత్వం విజయం సాధించింది, కానీ నేడు మోదీ 'మిత్రుడు' ట్రంప్, 'ఆపరేషన్ సింధూర్' తర్వాత పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌ను విందుకు ఆహ్వానిస్తున్నారని ఆయన అన్నారు. 1986లో 'వాయిస్ ఆఫ్ అమెరికా' సంస్థ భారత తీరానికి అత్యంత సమీపంలో శ్రీలంకలో ఒక ట్రాన్స్‌మిటర్‌ను ఏర్పాటు చేయాలని భావించిందని, అయితే రాజీవ్ గాంధీ అందుకు అనుమతించలేదని ఖేరా పేర్కొన్నారు. బ్రిటిష్ వారిని తరిమికొట్టడానికి మాకు 200 ఏళ్లు పట్టింది, కానీ కేవలం 12 ఏళ్లలోనే నరేంద్ర మోదీ తిరిగి బానిసత్వాన్ని తీసుకువచ్చారు అని ఖేరా ఆరోపించారు. 'మోదీ ప్రధానిగా ఉన్నప్పుడు భారత్‌పై ఎవరైనా దాడి చేస్తే అమెరికా అండగా నిలుస్తుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ ప్రకటన మనం అమెరికా వలస దేశం అన్నట్లుగా అనిపించేలా చేసింది... వాస్తవానికి భారత్ తన సొంత శక్తి సామర్థ్యాలతో అనేక యుద్ధాల్లో విజయం సాధించింది' అని కాంగ్రెస్ నేత అన్నారు.

# 16 రకాల ఔషధాలపై నిషేధం

**న్యూఢిల్లీ :** ప్రజారోగ్యం దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డిసి) ఔషధాల తయారీ, అమ్మకాలు, పంపిణీని కేంద్రం నిషేధించింది. ఈ ఔషధాలకు శాస్త్రీయపరమైన ఆధారాల్లేవని నిరూపితమైనట్టు పేర్కొంది. ప్రజారోగ్యాన్ని పరిరక్షించడం, ఔషధాల హేతుబద్ధమైన వినియోగాన్ని ప్రోత్సహించడం, శాస్త్రీయంగా ధ్రువీకరించిన ఔషధాలు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడటం కోసమే ఈ చర్య తీసుకున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలు అంటే రెండు లేదా అంతకంటే ఎక్కువ ఫార్మాస్యూటికల్ పదార్థాలను ఒకే మోతాదులో కలిపి తయారుచేసేవి. ఈ తరహా ఔషధాల వినియోగం, తయారీపై సుప్రీంకోర్టు ఇటీవలే కీలక ఆదేశాలిచ్చింది. దీంతో వివిధ ఔషధాల కలయికలను పరిశీలించి వాటిలో అహేతుకమైనవి, చికిత్సాపరంగా హాని కలిగించే అవకాశం ఉన్నవాటిని గుర్తించడానికి డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది.

**16 రకాల ఔషధాలపై నిషేధానికి సిఫార్సు**

ఫిక్స్‌డ డోస్ కాంబినేషన్ ఔషధాల పనితీరుపై డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డుకు చెందిన నిపుణుల కమిటీ సమీక్ష జరిపింది. ఆ తర్వాత చికిత్స మెరుగుదలకు ఎలాంటి ప్రయోజనం లేని 16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలపై నిషేధం విధించాలని కేంద్ర ప్రభుత్వానికి తెలిపింది. ఈ మేరకు యాంటిబయాటిక్స్, టాపికల్, కాస్మోటిక్స్‌కు చెందిన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్లను కేంద్రం బ్యాన్ విధిస్తూ నిర్ణయం తీసుకుంది. '16 రకాల ఫిక్స్‌డ డోస్ కాంబినేషన్ ఔషధాల తయారీ, అమ్మకం, సరఫరా, పంపిణీపై దేశవ్యాప్తంగా తక్షణమే నిషేధం అమల్లోకి వస్తుంది.

ఈ కాంబినేషన్ డ్రగ్స్ వల్ల రోగం నయం అవుతుందనడానికి ఎలాంటి శాస్త్రీయపరమైన ఆధారాల్లేవు. నిషేధించిన ఔషధాల్లో కొన్ని చర్మ సంబంధిత మందులు, పెయిన్ కిల్లర్స్, కండరాల నొప్పుల మందులు (యాంటిస్పాస్మోడిక్), యాంటీబయాటిక్స్ ఉన్నాయి' అని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా ఈ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని అన్ని రాష్ట్రాల డ్రగ్ కంట్రోలర్లు, నియంత్రణ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఔషధాల తయారీదారులు, దిగుమతిదారులు, పంపిణీదారులు, ఇతర భాగస్వాములకు కూడా చట్టానికి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది.




**కేంద్రం నిషేధం విధించిన ఎఫ్‌డిసి ఔషధాలు**

అసిటైల్ సాలిసిలిక్ యాసిడ్ విత్ ఎథోహెప్టాజైన్, డిసైక్లోమైన్, పారాసిటమాల్, క్లిడినియం బ్రోమైడ్ వంటి ఔషధాల కలయికపై కేంద్రం నిషేధం విధించింది. అలాగే గ్లిక్లాజైడ్ విత్ క్రోమియం పికోలినేట్, పారాసిటమాల్ కాంబినేషన్‌తో లిగ్నోకైన్ వంటివి ఉన్నాయి. అమోక్సిసిలిన్ విత్ సెర్రాటియోపెప్టిడేస్, సెర్రాటియోపెప్టిడేస్, లాక్టోబాసిల్లస్ స్పోరోజెనస్, సెఫురోక్సిమ్ విత్ సెర్రాటియోపెప్టిడేస్ వంటి అత్యధికంగా వాడే యాంటీబయాటిక్ కాంబినేషన్లపై కూడా నిషేధం పడింది. విటమిన్ ఇ, జోజోబా ఆయిల్, ఆరెంజ్ ఆయిల్, వీట్ జెర్మ్ ఆయిల్, టీ ట్రీ ఆయిల్ వంటివి కలిపి తయారుచేసే పలు డెర్మటోలాజికల్ లోషన్లపై కూడా కేంద్రం నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది.

అల్లంటోయిన్, డీపాంథెనాల్ వంటి పదార్థాల కలయికతో కూడిన అనేక చర్మవ్యాధి, చర్మ సంరక్షణ ఫార్ములేషన్లు కూడా నిషేధం ఎదుర్కొన్న జాబితాలో ఉన్నాయి.

**శ్రీ అంజనేయ మ్యాన్ పవర్ ఏజెన్సీస్,నిర్మల్**

**ఉద్యోగ దరఖాస్తుల ఆహ్వానం**

శ్రీ అంజనేయ మాన్యన్ పవర్ ఏజెన్సీస్ అధ్వర్యంలో నిర్మల్ జిల్లాలో తెలంగాణ మైనారిటీ సంక్షేమ గురుకులాలలో విధులు నిర్వహించుటకై నిర్మల్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి గారి లేఖ నం. Lr.No.239/TGMREIS/NRML/ThreeMen/2026,Dated:18.06.2026, Ref.The Secretary , TGMREIS, Memo No. TGMREIS-ADM/SERM/219/2026-ADMIN, Dated:04.06.2026. ప్రకారం ఈ క్రింది వివరించబడిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు అర్హులైన నిర్మల్ జిల్లా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

**ఉద్యోగ వివరాలు & అట్టి ఉద్యోగమునకు అర్హతలు ఈ క్రింది వివరించబడినవి.**

| Sl.No. | District | Name of the TMR School/Jr.College | Name of the Vacant Post Sanctioned | No.of Vacancies | Qualifications |
|---|---|---|---|---|---|
| 1. | Nirmal | TMRS&JC Nirmal Boys-1 | JL Maths | 01 | M.Sc.,Maths&B.Ed |
| 2 | | | JL Botany | 01 | M.Sc.,Botany&B.Ed |

Note: 1) Teaching Experience Minimum 3 years
2) Age: 21-44

కావున ఆసక్తి గల అభ్యర్థులు వారి దరఖాస్తు / బయోడేటతో పాటు అర్హత ధ్రువీకరణ పత్రములు జిరాక్స్ పత్రులు మరియు 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, తేది: 26.06.2026 వరకు సాయంత్రం 4 గంటల లోపు మా కార్యాలయం శ్రీ అంజేయ మ్యాన్ పవర్ ఏజెన్సీస్, నిర్మల్ ఇ.నం.7-2-65/4, బి2ఎ, సరస్వతి శివుమందిర్ రోడ్, పద్మశాలి సంఘభవన్ వెనుక, బాగులవాడ, నిర్మల్ సమర్పించుటకై తెలుపనైనది.

**గమనిక:** ఇట్టి ఉద్యోగ ప్రకటనలో సవరణలు లేదా రద్దు పర్చుటకై శ్రీ అంజేయ మ్యాన్ పవర్ ఏజెన్సీస్ గారికి సంపూర్ణ అధికారం కలదు.

**మరిన్ని వివరాలకు ఫోన్ : 9490848511, 08734-359474**

# ఎన్నికల్లో నెతన్యాహూకే మద్దతు:ట్రంప్




**వాషింగ్టన్:** ఇజ్రాయెల్ పార్లమెంటుకు ఈ ఏడాదిలో జరిగే ఎన్నికల్లో బెంజిమన్ నెతన్యాహూకే తాను మద్దతు ఇస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. ఈ ఏడాది నవంబరునాటికి ఇజ్రాయెల్‌లో పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయి. ''చాలా మట్టుకు బిబికే మద్దతు ఇస్తాను, కానీ ఆయనకు వ్యతిరేకంగా ఎవరు పోటీ చేస్తున్నారనే విషయాన్ని కూడా నేను తెలుసుకోవాలనుకుంటున్నాను, కానీ బిబికే నా మద్దతు'' అని కాన్ అనే వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ చెప్పారు. ఐతే, శనివారం ఆయనకు ఖతార్ గిఫ్ట్‌గా ఇచ్చిన విమానాన్ని ఆవిష్కరిస్తూ, నెతన్యాహూను ''వారియర్''గా ప్రశంసించారు. ఇరాన్‌తో అమెరికా చేసుకున్న ఒప్పందం సందర్భంగా ఇటీవల నెతన్యాహూ వైఖరిపై ట్రంప్ తీవ్రస్థాయిలో విరుచుకుపడుతూ వచ్చారు. ఈ వారంలో ఫ్రాన్స్‌లో ముగిసిన జి–7 సదస్సులో కూడా నెతన్యాహూపై ట్రంప్ విమర్శలు చేశారు.

ఇరాన్–అమెరికా మధ్య ఒప్పందం నుండి నెతన్యాహూను ట్రంప్ దూరంగా ఉంచారు. 14 అంశాల ఒప్పంద ప్రణాళిక గురించి ఆయనకు చెప్పలేదు. ఈ ఒప్పందంలో ఇజ్రాయెల్ గురించి ఏముందనే విషయం తనకు తెలియదని ఒక దశలో నెతన్యాహూ అన్నారు. బిబికి కి తాను చెప్పినట్టు వినడం తప్ప మరోమార్గం లేదని ట్రంప్ గతంలో వ్యాఖ్యానించారు. ఒకదశలో నెతన్యాహూను పిచ్చివాడు, వివేకం లేనివాడుగా అభివర్ణించారు. కానీ తమ మధ్య బంధాన్ని కుటుంబ బంధంగా పేర్కొన్నారు. ప్రస్తుతం స్వదేశంలో నెతన్యాహూకు తీవ్రమైన ఎదురుగాలి ఉంది. ప్రజలు ప్రతిపక్షాలు ఆయనను ఒక విఫల నాయకుడుగా చిత్రీకరించారు. యుద్ధంలో నెతన్యాహూ ఓడిపోయారని విమర్శిస్తున్నారు. ట్రంప్‌ను కూడా ఇజ్రాయెల్ మేలు కోరే వ్యక్తి కాదని మెజార్టీ ప్రజలు ఇటీవల జరిగిన ఒక సర్వేలో విమర్శించారు.

ఐ.డి.ఎఫ్ మాజీ అధినేత, యషార్‌పార్టీ నాయకుడు గాడీ ఐసెన్‌కోట్ ఇప్పుడు నెతన్యాహూకు బలమైన ప్రత్యర్థిగా ఉన్నారు.మాజీ ప్రధానమంత్రి, టుగెదర్‌పార్టీ నాయకుడు నఫ్తాలీ బెన్నెట్ కూడా చాలా బలమైన స్థానంలో ఉన్నారు. ప్రత్యర్థులు నెతన్యాహూను ఓడించే వ్యతిరేక కూటమిగా ఏర్పడే దశలో ఉన్నారు.

**ఇజ్రాయెల్ ప్రజలు కళ్ళు తెరవాలి**

ఇజ్రాయెల్ ప్రజలు మేల్కోవాలని, ట్రంప్ వ్యతిరేకతను వదిలించుకోవాలని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ విరుచుకుపడ్డారు. వైట్ హౌస్‌లో పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, ఇజ్రాయెల్ ప్రజలపట్ల సానుభూతిగల ఏకైక ప్రపంచ నాయకుడు, ఆ దేశాన్ని సమర్థించే ఏకైక బలమైన మిత్రదేశం అమెరికా మాత్రమేనన్నారు. ఇజ్రాయెల్‌కు కావాల్సిన ఆయుధాలన్నీ అమెరికాలోనే తయారవుతున్నాయన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. కానీ నెతన్యాహూ సంయమనం పాటించారని,ఆయన మంత్రివర్గంలో కొంతమంది వ్యక్తిగతంగా ట్రంప్‌ను విమర్శిస్తున్నారన్నారు.

కాగా, అమెరికా–ఇరాన్ ఒప్పదంపై ఛానల్ 12 తాజా సర్వే ప్రకారం, ఇజ్రాయెల్‌లో 71 శాతం ప్రజలు ట్రంప్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయన తమ శ్రేయస్సు చూసే మనిషి కాదని,స్వార్థపరుడని భావిస్తున్నారు. 12 శాతం ప్రజలు మాత్రమే ట్రంప్‌పై పూర్తి విశ్వాసంప్రకటించారు. మిగిలినవారు తటస్థంగా ఉన్నారు. 52 శాతం ప్రజలు ఒప్పందం ద్వారా నెతన్యాహూ దేశానికి హాని కలిగించారని భావించగా, మేలు చేశారని 24 శాతం భావించారు.



**ప్రధాని మెలోనీపై మళ్ళీ విరుచుకుపడిన ట్రంప్**

ఇటలీ ప్రధానమంత్రి మెలోనీపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శనివారం మరోసారి విరుచుకుపడ్డారు. తన ఆరోపణలను ఉద్ఘాటించారు. ఫొటో దిగాలని తనను పదే పదే ఆమె యాచించారని మళ్ళీ చెప్పారు. జి–7 సమావేశంలో మెలోనీ–ట్రంప్ పక్కపక్కనే కూర్చుని ఉన్న దృశ్యాలు చాలా కనిపించాయి. ఇటలీ వార్తాసంస్థ లా–7 కు ఆయన శుక్రవారం ఇంటర్వ్యూ ఇస్తుండగా, ఉక్రేన్ విషయాన్ని విలేకరి అడిగారు. కానీ ట్రంప్ దానిపై స్పందించకుండా అసందర్భంగా మెలోనీ పేరు ప్రస్తావించారు. జి–7 సదస్సులో తనతో కలిసి ఫొటో దిగాలని ఆమె పదేపదే అడుక్కున్నారని (బెగ్గింగ్) అన్నారు. దీనిపై మెలోనీ వెంటనే తీవ్రంగా స్పందించారు. ఇటాలియన్లు మీరు చెప్పిన విధంగా ఒకరి ముందు చేయిచాచే మనుషులు కాదని విమర్శించారు. ఆయన అసందర్భ ప్రేలాపనలపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఉద్దేశపూర్వకంగానే ఈ కథ అల్లారని విమర్శించారు. ఇటలీ విదేశీ వ్యవహారాల మంత్రి కూడా వెంటనే తన అమెరికా పర్యటన రద్దుచేసుకున్నారు. యావత్ ఇటలీ మంత్రివర్గం మెలోనీకి అండగా నిలబడింది. ఈ నేపథ్యంలో ట్రంప్ శనివారం ట్రూత్ సోషల్‌మీడియా వేదికగా స్పందిస్తూ, ఆమె పదే పదే ఫొటో కోసం వెంటపడ్డారని విమర్శించారు.

## ఉక్రేన్–పోలెండ్ మధ్య విభేదాలు

**జెలెన్స్కీ పురస్కారాన్ని వెనక్కి తీసుకున్న పోలెండ్**

**ఇది వ్యూహాత్మక తప్పిదం:ఉక్రేన్**



**వార్సా:** మిత్రదేశాలు ఉక్రేన్–పోలెండ్ మధ్య విభేదాలు భగ్గుమయ్యాయి. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో పోలెండ్ ప్రజలపై మారణకాండ సాగించిన ఉక్రేనియన్ ఇన్‌సర్జంట్ ఆర్మీ (యుపిఎ) గ్రూపు పేరును తన సైన్యంలో ఒక విభాగానికి జెలెన్స్కీ గతనెలలో నామకరణం చేశారు. దీంతో పోలెండ్ అధ్యక్షుడు కరోల్ నవ్రోకి ఆగ్రహం చెందారు. నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరినప్పటికీ ఉక్రేన్ ఎంలాంటి చర్యలూ తీసుకోలేదు. దాంతో 2023 ఏప్రిల్ ఐదో తేదీన ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీకి ''ఆర్డర్ ఆఫ్ ద వైట్ ఈగిల్'' పేరుతో ఇచ్చిన పోలెండ్ అత్యున్నతస్థాయి పురస్కారాన్ని నవ్రోకీ వెనక్కి తీసుకున్నారు. ఉక్రేన్ అధికారులు శనివారం ఈ ఉన్నతస్థాయి పురస్కారాన్ని తిరిగి పోలెండ్ అధికారులకు స్వాధీనం చేశారు. చారిత్రక సత్యాలు బేరసారాల వస్తువు కాదని, బాధిత ప్రజలను స్మరించుకోవడం పోలెండ్ రాజ్య కర్తవ్యమని నవ్రోకీ అన్నారు. ఈ ప్రకటనపై ఉక్రేన్ విదేశీవ్యవహారాలమంత్రి ఆంద్రీ సిబహ స్పందిస్తూ, పోలెండ్ తీసుకున్న నిర్ణయం వ్యూహాత్మకమైన తప్పిదమని, ఇది రష్యాకు మేలు చేస్తుందని హెచ్చరించారు. ప్రస్తుతం ఉక్రేన్‌లో అంతర్భాగంగా ఉన్న వోల్హినియా 1943–45 మధ్యకాలంలో పోలెండ్ భూభాగంగా ఉండేది. ఆనాడు ఉక్రేన్ జాతీయ యుపిఎ దళాలు చేసిన దాడుల్లో వేలాదిమంది పోలిష్ ప్రజలు ఊచకోతలకు గురయ్యారు. ఆనాటి సోవియట్ రెడ్ ఆర్మీతో కలిసి యుపిఎ దళాలు ఉక్రేన్ స్వాతంత్ర్యంకోసం నాజీ జర్మనీ, పోలాండ్ దేశాలపై వీరోచితమైన పోరాటం చేశాయని ఉక్రేన్ ప్రజలు విశ్వసిస్తారు. అందుకే 'ఉక్రేనియన్ తిరుగుబాటు సైన్యం' అనే బిరుదు వారు ఎంతో వీరోచితంగా భావిస్తారు. కానీ పోలెండ్ ప్రజలు మాత్రం యుపిఎ దళాలను అత్యంత క్రూరమైన జాతి నిర్మూలన హంతకులుగా పరిగణిస్తారు.

ఉక్రేన్‌పై రష్యా నాలుగేళ్ళక్రితం దండ యాత్ర చేసినప్పుడు పోలెండ్ ఎంతో సహాయం చేసింది. ఉక్రేన్ శరణార్థులకు పోలెండ్ ఒక ప్రధాన కేంద్రంగా మారడమే కాకుండా పాశ్చాత్యదేశాలు జెలెన్స్కీకి సహాయం చేసేందుకు ఒక మంతనాల కేంద్రంగా మారింది. దీనిని జెలెన్స్కీ విస్మరించి ఈ నిర్ణయం తీసుకున్నారు.

## వలసబోటు బోల్తా : 51 మంది మృతి

**కైరో:** లిబియా తీరంలో వలసబోటు బోల్తా పడటంతో 51 మంది మరణించారు. మరో 10 మంది మాత్రం సజీవంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఆ తర్వాత అధికారులు చేపట్టిన గాలింపు చర్యల్లో 11 మృతదేహాలను లిబియా తీరప్రాంత గస్తీ బృందాలు వెలికి తీశాయి. మరో 40 మంది మృతదేహాలకోసం గాలిస్తున్నారు. వారి జాడ తెలియరాలేదు. ఈ నెల 12వ తేదీన ఈ వలసబోటు మధ్యధరా సముద్ర జలాల్లో మునిగిపోయిందని ఆలస్యంగా తెలిసింది. ఇలాంటి ఘటనలు తరచు జరుగుతున్నాయి. గడచిన జనవరి నెలలోనే సుమారు 375 మంది వలస ప్రజలు వివిధ బోటులలో వెళుతూ మధ్యధరా సముద్రంలో మరణించారని అధికారులు ఈ సందర్భంగా గుర్తుచేశారు. పేదరికంతో బాధపడుతున్న ఈ ప్రాంత దేశాల ప్రజలు యూరప్ దేశాలకు మనుగడకోసం తరలివెళ్ళడం దశాబ్దాలుగా జరుగుతున్నదే. నిబంధనలను కఠినతరం చేయడంతో ప్రజలు అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా దళారీలు,కాంట్రాక్టర్లు ఏర్పాటు చేసిన భద్రతలేని రబ్బరు బోట్లలో ప్రయాణాలు చేస్తూ ఎలాంటి రక్షణలూ లేకుండా ప్రాణాలు కోల్పోతున్నారు. తూర్పు లిబియాలో ఈ బోటు మునిగిపోయినట్లు అబ్రీన్ గ్రూపు గుర్తించింది. ఫిబ్రవరి తొమ్మిదో తేదీన కూడా ఒక వలస ప్రజలు ఒక రబ్బరు బోటులో వెళ్ళి మునిగిపోయి 53 మంది మరణించారు.

## పోరాటమే... రాజీనామా ప్రశ్నేలేదు: స్టార్మర్

**ముందు మాంచెస్టర్‌లో ఎలా గెలవాలో ఆలోచించండి**

**ఒక గడువులోపు రాజీనామా చేయండి: రవాణమంత్రి డిమాండ్**

**లండన్:** పోరాటం చేస్తాను తప్ప రాజీనామా చేసే ప్రశ్నేలేదని బ్రిటన్ ప్రధానమంత్రి సర్ కీర్ స్టార్మర్ స్పష్టం చేశారు. ఒకరిపై మరొకరు తిరగబడ పార్టీని, ఉద్యమాన్ని చీలుస్తామని చెబుతూ దేశాన్ని గందరగోళంలోకి నెట్టకుండా నివారించాలని అందరూ ఐక్యంగా ఉండాలని మంత్రులకు, ఎంపీలకు ఫోన్లుచేసి ఆయన విజ్ఞప్తి చేశారు. ''ముందుగా ఇప్పుడు ఖాళీ అయిన గ్రేటర్ మాంఛెస్టర్ మేయర్ స్థానాన్ని లేబర్‌పార్టీ ఎలా తిరిగి గెలుచుకోవాలనే విషయంపై దృష్టి సారించాలని హెచ్చరించారు. ''రెండేళ్ళక్రితం పార్లమెంటు ఎన్నికల్లో ఘన విజయం సాధించా, దేశంలో ఆర్థిక స్థిరత్వా న్ని సాధించా, వలసలను అదుపులో పెట్టా, నేను చేయాలనుకున్నది ఇంకా చాలా ఉంది, పోటీ ఎదురైతే ఎదుర్కొంటాను, పదవి నుండి వైదొలగే ప్రశ్నేలేదు'' అన్నారు. జులై 30వ తేదీన మాంఛెస్టర్ మేయర్ పదవికి జరిగే ఎన్నికల్లో పార్టీ తిరిగి ఎలా విజయం సాధించాలో దృష్టి సారించాలని నాయకులను కోరారు. కాగా వచ్చే మంగళవారం జరిగే మంత్రివర్గ సమావేశం స్టార్మర్‌కు ఒక పెద్ద అగ్ని పరీక్ష కానున్నది.

మేకర్‌ఫీల్డ్ నియోజకవర్గానికి జరిగిన ప్రత్యేక ఎన్నికల్లో మాంఛెస్టర్ మేయర్ ఆంద్రీ బర్న్‌హాం ఎంపిగా విజయం సాధించిన తర్వాత, ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయాలంటూ స్టార్మర్‌పై ఒత్తిడి పెరిగింది. ఆయన వ్యతిరేక శిబిరం మరింత బలపడింది. తాజాగా ఆయన మంత్రివర్గంలో రవాణాశాఖ మంత్రి హైడీ అలెగ్జాండర్ కూడా ఒక ప్రకటన చేస్తూ, రాజీనామా చేయడానికి స్టార్మర్ ఒక గడువుతేదీ నిర్ణయించుకుని పదవి నుండి వైదొలగాలని డిమాండ్ చేశారు. గతంలో స్టార్మర్‌కు మద్దతు ఇచ్చిన బేబర్‌పార్టీ బ్రాక్‌నెల్ ఎం.పి పీటర్ స్వాలో మాట్లాడుతూ ''ఆయన రాజీనామాకు సమయం ఆసన్నమైంది'' అన్నారు. మంత్రులు షబనా మహమూద్, ఇంధ న మంత్రి ఎడ్ మిలిబాండ్ సహా మరికొందరు మంత్రులు కూడా స్టార్మర్ రాజీనామాకు ఒక నిర్దిష్టమైన గడువు నిర్దేశించుకోవాలని కోరారు. మంత్రులు, ఎంపీలు, కుటుంబ సభ్యులు చెప్పే మాటలను, సలహాలను ఆచరించాలని కోరారు. అదేవిధంగా స్టార్మర్ మనసు మార్చుకోవడానికి వీలుగా కొద్దిరోజులు తాము ఎలాంటి ప్రకటనలు విడుదల చేయబోమని బర్న్‌హాం మిత్రులు చెప్పారు. రెండు రోజుల క్రితం జరిగిన ఉప ఎన్నికలలో విజయం సాధించిన ఆండీ బర్న్‌హాం సోమవారం (జూన్ 22)న ఎంపీగా ప్రమాణస్వీకారం చేసి బ్రిటన్ దిగువసభలోకి అడుగుపెడుతున్నారు. గతనెలలో లండన్ పరిసర ప్రాంతాలలో జరిగిన కీలకమైన స్థానిక ఎన్నికలలో లేబర్‌పార్టీ ఘోర ఓటమి చవిచూసింది. కానీ ఈ ఉప ఎన్నికలో మాత్రం ఆండీ బర్న్‌హాం పార్టీకి వచ్చిన ఓటింగ్‌ను 45 శాతం నుండి 55 శాతానికి పెంచడంతో ఆయనపై అంచనాలు మరింతగా పెరిగిపోయాయి. ఆయనపై పోటీ చేసిన రిఫామ్స్‌పార్టీ అభ్యర్థి రాబ్ కెన్వన్‌పై 9,000 ఓట్ల ఆధిక్యతతో గెలిచారు. ఆ తర్వాత యాష్టన్ టౌన్ ఫుట్‌బాల్ క్లబ్ మైదానంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, పరిస్థితులను మార్చేయడానికి, దేశం సక్రమంగా పనిచేస్తోందని చెప్పడానికి తన విజయాన్ని ఒక అవకాశంగా భావిస్తానన్నారు. ఈ ఉత్సాహ మరింతగా పెంచి బ్రిటష్ రాజకీయాలను శాశ్వతంగా మారుస్తానని అన్నారు.

## రైతు ఆందోళనలు!

(మొదటి పేజీ తరువాయి)

ధరలతో రైతులపై మోయలేని భారం పడిందని, పెంచిన ఈ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రతి ఏటా అంతకు అంతా ధాన్యం, ఇతర పంటల ఉత్పత్తి పెరుగుతుండగా, కేంద్ర ప్రభుత్వం మాత్రం పండిన పంటల మొత్తాన్ని మద్దతు ధరలకు కోనుగోలు చేయకుండా లక్ష్యాలను తగ్గించడమంటే దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతలకు అన్యాయం చేయడమేన్నారు. కేంద్ర ప్రభుత్వం భేషరతుగా రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా పూర్తి పంటను కొనుగోలు చేసే విధంగా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు.

**ఒకే విడుతలో రైతు భరోసా నిధులు విడుదల చేయాలి :**

పెట్టుబడి సహాయం కింద ఈనెల 30న రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.అయితే ప్రభుత్వం ఎన్ని ఎకరాల వరకు రైతు భరోసా నిధులను ఇవ్వనుందో స్పష్టత ఇవ్వడంతో పాటు తొలి విడుతల్లో రైతులందరి ఖాతాలో నిధులను జమా చేయాలని డిమాండ్ చేశారు. దఫాల వారిగా నిధులు విడుదల చేయడం వల్ల అటు రైతులకు మేలు జరగడం లేదని ఇటు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు దక్కడం లేదని పేర్కొన్నారు. అంతేకాకుండా రైతులకు ఇబ్బందిగా మారిన యూరియా యాప్‌ను తక్షణమే రద్దు చేయాలని, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు అమ్ముతూ రైతులను ముంచుతున్న వ్యాపారులపై పిడది యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. బ్యాంకుల్లో రూ. 2 లక్షలకు పైగా ఉన్న రైతు రుణాలను ప్రభుత్వం ఇప్పటీ వరకు మాఫీ చేయలేదని వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పంటల బీమా పథకానికీ సంబంధించి వాతావరణ అసమతుల్యత వల్ల నష్టపోయే రైతులను ఆదుకునేందుకు 'గ్రామాన్ని యూనిట్'గా తీసుకుని కొత్త రాష్ట్రస్థాయి పంటల బీమా పథకాన్ని రూపొందించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రైతులు పండించే సన్నాలు, దొడ్డు రకం ధాన్యానికి అదనపు బోనస్ చెల్లించాలని, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో, మండల, గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి.. ఏ సమయంలో ఏ విత్తనాలు వేయాలో రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.

## ముదిరిన ఘర్షణలు

(మొదటి పేజీ తరువాయి)

ఖండించింది. ఇజ్రాయెల్– హెజ్బొల్లా కొత్తగా మళ్ళీ కాల్పుల విరమణకు అంగీకరించిన తర్వాత గడచిన 24 గంటల్లో మళ్ళీ దాడులు చెలరేగాయి. ప్రధానంగా నబతేహ్‌లోని 12 ప్రాంతాలపై ఇజ్రాయెల్ దాడులు చేసింది. పదాతిదళాన్ని మోహరించింది. కొనసాగుతున్న దాడులు ఒప్పందాన్ని నీరుగారుస్తాయని అమెరికా ఆందోళనతో ఉంది. లెబనాన్ సహా అన్ని ప్రాంతాలలో యుద్ధం ముగిసిందని శాంతి ఒప్పందం ప్రకటించింది. ఈ దాడులవల్లనే స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన అధికారిక కార్యక్రమం వాయిదా పడింది. శుక్రవారంనాడు భారీగా పరస్పర దాడులు జరిగాక కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరు పక్షాలు అంగీకరించాయి. కానీ అది కొద్ది గంటల్లోనే గాలికి కొట్టుకుపోయింది.ఒప్పందాన్ని హెజ్బొల్లా గౌరవిస్తే తామూ గౌరవిస్తామని, కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడతామని అమెరికాలో ఇజ్రాయెల్ దౌత్యవేత్త యెచియల్ లిటర్ అన్నారు. జూన్ 19న కాల్పుల విరమణకు అంగీకరించినప్పటికీ దీనిపై నెతన్యాహూ స్పందించలేదు. ఆ తర్వాత ఆయన ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెడుతూ, తన ఉత్తర్వుల మేరకు 150 హెజ్బొల్లా ఉగ్రవాదుల లక్ష్యాలపై సైన్యం దాడులు చేసిందని, డజన్ల సంఖ్యలో ఉగ్రవాదులు మరణించారని ప్రకటించారు. ఆ తర్వాత కూడాఈ దాడులు నబతెహ్‌లో కొనసాగాయి. కాగా శాంతి ఒప్పందానికి దాడులు పెద్ద ముప్పుగా మారాయన్న ఆందోళనతో అమెరికా మధ్యవర్తిత్వంలో ఈనెల 23వ తేదీ మంగళవారం వాషింగ్టన్ వేదికగా ఇజ్రాయెల్–లెబనాన్ నాయకులమధ్య మరో విడత చర్చలు జరగనున్నాయి. హెజ్బొల్లాను నిరాయుధీకరణ చేయాలనే డిమాండ్‌తో తాజాగా మళ్ళీ రగడ రేగింది. నిరాయుధీకరణకు సంబంధించిన ఏ ప్రతిపాదననైనా తాము తిరస్కరిస్తామని హెజ్బొల్లా ప్రధాన నాయకుడు షేక్ నయీమ్ ఖాస్సెమ్ ప్రకటించారు. ఇజ్రాయెల్‌తో పోరాటాన్ని తాము మనుగడ సమస్యగా భావిస్తున్నామని, లెబనాన్‌లో తమకున్న ప్రజాదరణ,సైనిక సామర్థ్యాలను తుడిచిపెట్టాలని ఇజ్రాయెల్ ప్రయత్నం చేస్తూ విస్తరణ వాదాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. ఇజ్రాయెల్ దాడులు నిలిపివేయాలని, నవంబరు 27న కుదిరిన ఒప్పందాన్ని అమలు చేయాలని, ఆక్రమిత భూభాగాన్ని తిరిగి ఇవ్వాలని, నిరాశ్రయులైన ప్రజలను తిరిగి ఇళ్ళకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్‌తో చర్చలకు దూరంగా ఉండాలని లెబనాన్‌ను కోరారు.

## గాంధీభవన్‌లో 'సత్యాగ్రహ దీక్ష'

**ప్రజాపక్షం/హైదరాబాద్:**''రఘుపతి రాజారాం పేరును బిజెపి మరిచిపోయింది. బిజెపి గాడ్సే జపం చేస్తోంది. గాడ్సే రాజ్యం స్థాపించాలని వ్యూహం పన్నుతున్నది. సొంత ఎజెండాను తీసుకొచ్చి జనాలపై రుద్దుతున్నది. అధికారంలో శాశ్వతంగా ఉండటం కోసం బిజెపి ఎంత దూరమైన వెళ్తున్నది. బిజెపి చెప్పిందే రాజ్యాంగం అనేలా వ్యవహరిస్తున్న ది. ప్రాంతీయ పార్టీలను చీల్చి చెండాడుతున్నది'' అని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించిన తీరుకు నిరసనగా రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో సేవ్ డెమాక్రసీ పేరుతో 'సత్యాగ్రహ దీక్ష'ను గాంధీభవన్‌లో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి మహేష్ కుమార్ గౌడ్, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఆల్ ఇండియా చైర్మన్




సునీల్ పన్వర్, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ హాజరయ్యారు. సత్యాగ్రహ దీక్షలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంఎల్‌ఎ నవీన్ యాదవ్, పలువురు డిసిసి అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తు న పాల్గొన్నారు. సమావేశంలో మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ మీనాక్షి నటరాజన్ విషయంలో దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, కేసు లేకుండా నామినేషన్ తిరస్కరించిన ఆర్‌ఓ ను ఉరితీసిన తప్పులేదన్నారు. జార్ఖండ్‌లో అంబానీ తరపు వ్యక్తికి సరైన పత్రాలు లేకున్నా మరోసారి అవకాశం ఇచ్చారన్నారు. బిజెపి నేతలు ఉదయం లేస్తే దేవుడి పేరు జపం చేస్తారని, దేవుడి పేరు చెప్పకుండా బిజెపి నేతలు గెలిచే దమ్ముందా? అని ప్రశ్నించారు. పవన్‌ను బూచిగా చూస్తున్నారని, బిజెపికి తెలంగాణలో స్థానం లేదని, మళ్ళీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. లౌకికవాదం ఉన్న వారి ఓట్లు తొలగించే కుట్ర ఉందన్నారు. దేశంలో 90శాతం సంపద బిజెపి నేతల అనుయాయు ల చేతిలో ఉందని, లక్షల కోట్ల ఈశాన్య రాష్ట్రాల సంపద దోచి పెడుతున్నారన్నారు.

## అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశపర్చండి

(మొదటి పేజీ తరువాయి)

మెట్రో ఫేజ్2 అమలు తదితర కీలక అంశాలను ఆ లేఖలో వివరించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 22, 23 తేదీలలో తాను న్యూఢిల్లీ పర్యటనలో ఉండనున్నట్లు కిషన్ రెడ్డికి రాసిన లేఖలో తెలియజేశారు. ఈ సందర్భంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని కోరారు. అశ్విని వైష్ణవ్‌ని కలిసి ఈ అంశాలపై చర్చించాలని ముఖ్యమంత్రి లేఖలో పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్రానికి అత్యంత కీలకమైన పట్టణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఉన్నదని తెలియజేస్తూ పెండింగ్ అంశాలు సత్వరం పరిష్కారం కావాలని సిఎం అభిలషించారు. అశ్విని వైష్ణవ్‌తో చర్చించి మెట్రోకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా వివరించి, ముందుకు వెళ్లే మార్గంపై నిర్మాణాత్మక చర్చ జరిపే అవకాశం ఉంటుందని తెలిపారు. చర్చలకు అవసరమైన సంబంధిత ఒప్పందాలు, ఇతర పత్రాల ప్రతులను కూడా వెంట తీసుకువస్తానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సమావేశ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుని, సమావేశానికి సంబంధించిన వివరాలను వీలైనంత త్వరగా తెలియజేయాలని ఆ లేఖలో కిషన్ రెడ్డిని ముఖ్యమంత్రి కోరారు.

## 'సర్'కు సంసిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

రెండో పత్రాన్ని అధికారులు తీసుకెళ్తారు. జిహెచ్‌ఎంసి పరిధిలో కేవలం ఆంగ్లంలోనే, మిగిలిన జిల్లాల్లో ఆంగ్లంతో పాటు తెలుగు భాషల్లో ఈ ఫారమ్స్ అందుబాటులో ఉంటాయని సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఎన్యూమరేషన్ ఫామ్ నింపి ఇవ్వని వారి పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చరని చెప్పారు.

**మ్యాపింగ్ కాలేదని భయం వద్దు..**

2002 నాటి ఓటర్ల వివరాలను 2026 వివరాలతో అనుసంధానించేందుకు చేపట్టిన 'మ్యాపింగ్' ప్రక్రియ రాష్ట్రంలో సగటున 70.5% పూర్తయిందని సుదర్శన్ రెడ్డి చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 80 శాతం పైగా, కొన్ని చోట్ల 93–94 శాతం అవ్వగా, అర్బన్ ఏరియాల్లో మందకొడిగా సాగుతోందన్నారు. హైదరాబాద్‌లో 45.5 శాతం, మేడ్చల్‌లో 43.5 శాత ం, రంగారెడ్డిలో 56.5 శాతం మాత్రమే మ్యాపింగ్ పూర్తయిందన్నారు. మ్యాపింగ్ అనేది కేవలం ఒక అడ్మినిస్ట్రేటివ్ ప్రక్రియ మాత్రమే అని, 'నా పేరు మ్యాపింగ్ కాలేదు కాబట్టి ఓటు తీసేస్తా రు' అనే భయం అవసరం లేదన్నారు. మ్యాపింగ్ సమయంలో 11రకాల అనామలీస్ (తప్పులు) గుర్తించినప్పటికీ, ఫామ్ నింపి ఇస్తే పేరు డ్రాఫ్ట్ రోల్లోకి వస్తుందన్నారు. ఆ తర్వాత ఈఆర్‌ఓ స్థాయి నుండి వచ్చే నోటీస్ సమయంలో సరైన పత్రా లు సమర్పిస్తే తప్పులను సవరించి తుది జాబితాలో పేరు చేరుస్తారన్నారు.

**వలస ఓటర్లు అక్కడికే వెళ్లాలి..**

**చిరునామా మార్పునకు కుదరదు**

ఖమ్మంలో ఓటు ఉండి, ప్రస్తుతం హైదరాబాద్‌లో నివసిస్తున్న వారి ఎన్యూమరేషన్ ఫామ్ ఖమ్మంలోనే ఉంటుందన్నారు. ఈనెలలోపు వారు అక్కడికే వెళ్లి ఫామ్ నింపాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత చిరునామాకు ఆ ఫామ్ రాదన్నారు. అలాగే ఎన్యూమరేషన్ ఫామ్‌లో చిరునామా మార్చడానికి కుదరదన్నారు. చిరునామా మార్పు కోసం ఫామ్ 8 (రాష్ట్రం లోపల అయితే), లేదా కొత్త ఓటరు నమోదు కోసం ఫామ్ 6 ను అక్టోబర్ 1 తర్వాత విడిగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఏపి, బీహార్, బెంగాల్, యుపి వంటి ఇతర రాష్ట్రాల ఓటర్లు కూడా 2026 జాబితాలో పేరు చూసుకుని, 2002 వివరాలతో అనుసంధానానికి ఎన్యూమరేషన్ ఫామ్ ఫిల్ చేయాలన్నారు. తప్పుడు సమాచారం ఇస్తే శిక్షార్హులవుతారన్నారు. కాగా, గత 6 నెలల్లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా దాదాపు 5 లక్షల డూప్లికేట్ ఓట్లను ఎన్నికల సంఘం ఫిల్టర్ చేసిందన్నారు.

**ఫిర్యాదులకు '1950':** ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి 10 మంది బిఎల్‌ఓలకు పైన ఒక సూపర్‌వైజర్లను నియమించామన్నారు. పొలిటికల్ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్స్ (బిఎల్‌ఎలు) కూడా వీరికి తోడ్పడుతారన్నారు. బిఎల్‌ఓలు ఇంటికి రాకపోయినా, ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయవచ్చు అన్నారు. 2002, 2026 ఓటర్ల వివరాల కోసం, అలాగే జూన్ 25 నుండి ఎన్యూమరేషన్ ఫామ్ డౌన్‌లోడ్ కోసం eci.gov. in లేదా ecitest.gov.in వెబ్‌సైట్‌లను చూడవచ్చు అన్నారు. 2002 వివరాలతో సరిగ్గా మ్యాచ్ అయిన వారికి ఎలాంటి డాక్యుమెంట్‌లు అవసరం లేదన్నారు. అనామలీస్ ఉన్నవారు మాత్రమే నోటీస్ పీరియడ్‌లో పత్రాలు ఇవ్వా ల్సి ఉంటుందన్నారు. 12 రకాల గుర్తింపు కార్డులతో పాటు పాన్, డ్రైవింగ్ లైసెన్స్, లీగల్ హెయిర్ సర్టిఫికెట్ వంటి ఇతర ప్రభుత్వ పత్రాలను అంగీకరించే నిర్ణయం ఈఆర్‌ఓల విచక్షణకు వదిలివేశారన్నారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వా సం వెంకటేశ్వర్లు, ఉప ప్రధాన ఎన్నికల అధికారి ఎ.ఎస్.చారి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## నేడు 'నీట్' పునఃపరీక్ష

(మొదటి పేజీ తరువాయి)

హాజరుకానున్నారు. ఈ పునఃపరీక్ష భారతదేశంలోని 551 నగరాల్లో, విదేశాల్లోని 14 నగరాల్లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు జరుగుతుంది. అర్హులైన దివ్యాంగ అభ్యర్థులను సాయంత్రం 6.20 గంటల వరకు పరీక్ష రాయడానికి అనుమతిస్తారు. అభ్యర్థులు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల మధ్య తమ పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 'మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రవేశ ద్వారాలు కచ్చితంగా మూసివేయబడతాయి, ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ అభ్యర్థికీ ప్రవేశం అనుమతించబడదు' అని ఎన్‌టిఎ తెలిపింది. జిల్లా యంత్రాంగాలు, పోలీసు బలగాలు, రహస్య పత్రాలను సురక్షితంగా రవాణా చేసేందుకు ఎస్కార్ట్ బృందాలను నియమించి, పునఃపరీక్షకు తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని ఎన్‌టిఎ తెలిపింది. ఈ పునఃపరీక్షలో పలు ఏజెన్సీలు, వివిధ పరిపాలనా స్థాయిల మధ్య సన్నిహిత సమన్వయం అవసరమని, నగర స్థాయి కార్యకలాపాలను పర్యవేక్షించడానికి 674 మంది నగర కోఆర్డినేటర్లను, పరీక్షా కేంద్రాలలో స్వతంత్ర పర్యవేక్షణ కోసం 6,669 మంది పరిశీలకులను నియమించినట్లు పేర్కొంది. ప్రతి పరీక్షా కేంద్రంలో సెంటర్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లను నియమించారు.

పునఃపరీక్ష సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూసేందుకు పోలీసులు, జిల్లా పరిపాలనా అధికారులతో సహా 2 లక్షలకు పైగా సిబ్బందిని సమీకరించినట్లు ఎన్‌టిఎ తెలిపింది. భద్రతా చర్యలను పటిష్టం చేసే క్రమంలో, ప్రశ్నపత్రాల రవాణా కోసం తొలిసారిగా భారత వైమానిక దళాన్ని వినియోగిస్తున్నారు. ఇదిలా ఉండగా, పునఃపరీక్షకు సన్నద్ధతను అంచనా వేయడానికి, ఏర్పాట్లను పర్యవేక్షించడానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సీనియర్ అధికారులతో పలు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాలకు అధ్యక్షత వహించారు. అక్రమాల దందాలను అరికట్టడమే ఈ చర్య లక్ష్యమని ఎన్‌టిఎ పేర్కొనగా, ప్రభుత్వం టెలిగ్రామ్‌కు ప్రాప్యతను తాత్కాలికంగా నిరోధించింది. ప్రయాణ సంబంధిత ఒత్తిడిని తగ్గించడానికి, పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా చూడటానికి, రాష్ట్ర ప్రభుత్వ బస్సు సర్వీసుల ద్వారా ఉచిత రవాణా సౌకర్యాలతో సహా పలు రాష్ట్రాలు అభ్యర్థులకు సహాయక చర్యలను ప్రకటించాయి.

## మళ్ళీ మూసివేత

(మొదటి పేజీ తరువాయి)

శనివారంనాడు హోర్ముజ్ జలసంధిని మూసేసిన దాఖలాలు ఏవీ కనిపించలేదని, 55 నౌకలు సురక్షింగా జలసంధిని దాటి వెళ్ళాయని, నౌకల సంఖ్య ఈరోజు మరింతగా పెరిగిందని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. హోర్ముజ్ మూసేసినట్లు ఎలాంటి సాక్ష్యాలు తమ వద్ద లేవని జె.డి.వాన్స్ (అమెరికా ఉపాధ్యక్షుడు) అన్నారు.

**స్విట్జర్లాండ్‌లో నేడు ఇరాన్–అమెరికా చర్చలు**

ఒప్పందాలకు సంబంధించిన అంశాలపై చర్చించడానికి ఇరాన్–అమెరికా ప్రతినిధులు స్విట్జర్లాండ్‌కు వెళ్ళారు. ఆదివారం ఇరు దేశాల ప్రతినిధులమధ్య సంభాషణలు జరుగుతాయని పాకిస్థాన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ శనివారం ప్రకటించింది. కాగా, ఒప్పందంలో పేర్కొన్న కట్టుబాట్లను కఠినంగా అమలు చేయాలని అవతలి పక్షానికి గుర్తుచేయడంకోసం ఒక బృందాన్ని స్విట్జర్లాండ్‌కు పంపుతున్నట్లు ఇరాన్ విదేశీ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఇస్మాయెల్ బఘాయీ చెప్పారని ఫార్స్ వార్తాసంస్థ శనివారం వెల్లడించింది. లెబనాన్‌పై జియోనిస్టు పాలకులు చేసే దాడులను నిలివేసేందుకు ఒత్తిడి చేయాల్సిన బాధ్యత అమెరికాదేనని అన్నారు.

అవతలిపక్షం తన బాధ్యతలు నెరవేర్చకపోతే ఒప్పందం మొత్తం పూర్తిగా ప్రమాదంలో పడుతుందని బఘాయీ అన్నారు. అవతలిపక్షం వీలైనంత త్వరగా జియోనిస్టు పాలకులపై ఒత్తిడి తీసుకు రావాల ని కోరారు. అవతలిపక్షం (అమెరికా) ఒప్పంద పత్రంలో పేర్కొన్నవిధంగా తమ బాధ్యతలను ఏ విధంగా నెరవేర్చాలనుకుంటున్నారో తెలుసుకోదలిచామని ఆయన చెప్పారు. అందుకే తమ ప్రతినిధి స్విట్జర్లాండ్‌కు వెళతారన్నారు. ఒప్పందం ప్రకారం ఇరాన్ తనవంతు బాధ్యతలకు కట్టుబడి ఉందని అన్నారు. అదేవిధంగా అమెరికా తరపున ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ స్విట్జర్లాండ్‌కు వెళతారు. తాను స్విట్జర్లాండ్‌కు వెళతానని జె.డి.వాన్స్ ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఇది చాలా సున్నితమైన విషయమని, అందువల్ల దౌత్యపరంగా సమన్వయంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు.

# శతకంతో మెరిసిన యశస్వీ

## మూడో వన్డేలోనూ భారత జట్టుకు భారీ విజయం

మూడో వన్డేలోనూ భారత జట్టుకు భారీ విజయం దక్కింది. నామమాత్రమైన మ్యాచ్‌లో గెలిచి పరువు కాపాడుకోవాలనుకున్న అఫ్గనిస్థాన్ ఆశల్ని ప్రసిధ్ కృష్ణ(5–23), యశస్వీ జైస్వాల్(110 నాటౌట్) ఆవిరి చేశారు. 219 పరుగుల ఛేదనలో ఓపెనర్ రోహిత్ శర్మ(79)తో శతక భాగస్వామ్యం నెలకొల్పిన యశస్వీ.. 50 ఓవర్ల ఫార్మాట్‌లో రెండో సెంచరీతో కదం తొక్కాడు. ఫలితంగా 28.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకున్న టీమిండియా 3–0తో సిరీస్ కైవసం చేసుకుంది. వన్డే సారథిగా శుభ్‌మన్ గిల్ తొలి సిరీస్ సాధించాడు. చెపాక్ స్టేడియంలో అఫ్గనిస్థాన్‌ను 218కే కట్టడి చేసిన భారత్ స్వల్ప లక్ష్యాన్ని 28.4 ఓవర్లలోనే ఉఫ్‌మనిపించింది. పెనాల్టీగా లభించిన ఐదు పరుగులతో ఇన్నింగ్స్ ఆరంభించి టీమిండియాకు ఓపెనర్లు రోహిత్ శర్మ(79), యశస్వీ జైస్వాల్(1110 నాటౌట్)లు అదిరే ఆరంభమిచ్చారు. కాబూలీ బౌలర్లను ఎడాపెడా బాదేసిన ఇద్దరూ స్కోర్ బోర్డును ఉరికించారు. చితక్కొడుతున్న ఈ ద్వయాన్ని విడదీసే మార్గం తెలియక అఫ్గన్ బౌలర్లు తలలు పట్టుకున్నారు. తొలి వికెట్‌కు శతక భాగస్వామ్యంతో భారత్‌ను విజయానికి చేరువ చేసిన ఈ ద్వయాన్ని నబీ విడదీశాడు. రోహిత్ ఔటైనా జోరు తగ్గించని యశస్వీ 29వ ఓవర్లో తొలి బంతిని స్టాండ్స్‌లోకి పంపి వన్డేల్లో రెండోసారి మూడంకెల స్కోరందుకున్నాడు. ఆ తర్వాత 4, సిక్సర్ బాదిన యశస్వీ.. శ్రేయస్ అయ్యర్(20 నాటౌట్)తో కలిసి గిల్ సేనకు 9 వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు.



### షాహిదీ కెప్టెన్ ఇన్నింగ్స్

తొలి రెండు వన్డేల్లో తేలిపోయిన అఫ్గనిస్థాన్ బ్యాటర్లు మూడో మ్యాచ్‌లోనూ తడబడ్డారు. ఆరంభంలోనే టాపార్డర్‌ను ప్రసిధ్ కృష్ణ(5–23) పెవిలియన్ చేర్చి కాబూలీ టీమ్‌ను హడలెత్తించాడు. ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా హష్మతుల్లా షాహిదీ(102) ఒంటరి పోరాటంతో జట్టును ఆదుకున్నాడు. అజ్మతుల్లా ఒమర్‌జాయ్(50)తో కలిసి దంచేసిన షాహిదీ వన్డేల్లో తొలి శతకంతో రెచ్చిపోయాడు. షాహిదీతో కలిసి స్కోర్ బోర్డును నడిపిస్తున్న అజ్మతుల్లాను ప్రిన్స్ యాదవ్ ఔట్ చేయడంతో.. మొహమ్మద్ నబీ(21) కాసేపు పోరాడాడు. కానీ, అతడిని గుర్నూర్ బ్రార్ బౌల్డ్ చేసి ఆరో వికెట్ అందించాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా షాహిదీ మాత్రం జోరు తగ్గించలేదు. వాషింగ్టన్ సుందర్ వేసిన 44వ ఓవర్లో బౌండరీతో ఈ కుర్రాడు తొలి శతకం అందుకున్నాడు. సెంచరీ బాదిన షాహిదీని ఔట్ చేసిన ప్రసిధ్ ఐదో వికెట్ ఖాతాలో వేసుకోగా.. 45వ ఓవర్లోనే అఫ్గనిస్థాన్ 218 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో బ్రార్, హర్ష్ దూబే చెరొక వికెట్ తీశారు.

## నేటి నుంచే టిజిటి20 ధమాకా

తెలంగాణ టీ20 లీగ్‌కు కౌంట్ డౌన్ మొదలైంది. అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ లీగ్ ఆరంభమయ్యేది ఆదివారమే. ఐపిఎల్ తరహాలో హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సిఎ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ లీగ్ తొలి సీజన్లో ఎనిమిది జట్లు పోటీపడుతున్నాయి. రామోజీ గ్రూప్ నకు చెందిన హైదరాబాద్ 'ఈ' ఛాంపియన్స్, రంగారెడ్డి రైజర్స్, మెదక్ ఫాల్కాన్స్, వరంగల్ వారియర్స్, పాలమూరు స్ట్రైకర్స్, అన్విత ఖమ్మం ఏసెస్, కరీంనగర్ డైమండ్స్, నల్గొండ నైట్స్ కదనానికి కాలుదువ్వుతున్నాయి. యువ ప్రతిభావంతులు, అనుభవజ్ఞుల సమ్మేళనంగా ఉన్న హైదరాబాద్ 'ఈ' ఛాంపియన్స్ జట్టు ట్రోఫీపై కన్నేసింది. ఉప్పల్లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం ఈ పోటీల కోసం ముస్తాబైంది. ఈ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న నటుడు విజయ్ దేవరకొండ నటించిన అధికారిక గీతాన్ని శుక్రవారం టీజీ 20 నిర్వాహకులు విడుదల చేశారు. ఎందరో యువ క్రికెటర్ల ఆశలకు వేదికగా నిలుస్తూ, తెలంగాణ క్రికెట్‌లో నూతన అధ్యాయంగా ఈ టోర్నీ ఉండబోతుందని ఈ పాట ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. ఆదివారం రాత్రి 7:15కు పాలమూరు, ఖమ్మం జట్ల మధ్య తొలి మ్యాచ్ ఆరంభంకానుంది. అంతకుముందు 5:30కి మొదలయ్యే ఆరంభ వేడుకల్లో సినీ సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ అలరించనున్నాడు. స్టార్ స్పోరట్స్ నెట్వర్క్, జియో హాట్‌స్టార్లో మ్యాచ్లు ప్రత్యక్ష ప్రసారం అవుతాయి.

## ఢిల్లీ క్యాపిటల్స్ ప్రధాన కోచ్‌గా గంగూలీకి పగ్గాలు?

భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీకి ప్రమోషన్ లభించనుంది. ఐపిఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ప్రధాన కోచ్ పదవి దాదాను వరించనుంది. ప్రస్తుతం ఢిల్లీ ఫ్రాంచైజీకి డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా సేవలందిస్తున్న గంగూలీ.. 2027 సీజన్‌లో హెడ్‌కోచ్ కానున్నాడు. తొలి టైటిల్ కోసం నిరీక్షిస్తున్న ఢిల్లీ వచ్చే ఎడిషన్‌కు కోచింగ్ యూనిట్‌ను పటిష్టం చేసుకోవాలనుకోవడమే అందుకు కారణం. అయితే.. ఈ విషయాన్ని డీసీ యాజమాన్యం ధ్రువీకరించాల్సి ఉంది. ఐపిఎల్ 19వ సీజన్‌లో నిరాశపరిచిన ఢిల్లీ క్యాపిటల్స్ వచ్చే ఎడిషన్‌కు పక్కాగా సిద్ధమవ్వాలనుకుంటోంది. ఈక్రమంలోనే ఆటగాళ్లను మార్చడమే కాదు.. కోచింగ్ దళాన్ని పటిష్టం చేసుకోవాలని డీసీ భావిస్తోంది. అందుకని టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌కు బ్యాటింగ్ కోచ్ పదవి కట్టబెట్టనున్న ఢిల్లీ.. ప్రధాన కోచ్ హేమంగ్ బదానిపై వేటు వేయనుంది. బదాని స్థానంలో సౌరవ్ గంగూలీని హెడ్‌కోచ్‌గా తీసుకోవాలని యాజమాన్యం భావిస్తోందని క్రిక్‌బజ్ కథనం పేర్కొంది. ఎస్‌ఎ 20 లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ సిస్టర్ ఫ్రాంచైజీ ప్రిటోరియా క్యాపిటల్స్‌కు కోచ్‌గా వ్యవహరించిన అనుభవం దాదాకు ఉంది. దాంతో, ఐపీఎల్‌లోనూ గంగూలీకి జట్టును సానబెట్టే బాధ్యత ఇవ్వాలని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ భావిస్తోంది.




### స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్ ఈవారం స్వల్పంగా లాభపడింది. వాస్తవానికి ఆరంభంలో లాభాలను పోగుచేసుకున్న మార్కెట్లు చివరి రోజున దారుణ పరిస్థితులు ఎదుర్కొన్నాయి. అమ్మకాల ఒత్తిడి పెరగడంతో, షేర్ మార్కెట్‌లో ధరలు పతనమయ్యాయి. అంతకు ముందు విపరీత ధోరణులు, తీవ్రమైన ఆటుపోట్లను తట్టుకొని, తిరిగి లాభాల బాట పట్టిన మార్కెట్లు, చివరి రోజున మాత్రం ఎదురుదెబ్బతిన్నాయి. ఈనెల 15వ తేదీ సోమవారం 75,527.95 పాయింట్లతో ప్రారంభమైన సెన్సెక్స్, ట్రేడింగ్‌కు చివరి రోజైన 19వ తేదీ శుక్రవారం 76,802.90 పాయింట్ల వద్ద ముగిసింది. తద్వారా, 1,274.95 పాయింట్లు లాభపడింది. అదే విధంగా జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్ఇ)లో నిఫ్టీ 23,622.90 పాయింట్లతో మొదలై, 24,013.10 పాయింట్లతో ముగియడంతో 390.20 పాయింట్లు మెరుగుపడింది.



### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (రూపాయిల్లో)

| | |
|---|---|
| 24 క్యారెట్లు: | 1,48,040 |
| 22 క్యారెట్లు: | 1,35,500 |
| 18 క్యారెట్లు: | 1,13,500 |



## నిఫ్టీ 24,200 దాటుతుందా?



గత రెండు వారాలుగా భారత స్టాక్ మార్కెట్‌లో కనిపిస్తున్న ర్యాలీకి ప్రధాన కారణం దేశీయ అంశాలు కాకుండా అంతర్జాతీయ పరిస్థితుల మెరుగుదల. ముఖ్యంగా అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గడం, ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 80 డాలర్ల దిగువకు చేరడం, రూపాయి బలపడటం మరియు విదేశీ పెట్టుబడిదారులు మళ్లీ కొనుగోళ్ల వైపు మొగ్గు చూపడం మార్కెట్‌కు బలమైన మద్దతునిచ్చాయి. మార్కెట్ నిపుణుడి దృష్టిలో చూస్తే, ప్రస్తుతం నిఫ్టీ ర్యాలీకి అతి పెద్ద బలంగా విదేశీ నిధుల ప్రవాహాన్ని పేర్కోవచ్చు. గత కొన్ని వారాల విక్రయాల తర్వాత విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తిరిగి కొనుగోళ్లు ప్రారంభించడం సెంటిమెంట్‌ను పూర్తిగా మార్చేసింది. అదే సమయంలో దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు కూడా భారీగా కొనుగోళ్లు కొనసాగించడం మార్కెట్‌కు భద్రతా కవచంలా పనిచేస్తోంది. సాంకేతికంగా కూడా నిఫ్టీ కీలకమైన స్థాయిలను అధిగమించింది. 21 రోజుల, 55 రోజుల ఇఎంఎ‌లపైన ముగియడం, ఫాలింగ్ వెడ్జ్ బ్రేక్‌అవుట్ నిర్ధారణ కావడం బుల్లిష్ ట్రెండ్ కొనసాగుతున్న సంకేతాలు. ప్రస్తుతం 23,900–23,800 జోన్ కీలక సపోర్ట్‌గా ఉండగా, 24,100–24,200 ప్రాంతం ప్రధాన రెసిస్టెన్స్‌గా మారింది. సోమవారం ట్రేడింగ్‌లో 24,200 స్థాయి అత్యంత కీలకంగా మారనుంది. ఒకవేళ నిఫ్టీ ఈ స్థాయిని అధిగమించి నిలబడగలిగితే, తదుపరి లక్ష్యాలు 24,400–24,500 వరకు ఉండవచ్చు. అయితే మార్కెట్ ఇప్పటికే వేగంగా పెరిగిన నేపథ్యంలో స్వల్పకాలిక లాభాల స్వీకరణ కూడా జరిగే అవకాశం ఉంది. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో 'బై ఆన్ డిప్స్' వ్యూహమే సరైనదిగా కనిపిస్తోంది. పెట్టుబడిదారులు మార్కెట్‌ను వెంబడించి కొనుగోలు చేయడం కంటే, ధరలు తగ్గినప్పుడు నాణ్యమైన బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డిఫెన్స్ రంగాల షేర్లలో దశలవారీగా పెట్టుబడులు పెట్టడం మంచిది.

## టెస్లా కార్లకు డిమాండ్!



టెస్లా కార్లు ఇప్పటివరకు భారతీయులకు విలాసవంతమైన, అందని ఉత్పత్తిగా కనిపించేవి. అయితే ఇప్పుడు టెస్లా తీసుకొచ్చిన కొత్త ఈజ్ ఆఫ్ ఓనర్‌షిప్ పథకం కారణంగా ఆ పరిస్థితి మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా కంపెనీ భారత మార్కెట్‌కు అనుగుణంగా ఆకర్షణీయమైన ఫైనాన్సింగ్ అవకాశాన్ని ప్రకటించింది. ఈ కొత్త పథకం ప్రకారం టెస్లా 'మోడల్ వై' కారును సుమారు రూ.6 లక్షల డౌన్ పేమెంట్‌తో కొనుగోలు చేయవచ్చు. అనంతరం నెలకు దాదాపు రూ.39,990 ఈఎంఐ చెల్లిస్తే సరిపోతుంది. ఒకేసారి భారీ మొత్తాన్ని పెట్టుబడి పెట్టలేని, కానీ ప్రీమియం ఎలక్ట్రిక్ కారును సొంతం చేసుకోవాలనుకునే వినియోగదారులకు ఇది అనుకూలమైన అవకాశంగా భావిస్తున్నారు. టెస్లా ప్రతినిధుల ప్రకారం, ప్రస్తుతం సాధారణ పెట్రోల్ కార్ల యజమానులు ఇంధనం, నిర్వహణ కోసం నెలకు గణనీయమైన మొత్తాన్ని ఖర్చు చేస్తున్నారు. పెట్రోల్ ధరల పెరుగుదలతో ఈ వ్యయం మరింత అధికమవుతోంది. అయితే ఎలక్ట్రిక్ వాహనాల్లో ఇంధన ఖర్చు లేకపోవడం, నిర్వహణ అవసరాలు తక్కువగా ఉండటం వల్ల మొత్తం వినియోగ వ్యయం తగ్గుతుందని కంపెనీ చెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా అమ్ముడవుతున్న కార్లలో టెస్లా మోడల్ వై ఒకటి. భద్రత, ఆధునిక సాంకేతికత, పనితీరు పరంగా కూడా ఈ వాహనం మంచి గుర్తింపు పొందింది. అంతే కాకుండా టెస్లా కార్లకు తరచూ సర్వీస్ అవసరం ఉండదు. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ల ద్వారా అనేక సమస్యలను దూరం నుంచే పరిష్కరించే సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుంది. హైదరాబాద్‌లో కొత్త ఎక్స్‌పీరియెన్స్ సెంటర్‌ను ప్రారంభించిన టెస్లా, భారత మార్కెట్‌పై తన దృష్టిని మరింత కేంద్రీకరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ కొత్త ఓనర్‌షిప్ పథకం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచడంతో పాటు భారతదేశంలో ఈవీ విప్లవానికి కొత్త ఊపునిచ్చే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## పాలకుల అసమర్థ విధానాలతోనే ధరల పెరుగుదల

కార్పోరేట్ శక్తులకు దాసోహామై సామాన్యులపై పెనుభారం

విజయ సారధి సిపిఐ జిల్లా కార్యదర్శి



**ప్రజాపక్షం/మరిపెడ :** కేంద్ర రాష్ట్ర పభుత్వాలు కార్పొరేట్ శక్తులకు దాసోహామై సామన్యులపై పెను భారన్ని మెపుతున్నయని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారధి అగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మహబుమామాద్ జిల్లా మరిపెడలో నిర్వాహించిన సిపిఐ మరిపెడ మండల కౌన్సిల్ సమావేశానికి ముఖ్య ఆథిది గా ఆయన హాజరై మాట్లడుతూ,దళరులుగా మరిన ప్రభుత్వలు కార్పోరేట్ శక్తులకు వేల కోట్లు దోచిపెడుతు,అన్ని రకల వస్తువులు పేట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలు విఫరీతంగా పెంచి సామన్యుడిపైన మొయలేని భారన్ని పెడుతున్నాయని, మాటల గారడితో పాలన సాగించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలకు అలావాటుగా మరిందని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం ఎన్నికలలో చెప్పిన ఆసరా పెన్సన్‌లను, అర్హులనైవారందరికి ఇందిరమ్మ ఇల్లులు, యువతకు ఉపాధి ఆవకాశాలు కల్పించాలనీ డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం కట్టిన వందలాది డబూల్ బెడ్రుమ్ ఇల్లులు పడవుపడ్డాయని వాటిని వెంటనే అర్హులైన పేదలకు పంచాలనీ కోరారు.ఈ సవేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధకర్ రెడ్డి, మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ,సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దూల్ రషిద్,మల్లేపాక యాకన్న,నారయణ, పి.వెంకన్న, వీరన్న, ఎం.వెంకన్న, పి.రమేష్, హన్మంతు, తదితరులు పాల్గోన్నారు.

## సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మౌలిక సదుపాయాలకు వినతి

ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాంనాయక్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాంనాయక్ కోరారు. ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో జిల్లా డీఆర్ఓకువినతిపత్రం అందజేసి రఘురాంనాయక్ మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 84 సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్నవిద్యార్థులందరికి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. దాంతో పాటు శిథిలావస్థలో ఉన్న భవనాలను కొత్తగా నిర్మించాలని, దాంతో పాటు అద్దె భవనంలో నడుస్తున్న సంక్షేమ హాస్టల్‌లో స్వంత స్థలం కేటాయించి నిర్మాణం చేపట్టాలని దాంతో పాటు విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా వర్షాకాలం ఉన్నందున విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కిటికీలు, డోర్లు మూత్రశాలలు మంచినీటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సుభోద్, కుషాల్, నాయకులు కిషోర్, టోకు,నీరజ్ , సాయిపవన్ పాల్గొన్నారు.




## రాజకీయ జోక్యం వల్లే పరిష్కారంకాని కార్మిక సమస్యలు

- సింగరేణికి చెల్లించవలసిన రూ.56 వేల కోట్ల బకాయిలు వెంటనే ప్రభుత్వం చెల్లించాలి
- మెడికల్ బోర్డు పాత విధానంలో కొనసాగించాలి
- సొంత ఇంటి పథకం వెంటనే అమలు చేయాలి
- నూతన గనులను ఏర్పాటు లేకుంటే సింగరేణి మనుగడకు ప్రమాదం
- సమస్యలు పరిష్కరించకుంటే అన్ని సంఘాలు కలుపుకొని సమ్మెకు సిద్ధం
- ఎఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు సీతారామయ్య, రాజ్ కుమార్




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువైందని, దానికి బిఆర్ఎస్ గత ప్రభుత్వంలో కిటికీలు తెరిస్తే ఇప్పుడున్న ప్రభుత్వం తలుపులు తెరిచిందని, బిఆర్ఎస్ ఏలు పెడితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాలు పెట్టిన చందంగా పరిస్థితి ఉందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి సెంట్రల్ కమిటీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఎద్దేవా చేశారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గతంలో చంద్రబాబు నాయుడు రాజశేఖర్ రెడ్డి లాంటి ఎందరో ముఖ్యమంత్రులు సింగరేణి ఒక ప్రభుత్వ గుర్తింపు సంస్థగానే చూసేవారని ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా పరిపాలించారని కానీ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నాటి నుండి 2014 తర్వాత సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువైందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువైందని ఇప్పుడున్న డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క సింగరేణి యాత్ర చేపట్టి టిఆర్ఎస్ ప్రభుత్వంలో సింగరేణికి రూ.26 వేల కోట్లు బకాయి ఉందని దీని వల్ల సింగరేణి నష్టాల్లో ఉందని చెప్పిన ఆయన ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలోనే 56వేల కోట్ల బకాయి పెండింగ్ లో ఉందని ప్రభుత్వం వెంటనే సింగరేణికి బకాయి చెల్లించాలని గుర్తు చేశారు. గుర్తింపు సంఘంగా గెలిచిన నుండి కార్మిక సమస్యల పరిష్కారం కోసం స్ట్రక్చర్ మీటింగ్‌లో అటు ప్రభుత్వం ఇటు యాజమాన్యంతో కార్మిక సమస్యలపై మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందన్నారు. అట్లాగే మారుపేరుల సమస్య, కార్మికుల సొంతింటి పథకం అమలుపై అనేకసార్లు ప్రభుత్వం యాజమాన్యంతో చర్చించడం జరిగిందని తెలిపారు. పెరిక్స్‌పై ఇన్కమ్ టాక్స్ తగ్గించాలని, సింగరేణిలో నూతన బొగ్గు గనులను ఏర్పాటు చేయాలని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. ఇలాంటి అనేక కార్మిక సమస్యలపై వాటి పరిష్కారం కోసం ఎఐటియుసి ఆధ్వర్యంలో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని, ఈనెల 26న ప్రభుత్వం చర్చలకు పిలిచిందని సమస్యలు పరిష్కరించకుంటే నెల రోజుల్లో అన్ని జాతీయ ట్రేడ్ యూనియన్ సంఘాలతో కలిపి పెద్ద ఎత్తున సమ్మె చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం యాజమాన్యం మొండి వైఖరి మానుకొని మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి ఎంఎ ఆసిఫ్ పాషా, కాంట్రాక్ట్ కార్మికుల ఇంచార్జ్ నూకల చంద్రమౌళి, భీమనాథుని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

నిర్మాణమైన ఇండ్లను వెంటనే పేదలకివ్వాలని రేపు కలెక్టరేట్ ముందు ధర్నా : పంజాల శ్రీనివాస్



**ప్రజాపక్షం / కరీంనగర్ :** కరీంనగర్ నగరంలో నివసిస్తు న్న నిరుపేదలందరికీ వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ కరీంనగర్ నగర శాఖ కార్యదర్శుల సమావేశం పైడిపల్లి రాజు అధ్యక్షతన బద్ద ఎల్లారెడ్డి భవ న్‌లో జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పం జాల శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్‌లో కొన్ని సంవత్సరాల నుండి ఇండ్లు లేక చాలామంది పేద ప్రజలు కిరాయి ఇండ్లలో ఉంటూ తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారని, ఇంటి కిరాయిలు కట్టలేక నానా అవస్థలు పడుతూ ప్రాణాలు తీసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు కావస్తున్న నేటికీ పేదవాడికి ఉండడానికి ఇల్లు లేక, నివసించడానికి జాగలేక దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వడంలో తీవ్రంగా విఫలమైందని విమర్శించారు. దాదాపు పది సంవత్సరాల క్రితం చింతకుంటలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించారని వాటిని నేటికీ పేద ప్రజలకు పంచకపోవడం చూస్తుంటే పేదల పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంచుతామని ఇప్పుడు అప్పుడు అంటూ కాలయాపన చేశారు తప్ప పేదలకు పంచలేదని ఆరోపించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేకవిధానాలను ఎండగట్టేందుకు, నిర్మాణమైన డబుల్ బెడ్ రూములు వెంటనే అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలని ఈనెల 22 సోమవారం రోజున కలెక్టర్ కార్యాలయం ముందు ఇల్లు లేని నిరుపేదలచే ధర్నా కార్యక్రమం చేస్తున్నామని, ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు న్యాలపట్ల రాజు, కౌన్సిల్ సభ్యులు బీర్ల పద్మ, నలవాల సదానందం శాఖ కార్యదర్సు లు గామినేని సత్యం, బాకం అంజనేయులు, సాయ వేణి రాజమల్లు, కాల్వ శ్రీనివాస్ కాల్వ కొమురయ్య, నునావత్ శ్రీనివాస్, నగునూరి రమేష్,అల్లెపు రాజు, తంగేళ్ల సంపత్, తంగేళ్ల సదయ్య, బోయిని విష్ణు తదితరులు పాల్గొన్నారు.

### హనుమకొండలో పేదల ఇళ్లు కూల్చడం దారుణం

హనుమకొండ గుండ్ల సింగారంలో శనివారం పేదల ఇళ్ళు కూల్చడం దారుణమని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ అన్నారు. గత ఐదేళ్లుగా అక్కడే జీవనం సాగిస్తున్న పేదల ఇళ్లను కూల్చి బలవంతంగా ఖాళీ చేయించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పిల్ల పాపలతో జీవనం సాగిస్తున్న 30 కుటుంబాల ఇండ్లను నేల మట్టం చేసిన అధికారులు ప్రత్యామ్నాయం చూపకుండా రోడ్డున పడేశారని విమర్శించారు. ఇళ్లు లేని పేదలకు ఇండ్లు నిర్మిస్తామని ఓ పక్క చెబుతున్న ప్రభుత్వం మరో వైపు పేదల ఇళ్లు కూల్చడమేంటని ప్రశ్నించారు. కూల్చిన చోటనే అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

## కొల్లాపూర్ రాజకీయ చదరంగంలో ప్రభుత్వాధికారులు బలి

నాగర్‌కర్నూల్ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ తీవ్ర విమర్శ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** కొల్లాపూర్ మండలం లో గత కొన్ని నెలలుగా జరుగుతున్న రాజకీయ చదరంగంలో ప్రభుత్వ అధికారులు బలి అవుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ తీవ్రంగా విమర్శించారు. శనివారం కొల్లాపూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మితిమీరిన రాజకీయ జోక్యంతో అధికారుల స్వేచ్ఛను హరిస్తుందని, గడిచిన సంవత్సర కాలంలో ఏఅధికారి కూడా సంపూర్ణంగా తమ పదవి కాలాన్ని పూర్తి చేయకుండానే ఇక్కడ నుంచి ట్రాన్స్‌పర్లు చేయించుకు ని లేదా లీవ్‌పై వెళ్లిపోయి కాలం వెల్లదీస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజాప్రతినిధులు ఇతర వ్య క్తుల జోక్యం వలన అధికారులు ఈ రకంగా ఒత్తిడిని లోనై ఇక్కడ నుంచి ఎప్పుడూ వెళ్లిపోవాలా అని ప్రయత్నం చేస్తుండగా ఇతర ఏ కొత్త ప్రభుత్వ అధికారి కూడా కొల్లాపూర్‌లో ఉద్యోగం చేయడానికి కొల్లాపూర్‌కి రావడానికి భయపడుతున్నారని కొల్లాపూర్ పేరు వినగానే వెనుకడుగు చేస్తున్నారని ఆయన తెలిపారు. రాష్ట్రానికి సేవలందించే మంత్రి హోదాలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే జూపల్లి కృష్ణరావు ఈ విషయంపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని ఫయాజ్ గుర్తు చేశారు. అధికారులు ఇలా ఒత్తిడికి గురి కావడం వలన ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించకపోగా నెలల తరబడి ప్రతి చిన్న పని పెండింగులో పడి కుంటుపడుతుందని ఆయన తెలిపారు. ఇలాగే సాగితే కొల్లాపూర్ నియోజకవర్గానికి చెడ్డ పేరు రావడం ఖాయమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మీరు స్వేచ్ఛగా పని చేయండి రూల్స్‌ని పాటించండి ఇక్కడున్న ప్రజ లు ముఖ్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మీకు అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఏది ఏమైనా ఒకరు కాదు ఇద్దరు కాదు ప్రతి డిపార్ట్‌మెంట్‌లో అధికారులు ఇలా వరుస పెట్టి ట్రాన్స్‌పర్లు చేసుకుని వెళ్లిపోయే పరిస్థితి ఎందుకు వస్తుందో ప్రభుత్వ పెద్దలు ఆలోచన చేసి తక్షణమే స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలని లేని పక్షంలో ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలు దృష్టికి తీసుకెళ్లి లేదా ప్రజా క్షేత్రంలో దీనిపై పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఫయాజ్ హె చ్చరించారు. నియోజకవర్గ కేంద్రమైన కొల్లాపూర్ మండలంలో సిబ్బంది లేకుండా ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా పనిచేయడం సాధ్యమైన పని కాదని తక్షణమే ఖాళీగా ఉన్న అన్ని శాఖల్లో ఉద్యోగులతో భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఆర్.ఇందిరా కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మల శివుడు డిహెచ్‌సిహెచ్ జిల్లా అధ్యక్షుడు తప్పెట కిరణ్ కుమార్, సిపిఐ కొల్లాపూర్ పట్టణ కార్యదర్శి ఎం.డి.యూసుఫ్ సహాయ కార్యదర్శి రమణ, ఎఐటియుసి నాయకులు చాపల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ‘విబి–జి రామ్ జి’ చట్టాన్ని ఉపసంహరించండి

కేంద్ర మంత్రికి మంత్రి సీతక్క లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన విబిజి రామ్‌జీ చట్టం గ్రామీణ పేదల ఉపాధి హక్కును బలహీనపరుస్తోందని, ఈ చట్టాన్ని ఉపసంహరించుకుని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఈజిఎస్)ను యథాతథంగా కొనసాగించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీతక్క మూడు వేర్వేరు లేఖలను రాశారు. విబిజి రామ్‌జీ పథకం అమలుపైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తరపున అభ్యంతరం వ్యక్తం చేశారు. విబిజి రామ్‌జీ చట్టం అమలుకు సంబంధించి కేంద్రం రూపొందించిన నిబంధనల్లో అనేక అంశాలు పేదలు, దళితులు, ఆదివాసీ గిరిజనులు,భూమిలేని గ్రామీణ కుటుంబాల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా నిధుల కేటాయింపును రాష్ట్ర స్థాయిలో నిర్ణయించడం వల్ల గ్రామ పంచాయతీ స్థాయిలో ఉన్న వాస్తవ ఉపాధి అవసరాలు విస్మరణకు గురవుతున్నాయని వివరించారు. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, ములుగు, నాగర్ కర్నూల్ వంటి వెనుకబడిన జిల్లాల్లో అధిక ఉపాధి అవసరాలు ఉన్నప్పటికీ రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా పరిగణించడం వల్ల ఆ ప్రాంతాలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీల్లో గత ఐదేళ్లలో నమోదైన వాస్తవ పనిదినాల ఆధారంగా నిధుల కేటాయింపుకు 80 శాతం ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్థిక సంఘం ప్రమాణాలకు 20 శాతం మాత్రమే వెయిటేజీ ఇవ్వాలని, నిధుల పంపిణీ, పనితీరు ప్రమాణాల విషయంలో కేంద్రానికి అపరిమిత అధికారాలు ఇవ్వడం చట్టం ఉద్దేశానికి విరుద్ధమని, రాష్ట్రాలతో సంప్రదింపుల అనంతరమే నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల వంటి రాష్ట్ర గృహ నిర్మాణ పథకాలను విబిజి పరిధిలో చేర్చాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. వ్యవసాయానికి అనుసంధానంగా, వ్యక్తిగత భూ అభివృద్ధి పనులు, చిన్న రైతులు, ఎస్‌సి,ఎస్‌టి కుటుంబాలకు ఉపయోగపడే జీవనోపాధి పనులను,అలాగే వరదల వల్ల దెబ్బతిన్న భూముల పునరుద్ధరణ, కూరగాయల పందిళ్లు, పశుగ్రాస అభివృద్ధి, వెదురు తోటలు, న్యూట్రి గార్డెన్లు, వాతావరణ మార్పులను తట్టుకునే జీవనోపాధి పనులను అనుమతించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ చట్టంలో ప్రతిపాదించిన 60 రోజుల తప్పనిసరి ఉపాధి విరామాన్ని మంత్రి సీతక్క తీవ్రంగా వ్యతిరేకించారు. ఆదివాసీ గిరిజన ప్రాంతాలు, నీటి ఎద్దడి ప్రాంతాల్లో నివసించే కుటుంబాలకు ఉపాధి ప్రధాన జీవనాధారమని, అలాంటి ప్రాంతాల్లో 60 రోజులపాటు పనులు నిలిపివేయడం గ్రామీణ పేదల ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఆదివాసీ, నీటి ఎద్దడి మండలాలు, మొక్కల పెంపకం కార్యక్రమాలు, గృహ నిర్మాణ పనులకు 60 రోజుల ఉపాధి విరామం నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.తమ సూచనలపైన కేంద్రం సానుకూలంగా పరిశీలించి చట్టం, నిబంధనల్లో తగిన మార్పులు చేయాలని సీతక్క విజ్ఞప్తి చేశారు.

## నేడు సచివాలయంలో క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్: విబి జి రామ్‌జీ చట్టం 2025ను రాష్ట్రంలో అమలు చేయడం ద్వారా ఎదురయ్యే సమస్యలు, వాటి ప్రభావాలు, కోల్పోయే అవకాశాలు, విధానపరమైన అంశాలపైన సమగ్రంగా చర్చించి, వాటిని పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జరగనుంది. ఈ క్యాబినెట్ సబ్ కమిటీకి మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షత వహించగా, కమిటీ సభ్యులుగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత,జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొననున్నారు. ఈ సమావేశంలో విబిజి రామ్‌జీ చట్టం అమలుతో గ్రామీణ ప్రాంతాలు, ఉపాధి అవకాశాలు, స్థానిక సంస్థలు, పలు అభివృద్ధి కార్యక్రమాలపై పడే ప్రభావాలపైన సమగ్రంగా చర్చించనున్నారు. వివిధ శాఖల అభిప్రాయాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు, ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి కార్యాచరణపై కమిటీ నిర్ణయాలు తీసుకోనుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం గ్రామీణ ప్రజల సంక్షేమం, ఉపాధి భద్రత, సమగ్రాభివృద్ధి కావడంతో, చట్టం అమలుకు సంబంధించిన అన్ని అంశాలను సవివరంగా పరిశీలించి, ప్రభుత్వానికి పలు సిఫార్సులను సమర్పించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# టిజి-20 లీగ్‌పై కేసు నమోదు చేసి.. ఖాతాలు స్తంభింపజేయాలి

సిఐడికి టిసిఎ డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్: హెచ్‌సిఎ, టిసిఎ మధ్య రోజు రోజుకు వివాదం పెరుగుతోంది. స్వయంగా రాష్ట్ర మంత్రి వివేక్ రంగంలోకి దిగి వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. వివేక్ వివరణపై టిసిఎ నేతలు స్పందించారు. హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో టిసిఎ నేతలు మాట్లాడుతూ తెలంగాణ క్రికెట్‌లో వివాదాస్పదంగా మారిన టిజి20 లీగ్ వ్యవహారంపై సిఐడి తక్షణమే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, లీగ్‌కు సంబంధించిన బ్యాంకు ఖాతాలు, ఆస్తులను స్తంభింపజేసి సమగ్ర ఫోరెన్సిక్ దర్యాప్తు చేపట్టాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) డిమాండ్ చేసింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) ఆర్థిక వ్యవహారాలపై తెలంగాణ లోకాయుక్త ఆదేశాల మేరకు సీఐడీ విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో టీసీఏ ఈ మేరకు అధికారులను ఆశ్రయించినట్లు తెలిపింది. టిజి20 లీగ్ తెలంగాణ యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీయడానికి ఏర్పాటు చేశారా? లేక పలుకుబడి, అధికార వర్గాలకు మాత్రమే పరిమితమైన వేదికగా మారిందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని టీసీఏ పేర్కొంది. ప్రతిభ కంటే ప్రభావం, పరిచయాలకు ప్రాధాన్యం పెరుగుతోందనే భావన యువ క్రికెటర్లలో ఆందోళన కలిగిస్తోందని తెలిపింది. టిజి20తో అనుబంధంగా రూ.46.15 కోట్లకు పైగా నిధులు సమీకరించబడినట్లు వార్తలు వస్తున్నప్పటికీ, హెచ్‌సీఏ సర్వసభ్య సమావేశం ఆమోదం ఎక్కడ? బిసిసిఐ అనుమతి ఉందా? ఇంత భారీ మొత్తాల వసూళ్లకు ఎవరు అధికారం ఇచ్చారు? ఫ్రాంచైజీల వెనుక అసలు లబ్ధిదారులు ఎవరు? వంటి కీలక ప్రశ్నలకు ఇప్పటివరకు స్పష్టత రాలేదని టిసిఎ ప్రశ్నించింది. క్రికెట్ పరిపాలన కొద్ది మంది ప్రభావశీలుల చేతుల్లోకి వెళ్లకూడదని, తెలంగాణ ఆటగాళ్లు, కోచ్‌లు, జిల్లా సంఘాలు, క్రికెట్ అభిమానులకు పారదర్శకత, జవాబుదారీతనం, సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని టీసీఏ అభిప్రాయపడింది. లీగ్‌కు అనుబంధంగా ఉన్న పలువురు ప్రముఖులు దూరం కావడం కూడా ప్రజల్లో అనుమానాలను మరింత పెంచిందని పేర్కొంది. లోకాయుక్త ఆదేశాలతో కొనసాగుతున్న సిఐడి దర్యాప్తు నేపథ్యంలో టిజి20కు సంబంధించిన అన్ని బ్యాంకు ఖాతాలను తక్షణమే స్తంభింపజేయాలని, ఆర్థిక లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని, అన్ని అనుమతులు, ఆర్థిక వివరాలు, యాజమాన్య సమాచారం బహిర్గతం అయ్యే వరకు లీగ్‌ను నిలిపివేయాలని టిసిఎ ప్రధాన కార్యదర్శి ధర్మ గురువా రెడ్డి డిమాండ్ చేశారు. ‘క్రికెట్ ప్రతిభావంతులది కావాలి, పలుకుబడి ఉన్నవారిది కాదు‘ అని ఆయన స్పష్టం చేశారు.

# సింగరేణి అవకతవకలపై సిబిఐ విచారణ జరపాలి

బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : సింగరేణి కాలరీస్‌లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న వేల కోట్ల రూపాయల అవకతవకలపై సిబిఐ విచారణ జరపాలని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి మైన్స్ క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన బిజెపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ప్రభుత్వం తప్పు చేయకపోతే ఫ్యాక్ట్ ఫైండింగ్‌ను ఎందుకు అడ్డుకుందని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో సింగరేణిలో ఓబిఆర్ కాంట్రాక్టులు, థర్మల్ పవర్ ప్లాంట్, తాడిచర్ల బొగ్గు గని, సోలార్ ప్రాజెక్టులు, డిజిల్ జెలటిన్ కొనుగోళ్లలో భారీ అవినీతి జరిగిందన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం వల్లే ఈ అక్రమాలను కప్పిపుచ్చుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సిబిఐ విచారణకు లేఖ ఇస్తే కేంద్రం సిద్ధంగా ఉందని, సింగరేణిలో గత 12 ఏళ్లుగా జరిగిన అన్ని అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరగాలని మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

## సింగరేణి కుంభకోణాన్ని దాచేందుకే.. కిషన్ రెడ్డిపై అసత్య ప్రచారం : రాంచందర్ రావు



తెలంగాణలో వెలుగులోకి వస్తున్న సింగరేణి బొగ్గు కుంభకోణాన్ని దాచిపెట్టేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై అసత్య ప్రచారం చేస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆరోపించారు. హైదరాబాద్ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో 45 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందన్న వార్తలపై నిజానిజాలు తెలుసుకునేందుకు బిజెపి ఫ్యాక్ట్ ఫైండింగ్ బృందం వెళ్లగా ప్రభుత్వం పోలీసులతో అడ్డుకుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు కూడా సక్రమంగా అందడం లేదని విమర్శించారు. ఉస్మానియా యూనివర్సిటీకి సిఎం ప్రకటించిన రూ.1000 కోట్ల హామీ అమలు కాలేదని, హాస్టళ్ల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. రైతుల ధాన్యం కొనుగోళ్లలో కూడా ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన రాంచందర్ రావు, సింగరేణి కుంభకోణం, విద్యా వ్యవస్థ, రైతు సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం ఘనంగా యోగా మహోత్సవం నిర్వహించారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ 24 గంటల కౌంట్‌డౌన్ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ముఖ్య అతిథులుగా హాజరవ్వగా, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు యోగా భారత ప్రాచీన సంస్కృతికి ప్రతీక అని, శారీరకమానసిక ఆరోగ్యానికి యోగా అత్యంత అవసరమని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కృషితో యోగాకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని, ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నగర నలుమూలల నుంచి యువత, విద్యార్థులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భారీగా తరలివచ్చి కార్యక్రమానికి విశేష స్పందన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు డాక్టర్ కె. లక్ష్మణ్, ఈటల రాజేందర్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యాక్షురాలు బండ కార్తీక రెడ్డి పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం




ప్రజాపక్షం/హైదరాబాద్: రైతులు పండించిన మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, చివరకు 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని బిఆర్ఎస్ మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, గంగుల కమలాకర్ ఆరోపించారు. కాంటా వేయడానికే నెల రోజులు, కాంటా వేసిన తర్వాత నెల రోజులు వేచిచూడాల్సి వచ్చిందన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్‌ఎ పల్లా రాజేశ్వర్ రెడ్డితో కలిసి మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, గంగుల కమలాకర్ మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు క్వింటాలు ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ అని ఊరించారని, అధికారంలోకి వచ్చిన తరువాత సన్నవడ్లకు పరిమితం చేశారని, ఇప్పుడు సన్నరకాలలో కూడా ఏడు రకాలకే పరిమితం చేశారని వారు మండిపడ్డారు. వడ్లను కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ఘోరంగా విఫలమైందని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. యూరియాను కూడా ప్రభుత్వం సక్రమంగా పంపిణీ చేయలేకపోతున్నారని, యూరి యా కోసం రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ మొదలైన తర్వాత ఇప్పుడు పంట మార్పిడి ఎలా చేస్తారని ప్రశ్నించారు. యాసంగి ధాన్యానికి ఇంతవరకు బోనస్ ఇవ్వలేదని, మళ్లీ ఇప్పుడు ఏడు రకాల వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెబుతున్నారని మండిపడ్డారు. రాజకీయాల కోసం రైతాంగ ప్రయోజనాలను పక్కన పెట్టడం సరికాదని సూచించారు. గంగుల కమలాకర్ మాట్లాడుతూ కేంద్రం ఎంత కొనుగోలు చేయాలంటే అంతే కొనుగోలు చేస్తామని సిఎం అనడం సరికాదన్నారు. ధాన్యం కొనుగోలు చేయడం చేతకాకపోతే అధికారం నుంచి దిగిపోవాలని డిమాండ్ చేశారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జనగాం నియోజకవర్గంలో 249 మంది రైతులు చనిపోయారని, ఒక్క రైతుకు కూడా రైతు భీమా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# హైడ్రాతో పేదలకు అన్యాయం జరగలేదు

రెండేళ్లలో 2450 ఎకరాల భూమికి కబ్జా చెర నుంచి విముక్తి..

హైడ్రాపై బురద జల్లుతున్న భూకబ్జదారులు..

కమిషనర్ రంగనాథ్..




ప్రజాపక్షం/హైదరాబాద్: హైడ్రా వల్ల పేదలకు ఎక్కడ కూడా అన్యాయం జరగలేదని, చెరువుల పునరుద్ధరణలో గుడెసెలు కోల్పోయినవారికి డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని ప్రభుత్వానికి సిఫారసు చేశామని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ స్పష్టం చేశారు.హైడ్రా రెండేళ్ల కాలంలో 2450 ఎకరాల భూమిని కబ్జాల చెర నుంచి విముక్తి కల్పించామని, ఇందులో పెద్దలకు చెందిన కబ్జాలే ఉన్నాయన్నారు. భూకబ్జాదారులే హైడ్రా పట్ల సామాజిక మాధ్యమాల ద్వారా బురద చల్లుతున్నారని, వారి ఆరోపణల్లో వాస్తవాలు ఎంత అనేది గ్రహించాలని సూచించారు. ‘‘హైడ్రా కార్యకలాపాలు, గొలుసుకట్టు చెరువులు, ప్రకృతి పరిరక్షణ’’హైడ్రా పాత్ర అనే అంశంపై తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దల్ పార్టీ (టిఆర్ఎల్‌డి) హైదరాబాద్‌లో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఎ.వి రంగనాథ్ మాట్లాడుతూ చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాను కబ్జా చేసి, వందల కోట్ల రూపాయలను కొల్లగొట్టేవారి దుష్ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. కబ్జాలకు పాల్పడుతున్న వారికి హైడ్రా అంటే గిట్టడంలేదని, వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ.. ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని, వారి నుంచి వందలు, వేల ఎకరాల భూములను హైడ్రా వెనక్కి తీసుకుందని వివరించారు. రాత్రికి రాత్రి హైడ్రా కూల్చదని, సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో 862 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామని, ఏడాది పాటు అధ్యయనం చేసి, అన్ని రికార్డులు పరిశీలించిన తర్వాతనే చర్యలకు పూనుకున్నామని రంగనాథ్ తెలిపారు. పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన ప్రభుత్వ స్థలాలను కొల్లగొడుతున్నారని, సామాన్యుల ప్లాట్లను కలిపేసుకుంటున్నారని, అలాంటి వారి పట్ల తాము కఠినంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎల్‌డి అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, అరుణోదయ సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు విమలక్క, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రకాష్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.



# సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయాన్ని సందర్శించిన త్రిపుర మాజీ సిఎం

ప్రజాపక్షం/హైదరాబాద్ : దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో సిపిఐ(ఎం), వామపక్షాల పాత్రను మరింత బలోపేతం చేయడం కోసం కృషి చేయాలని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు మాణిక్ సర్కార్ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ’ఎంబీ భవన్’ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాణిక్ సర్కార్‌కు సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు టి. జ్యోతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, బండారు రవికుమార్, పార్టీ సీనియర్ నాయకులు డి.జి. నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. అరుణజ్యోతి, బి. సాంబశివ రాష్ట్ర కేంద్ర నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాణిక్ సర్కార్ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దేశ, రాష్ట్ర రాజకీయాలు, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, నిత్యావసర ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్య తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలు, సామాజిక అంశాలు ప్రజా సమస్యలను మాణిక్ సర్కార్ ఆరా తీశారు.



# బిజెపి ఎంపి తేజస్వి సూర్య తెలంగాణకు వస్తే అడ్డుకుంటాం

ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటును అవమానించే విధంగా మాట్లాడిన బిజెపి ఎంపి తేజస్వి సూర్య తెలంగాణ ప్రజలకు చెప్పకుండా తెలంగాణకు వస్తే అడ్డుకుంటామని ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ హెచ్చరించారు. పార్లమెంట్‌లో ఆనాడు తేజస్వీ సూర్యా మాటలను ఖండించలేని బిజెపి నేతలు ఇప్పుడు తేజస్వి సూర్యను తెలంగాణకు ఆహ్వానిస్తున్నారని, ఆనాటి మాటలకు క్షమాపణ చెప్పకుండా ‘నమో జెన్ జీ కాంక్లేవ్’ పేరుతో హైదరాబాద్‌లో మీటింగ్ పెట్టి దానికి సూర్య హాజరైతే తప్పకుండా అడ్డుకుంటామన్నారు. తెలంగాణ ఏర్పాటును అవమానించేలా పాకిస్తాన్ తో పోల్చి తప్పుగా మాట్లాడిన తేజస్వి సూర్య వారి పార్టీ విధానాన్ని చెప్పకనే చెప్పారని ఆయన పేర్కొన్నారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు సూర్య మాటలను బిజెపి నేతలు ఖండించలేదని, తమ అస్థిత్వాన్ని, తమ సెంటిమెంట్‌ను ఎగతాళి చేసి మాట్లాడిన సూర్య తెలంగాణకు వస్తే ఆవేశంతో ఉన్న యువకుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని వెంకట్ హెచ్చరించారు. తెలంగాణ అంటేనే భావోద్వేగం, సెంటిమెంట్ అని అలాంటి సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరైంది కాదన్నారు. దేశంలో పేపర్ లీకులు చేసి విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బిజెపి తెలంగాణలో జెన్ జీ యూత్‌తో సదస్సులు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బిజెపి కుట్రలకు బలవుతున్న జెన్ జీ యువతనే బిజెపి పాలకులపై పోరాటం చేస్తోందని, అలాంటి బిజెపికి ఎలాంటి సమాధానం చెప్పాలో జెన్ జీ యువతకు బాగా తెలుసునని అన్నారు. ఇప్పటికే పోరాటాన్ని ఉధృతం చేశారని, మోదీ ప్రభుత్వం చేసిన పాపాలకు ప్రజల చేతుల్లో శిక్ష అనుభవించక తప్పదన్నారు.

# వైద్య ఆరోగ్య శాఖలో బదిలీల అవకతవకలపై విచారణ

తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : వైద్య ఆరోగ్య శాఖ లో ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో చోటు చేసుకున్న అవకతవకలపై ప్రభుత్వం తక్షణమే విచారణ చేపట్టి ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాస మూర్తి డిమాండ్ చేశారు. వైద్య విధాన పరిషత్‌లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్ కోటిలోని కమిషనర్ కార్యాలయం వద్ద తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ నందు ఇటీవల జరిగిన బదిలీల్లో వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వైద్య అధికారిని కమిషనర్‌గా నియమించాలని, మెడికల్ కాలేజీ అనుబంధ వైద్య శాలల్లో ఉన్న వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల రీడిప్లాయ్మెంట్‌కు తక్షణ చర్యలు తీసుకోవాలని, మినిమం టైం స్కేల్ ఉద్యోగులకు సంబంధించి రెండు నెలల వేతనాలు మంజూరు చేయాలని కోరారు. ఈ నిరసన ప్రదర్శనల్లో పరాబ్ కుమార్, ఝాన్సీ ,మారయ్య, సారా, కళ్యాణి రెడ్డి ,కోటేశ్వర రావు, ఉద్యోగులు సంఖ్యలో పాల్గొన్నారు.




# బాధ్యతాయుతంగా పని చేయాలి

ప్రజాపక్షం/హైదరాబాద్: చిన్నారులు, మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు రావాలంటే అధికారులు మరింత బాధ్యతాయుతంగా పని చేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క సూచించారు. బాల్య వివాహలు, చిన్నారులపై వేధింపులు, దాడులు లేని రాష్ట్రంగా తెలంగాణను మార్చే లక్ష్యంతో పనిచేయాలన్నారు. యూసుఫ్ గూడలోని జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంస్థలో మిషన్ వాత్సల్య, సాక్ష్యం అంగన్వాడి, మిషన్ శక్తి పథకాల అమలు పురోగతిపై శనివారం జరిగిన రాష్ట్రస్థాయి సదస్సుకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, కమిషన్ సభ్యులు కంచర్ల వందన గౌడ్, బి. అపర్ణ, మర్రిపల్లి చందన, గోగుల సరిత, ప్రేమలతా అగర్వాల్, బి. వచన్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, జాయింట్ డైరెక్టర్ మోతి, జిల్లా మహిళా సంక్షేమ అధికారులు, జిల్లా బాలల సంరక్షణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గాజు ఛాంబర్ల స్లీపర్ బస్సులపై రవాణా శాఖ ఉక్కుపాదం..

రెండు రోజుల్లో మూడు బస్సులు సీజ్

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రయాణికుల ప్రాణ భద్రతకు ముప్పుగా మారుతున్న గాజు ఛాంబర్ల తో కూడిన ప్రైవేట్ స్లీపర్ బస్సులపై తెలంగాణ రవాణా శాఖ కఠిన చర్యలకు దిగింది. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో గత రెండు రోజుల్లో మూడు ప్రైవేట్ స్లీపర్ బస్సులను అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలన్నీ అరుణాచల్ ప్రదేశ్‌లో నమోదైనవిగా గుర్తించారు. దేశవ్యాప్తంగా జరిగిన పలు స్లీపర్ బస్సుల అగ్నిప్రమాదాల నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రయాణికుల భద్రతకు ఆటంకం కలిగించే మూసివేసిన క్యాబిన్లు, నిర్మాణ మార్పులపై ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ప్రమాదాలు, అగ్నిప్రమాదాల సమయంలో ప్రయాణికులు సురక్షితంగా బయటకు రావడానికి, సహాయక బృందాలు లోపలికి చేరుకోవడానికి అడ్డంకులు ఉండకూడదని సూచించింది. అవసరమైతే ఆయా వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లను రద్దు చేసే చర్యలు చేపట్టాలని కోరనున్నట్లు వెల్లడించింది.

# జిహెచ్‌ఎంసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌ను కోరిన ఐఎన్‌టియుసి నేత, ఎంఎస్‌ఎంయు వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసి ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మునిసిపల్ సహకార మజ్దూర్ యూనియన్ (ఎంఎస్ఎంయు), ఐఎన్‌టియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ కోరారు. ఈ మేరకు ఆదిల్ షరీఫ్ నేతృత్వంలో ప్రతినిధి బృందం టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి జిహెచ్‌ఎంసి ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లపై వినతి పత్రం అందచేశారు. ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌లు బాబర్ సలీం పాషా, విజయ్ కుమార్ యాదవ్‌లు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసిన ప్రతినిధి బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆదిల్ షరీఫ్ జిహెచ్‌ఎంసి ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని టిపిసిసి అధ్యక్షులను కోరారు. వినతి పత్రంలో ప్రధానంగా జిహెచ్‌ఎంసి ఉద్యోగులందరికీ, పెన్షనర్లకు ఉద్యోగుల జీతం నుండి ఎలాంటి కోత లేకుండా హెల్త్ కార్డులు జారీ చేయడం, దూర ప్రాంతాలకు పోస్టింగ్, ఆరోగ్య కారణాలు, ఇతర సహేతుకమైన కారణాలతో పెండింగ్‌లో ఉన్న బదిలీ దరఖాస్తులను పరిష్కరించడం, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాన్ని నెలకు రూ.26,000కు పెంచడం, వికలాంగ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఒకే చోట దీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులను బదిలీ చేయాలన్నారు. ఎల్ఐసి మినహాయింపులు సకాలంలో జమ చేయడం, జిపిఎఫ్ రుణాలు జాప్యం లేకుండా మంజూరు చేయడం, క్షేత్రస్థాయి సిబ్బందికి పెట్రోల్ భత్యాలు పెంచడం వంటి డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ స్పందిస్తూ, ఈ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, యూనియన్ నాయకులతో ముఖ్యమంత్రి సమావేశం ఏర్పాటుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ఎరువుల కొరత రానీయొద్దు

### ఫర్టిలైజర్ బుకింగ్ యాప్' ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

### ఎకరానికి 2 బస్తాల యూరియా సరఫరా



**ప్రజాపక్షం/నల్లగొండ** : ఈ వానకాలం సీజన్లో రైతులు పంటలు సాగు చేసుకునేందుకు ఎలాంటి ఎరువుల కొరత లేకుండా అవసరమైన ఎరువులను సరఫరా చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.శనివారం ఆయన నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయం ఇందిరా భవన్‌లో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌తో కలిసి ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా ఎరువుల అందుబాటు,ప్రస్తుత పరిస్థితి,నిల్వలు సులభంగా తెలుసుకోవచ్చన్నారు.ముఖ్యంగా యూరియా అవసరమైన రైతులు ఈ యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చని,పట్టాదారు పాసుపుస్తకం, పంట వివరాలను నమోదు చేస్తే రైతు పేరు పైన యూరియాను సరఫరా చేస్తామన్నారు. ఎకరానికి 2 బస్తాల చొప్పున ఇస్తామని, ఒక ఎకరా ఉన్నవారికి ఒకే సారి, 1 నుంచి 5 ఎకరాలు, ఆ పైన ఉన్నవారికి విడతల వారీగా యూరియాను సరఫరా చేస్తామని తెలిపారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు యూరియాను బుక్ చేసుకోవచ్చన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో సొసైటీలు, డీసీఎంఎస్‌లు, 650కి పైగా కేంద్రాల్లో సరిపడా యూరియా ఉందని, ప్రతి రైతుకూ యూరియా ఇస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా ఈనెల 21న నిర్వహించనున్న యోగా దినోత్సవానికి సంబంధించిన టీషర్టులను మంత్రి ఆవిష్కరించారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, విద్యుత్ అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారి వి. వినోద్ కుమార్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

#### పైలాన్ గుర్తుండిపోయేలా నిర్మించాలి : మంత్రి

**ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్)** : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమీపంలో త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా నిర్మించనున్న హ్యాం రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న దృష్ట్యా,శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హ్యాం రోడ్ల శంకుస్థాపన పైలాన్ పనులను పరిశీలించారు.పనులు వేగవంతం చేయాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా పైలాన్ పనులను పరిశీలించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ, రూ.13,500 కోట్లకు సంబంధించిన పైలాన్ ఎప్పటికీ గుర్తుండిపోయేలా నిర్మించాలని సూచించారు. మంత్రి వెంట స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి, డీఈ గణేష్, ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మాజీ జెడ్పీటీసీ మోహన్ రెడ్డి ఉన్నారు.

**95 మార్కులు సాధిస్తే విద్యార్థులకు విమాన యాత్ర**

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని బొట్టుగూడ కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల,ప్రతీక్ ప్రభుత్వ జూనియర్ కళాశాల,ఒకేషనల్ జూనియర్ కళాశాలలను సందర్శించారు.ఈ పాఠశాల నుంచి పదో తరగతిలో 95 పైగా మార్కులు సాధించిన విద్యార్థులను తన సొంత నిధులతో విమానంలో ఢిల్లీ పర్యటనకు పంపిస్తామన్నారు.





## నీట్ పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

**ప్రజాపక్షం/సూర్యాపేట** : ఈనెల 21న జిల్లా పరిధిలో నిర్వహించే రీనీట్ పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు సెక్షన్ 144 అమలులో ఉన్నట్లు జిల్లా ఎస్పి కె. నరసింహ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు పరీక్ష కేంద్రాన్ని సంబంధిత అధికారులతో కలిసి ఆయన భద్రతా చర్యలను పరిశీలించి మీడియాతో మాట్లాడారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తుతోపాటు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, డిఎస్పి ప్రసన్న కుమార్, సిఐ వెంకటయ్య, ప్రభుత్వ కళాశాల ఉపాధ్యాయులు, నీట్ పరీక్ష నిర్వహణ సిబ్బంది ఉన్నారు.

## 21 నుండి 24 వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా సిపిఐ రాజకీయ శిక్షణా తరగతులు

**ప్రజాపక్షం/నల్లగొండ** : సిపిఐ ఉమ్మడి నల్లగొండ జిల్లా సమితి సభ్యులకు ఈ నెల 21 నుండి 24 వరకు రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తెలిపారు. హైదరాబాద్‌లోని బండ్లగూడలో గల నవచేతన విజ్ఞాన సమితిగిరిప్రసాద్ భవన్‌లో ఈ శిక్షణా తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు.నల్లగొండ జిల్లా సమితి సభ్యులకు ఈ నెల 21,22 తేదీలలో, యాదాద్రి భువనగిరి జిల్లా సమితి సభ్యులకు 22, 23 తేదీలలో, సూర్యాపేట జిల్లా సమితి సభ్యులకు 23, 24 తేదీలలో రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించబడతాయని తెలిపారు. జిల్లా కౌన్సిల్ సభ్యులు నిర్ణీత సమయానికి తప్పనిసరిగా హాజరై శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణా తరగతులు రాజకీయ అవగాహనను పెంపొందించడమే కాకుండా సమకాలీన రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పిస్తాయని సత్యం తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, చరిత్ర, ప్రజా ఉద్యమాల అనుభవాలు, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య, లౌకిక, సామాజిక న్యాయ విలువలను పరిరక్షించేందుకు అవసరమైన రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడంలో శిక్షణా తరగతులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిక్షణా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## సిఎస్ఆర్ సదస్సు- 2026 పోస్టర్‌ను ఆవిష్కరించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : దక్షిణ భారతదేశ అతిపెద్ద సీఎస్ఆర్ సదస్సు 2026 అధికారిక పోస్టర్‌ను తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సీఎస్ఆర్ సదస్సు మేనేజర్ ఎం.వి. గోనా రెడ్డి తో కలసి శుక్రవారం ఆవిష్కరించారు.మార్పు నుంచి వారసత్వం వైపు అనే ఇతివృత్తంతో జరగనున్న ఈ సదస్సు 2026 జూలై 25న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు దాదాపు 300 ప్రముఖ కార్పొరేట్ సంస్థలు, 1,200కు పైగా స్వచ్ఛంద సంస్థలు హాజరుకానున్నాయి.ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థల మధ్య భాగస్వామ్యాన్ని పెంపొందించడం, విజయవంతమైన సీఎస్ఆర్ కార్యక్రమాలను ప్రదర్శించడం,దీర్ఘకాలిక సామాజిక ప్రభావం కోసం వ్యూహాలను రూపొందించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యమన్నారు. సమ్మిళిత అభివృద్ధి, జాతి నిర్మాణంలో వ్యాపార సంస్థలు, పౌర సమాజం మధ్య సహకారం ఎంతో కీలకమని ఆయన అభినందించారు.

## రాష్ట్రంలో దుర్మార్గమైన ప్రభుత్వం

### మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : రాష్ట్రంలో అత్యంత దుర్మార్గమైన ప్రభుత్వం ఉందని, క్యాబినెట్ మీటింగ్ పెట్టి మరీ వడ్లు కొనమని చెప్పిన ప్రభుత్వం కాంగ్రెస్ అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బిఆర్ఎస్ నియోజక వర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్ ప్రక్రియ చాలా ముఖ్యమైందన్నారు. చాలా ఓట్లు గల్లంతు అయ్యే ప్రమాదం ఉన్నందున కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మళ్లీ కెసిఆర్‌ని ముఖ్యమంత్రిని చేసే వరకు కార్యకర్తలు విశ్రమించవద్దని పిలుపునిచ్చారు. సూర్యాపేటకు కాంగ్రెస్ నాయకులు మూసీ మురికి నీరు అందించారని, మిషన్ భగీరథ పథకంతో తాము స్వచ్ఛమైన నీళ్ళు అందించామని గుర్తు చేశారు. రైతును రాజును చేసింది కెసిఆర్ అని, చినుకు పడగానే నాగలి భుజాన వేసుకొని ధీమాగా వ్యవసాయం చేసేలా చేశారని కొనియాడారు. ఆనాడు వడ్లు కొనమని కేంద్రం చెప్తే ఢిల్లీకి పోయి ధర్నా చేసిన నాయకుడు కెసిఆర్ అని, కేంద్రం కొనకపోతే తామే ధాన్యం మొత్తాన్ని కొన్నామని తెలిపారు. సన్నాలకు బోనస్ అని చెప్పి మోసం చేశారని, కేంద్రాన్ని సాకుగా చూపి ఇక్కడ ధాన్యం కొనమని రేవంత్ రెడ్డి చెబుతున్నారని మండిపడ్డారు. నిలువెల్లా విషం నింపుకున్న చంద్రబాబు, మోడీల కలయికలో వచ్చిన హైబ్రీడ్ ముఖ్యమంత్రి ఈ రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. వీళ్ల పీచం అణిచి, ఆట కట్టించే ఏకైక నాయుకుడు కెసిఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిజిటల్ లిటరసి, ఎఐ నైపుణ్యంతో ఉజ్వల భవిష్యత్ : కలెక్టర్

**ప్రజాపక్షం/కోదాడ:** డిజిటల్ లిటరసి, ఎఐ కోర్సు శిక్షణ నైపుణ్యంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. శనివారం కోదాడ పట్టణంలోని ఈఎంసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థుల కోసం ఈనెల 15 నుండి 20వ తేదీ వరకు ఏర్పాటు చేసిన డిజిటల్ లిటరసి ఏఐ కోర్సు శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏఐ కోర్సు సిలబస్ పుస్తకాలలో కంప్యూటర్ ఆపరేటింగ్, చాట్ జిపిటి, ఏఐ స్కిల్స్ అప్లికేషన్, డిజైన్ థింకింగ్, మేకింగ్ ఆఫ్ కోడింగ్ , పెయింటింగ్ విషయాలను విద్యార్థులు నేర్చుకోవడం వల్ల సబ్జెక్టు విషయాలకు అన్వయించుకుని సాఫ్ట్‌వేర్ రంగంలో ఉజ్వల భవిష్యత్‌ను సాధించవచ్చని పేర్కొన్నారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ప్రత్యేకంగా కంప్యూటర్ విభాగం సంబంధించిన విషయ పరిజ్ఞానాన్ని విద్యార్థులతో పరిశీలించి, ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాలలో నూతన అడ్మిషన్ డెస్క్, కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, తహసిల్దార్ సంతోష్‌కిరణ్, మండల విద్యాధికారి సలీంషరీఫ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్కేండేయ, డిజిటల్ లిటరసి, ఏఐ శిక్షణ మాస్టర్లు ధీరజ్, రవితేజ, నాని, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ప్రాజెక్టు నాణ్యతలో లోపాలు ఉండొద్దు

### రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/చింతలపాలెం** : మండలంలోని బుగ్గమాధవరం వద్ద రూ.394 కోట్లతో 14వేల ఎకరాలకు సాగునీరు అందించే రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకం పనులను రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం పరిశీలించారు. అండర్ గ్రౌండ్ నందు పంపుహౌస్ పనులను పరిశీలించి అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా నది మీద నిర్మిస్తున్న రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకం ప్రాజెక్ట్ మొత్తం ఖర్చు రూ.394 కోట్లు కాగా ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 4 మండలాల్లో 14,100 ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. మేళ్లచెరువు మండలం కందిబండ గ్రామంలో 2,494 ఎకరాలకు, రామాపురం గ్రామంలో 3,826 ఎకరాలకు, చింతలపాలెం మండలం హుజూర్‌నగర్ 149 ఎకరాలకు, దొండపాడు గ్రామానికి 1,589 ఎకరాలకు, కోదాడ మండలం గణపవరం గ్రామానికి 2,437 ఎకరాలకు, కూచిపూడి గ్రామంలో 1,060 ఎకరాలకు, ఎర్రవరం, రామలక్ష్మిపురం, బిక్యతండ గ్రామాలకు 1,634 ఎకరాలకు, తొగర్రాయి గ్రామంనకు 831 ఎకరాలకు, అలాగే చిలుకూరు మండలంనకు 80 ఎకరాలగు సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. దీని కొరకు 35 ఎకరాల రైతుల భూములను కొనుగోలు చేసి వారికి నష్టపరిహారంగా రూ.17కోట్ల 50లక్షలు చెల్లించడం జరిగిందని ఇట్టి ప్రాజెక్టును నాణ్యతతో ఎటువంటి లోపాలు లేకుండా త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పి కె. నరసింహ, ఇరిగేషన్ ఎస్‌సి నాగభూషణం, డిసిసి జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, వంగవీటి రామారావు, సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

#### అన్ని గ్రామాల రోడ్లకు మహర్దశ

**ప్రజాపక్షం/చింతలపాలెం** : అన్ని గ్రామాల రోడ్లకు మహర్దశ పట్టిందని రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌర సరఫరాల శాఖల మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం చింతలపాలెంలో రూ.10కోట్లతో నిర్మాణం చేసిన మేళ్లచెరువు నుండి చింతిర్యాల వరకు బిటి డబుల్ రోడ్డును ఆయన ప్రారంభం చేసి మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన చింతలపాలెం మండలంలో గతంలో రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు సరిగ్గా లేవని ఇప్పుడు మండలంలో పోలీస్ స్టేషన్, తహశీల్దార్, ఎంపిడిఓ కార్యాలయాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. పనులు పూర్తికావస్తున్నందున త్వరలో ప్రారంభోత్సవం చేసుకోవడం జరుగుతుందని చెప్పారు. లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ద్వారా మండలంలోని చాలా గ్రామాలకు సాగునీరు అందించడం జరుగుతుందన్నారు.



## విద్య, వైద్య రంగాలలో ప్రజలకు విస్తృత సేవలు

### శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/చిట్యాల :** విద్య, వైద్య రంగాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు విస్తృతమైన సేవలను అందించడానికి కంకణ బద్ధులై ఉందని రాష్ట్ర శాసనమండలి గుత్తా సుఖేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తన స్వంత గ్రామమైన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో శనివారం భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, శాసనసభ్యులు వేముల వీరేశంలతో కలసి వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. గుత్తా వెంకట్‌రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయం వారు చేపట్టిన ఉచిత నేత్ర శిభిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన ఊరుకు చేసిన సేవ తల్లికి చేసిన సేవలాంటిందని, ప్రజలకు సేవ చేయడమే తన ప్రథమ కర్తవ్యమని అన్నారు. గ్రామంలో చిన్నారులలో విద్యా సౌకర్యాలను మెరుగుపర్చడంలో భాగంగా అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించుకుని ప్రారంభించుకున్నామని, యువత తమ విజానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయంలో మెరుగైన వసతులను ఏర్పరుచుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాగర్ల భానుశ్రీ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ హాఫీజ్ ఖాన్, చిట్యాల మున్సిపల్ చైర్ పర్సన్ పందిరి గీతరమేష్, మార్కెట్ కమిటి చైర్మన్ నర్రా వినోదమోహన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి వినోద్, ఇంఛార్జ్ ఎంపిడివో మనోహర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాసు, వనమా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## డిసెంబర్ నాటికి ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి

### ఆర్అండ్ఆర్, భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశం



**ప్రజాపక్షం/నల్లగొండ:** జిల్లాలో కొనసాగుతున్న ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ, అవార్డుల ఆమోదం, పునరావాసం, నిర్మాణ పనులను వేగవంతం చేసి డిసెంబర్ నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని ఆర్అండ్ఆర్, ల్యాండ్ అక్విజిషన్ ఇరిగేషన్ కమిషనర్ కె. శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రెవెన్యూ,ఇరిగేషన్ శాఖ అధికారులు, ఇంజనీర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రాజెక్టుల వారీగా పురోగతిని ఆయన సమీక్షించారు.ఉదయసముద్రం లిఫ్ట్ ఇరిగేషన్, గుమ్మలబావి, పోతినేనిపల్లి, నెమ్మాని, డిండి ఇరిగేషన్ ప్రాజెక్టు, గొట్టిముక్కల, సింగరాజుపల్లి, చింతపల్లి రిజర్వాయర్, కృష్ణంపల్లి, శివన్నగూడెంచింతపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, దున్నపోతులగూడెం బత్తులపాలెం,డిండి మెయిన్ కెనాల్,అంబాభవాని, కంబాలపల్లి, పొగిళ్ల పెద్దగట్టు, ఐటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు.ప్రభుత్వం అవసరమైన బడ్జెట్‌ను కేటాయించిన నేపథ్యంలో భూసేకరణ, పునరావాసం, నిర్మాణ పనులను సమన్వయంతో వేగవంతం చేసి డిసెంబర్ నాటికి అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. భూసేకరణ పనులు తొందరగా పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్‌ను అభినందించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్, సీఈ గగనం శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనింగ్) శ్రీకాంత్ రెడ్డి,భూసేకరణ స్పెషల్ కలెక్టర్ మాధురి, జిల్లా అధికారులు,ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

### ఆలేరులో దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం ప్రారంభించిన మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ఆలేరు** : రాష్ట్రంలోని మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం, జెండర్ రీసోర్స్ సెంటర్, తెలంగాణ మహిళ సహకార అభివృద్ధి సంస్థ భవనాలను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, తెలంగాణ మహిళ సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మహిళా సంఘాలను కేవలం పొదుపు సంఘాలకే పరిమితం చేయకుండా వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాలకు బస్సులు, పెట్రోల్ బంకులు, మొబైల్ క్యాంటీన్లు, ఐకేపీ కేంద్రాలు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు, రైతు డ్రోన్లను అందజేసి ఉపాధి అవకాశాలను విస్తరిస్తున్నామని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం స్వయం సహాయక సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామని, గ్రామీణ ప్రాంత మహిళలు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు.

**మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి:** ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఆలేరు నియోజకవర్గంలో మహిళా సంఘాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొత్తగా ప్రారంభించిన మహిళా శిశు వికాస కేంద్రం ద్వారా మహిళలు, చిన్నారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

**మహిళా సంక్షేమానికి కేంద్రంగా కొత్త భవనం:** నూతనంగా ప్రారంభించిన దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం ద్వారా మహిళలు, బాలికల సంక్షేమ పథకాల అమలు, అవగాహన కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, కౌన్సెలింగ్ సేవలు, చట్టపరమైన సహాయం వంటి సేవలు ఒకేచోట అందుబాటులోకి రానున్నాయి. జెండర్ రీసోర్స్ సెంటర్ ద్వారా మహిళల హక్కులు, భద్రత, సమానత్వంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వ యం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 488 కేసులు పరిష్కారం



**ప్రజాపక్షం /రామన్నపేట** : రామన్నపేట జ్యూరిస్డిక్షన్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్లో మొత్తం 488 కేసులు పరిష్కారం పొందాయి. రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.రత్నకుమారి, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.సత్తయ్య సంయుక్తంగా కోర్టు హాల్లలో జాతీయ లోక్ అదాలత్ను నిర్వహించారు.ఈ సందర్భంగా 2 సివిల్ కేసులు, 97 క్రిమినల్ కేసులు రాజీ ద్వారా పరిష్కరించబడ్డాయి. అదేవిధంగా బ్యాంకు, ప్రీలిటిగేషన్ , ఇతర పిట్టి కేసులు కూడా కక్షిదారుల పరస్పర అంగీకారంతో పరిష్కారం పొందాయి.పిట్టి కేసులలో రామన్నపేట కోర్టు జ్యూరిస్డిక్షన్లో 378 కేసులు పరిష్కరించబడినట్లు న్యాయమూర్తులు తెలిపారు. రామన్నపేట జ్యూరిస్డిక్షన్కు సంబంధించిన రామన్నపేట, వలిగొండ, మోత్కూరు, అడ్డగూడూరు సంబంధించిన పోలీస్ స్టేషన్ల పరిధిలోని వివిధ రకాల కేసులను లోక్ అదాలత్ ద్వారా వేగవంతంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించడం జరిగిందన్నారు. అలాగే బ్యాంకు ప్రీలిటిగేషన్ కేసుల ద్వారా మొత్తం రూ.6,54,583 వసూలు చేయబడినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ఎస్బీఐ బ్యాంకు మేనేజర్లు,వివిధ పోలీస్ స్టేషన్ల సిబ్బంది, కోర్టు సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు 33 శాతం రిజర్వేషన్




**ప్రజాపక్షం/బొమ్మలరామారం** : మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని జాతీయ మహిళా సమైక జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ డిమాండ్ చేశారు. మండలంలోని మైలారం గ్రామంలో మండల నిర్మాణ మహాసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మహిళాలు సామాజిక ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందడమే తమ లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, ఇండ్ల చిట్టి, సహాయ కార్యదర్శి లక్ష్మి , అన్నేమైన కమల, సిపిఐ మండల కార్యదర్శి వెంకటేశం, వడ్లకొండ భారతమ్మ రాజమ్మ స్వప్న చంద్రకళ ఇందిరా బాలమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
ఆదివారం
21-06-2026
www.prajapaksham.in

"హీరో నార్నే నితిన్ తన గత మూడు చిత్రాలతో హ్యాట్రిక్ విజయాలను అందుకుని కెరీర్‌లో దూసుకెళ్తున్నారు. ఇప్పటివరకు ఎక్కువగా యూత్‌ఫుల్, కామెడీ ఎంటర్‌టైనర్ చిత్రాలు చేసిన నార్నే నితిన్, తన ఆరవ చిత్రం కోసం బలమైన కథను ఎంచుకున్నారు."

రీల్

## 'ది ప్యారడైజ్'లో విలన్‌గా రాఘవ్ జుయాల్



నాని హీరోగా నటించగా తాజా చిత్రం 'ది ప్యారడైజ్' . దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన అద్భుతమైన విజన్‌తో 'ది ప్యారడైజ్'ను ఒక్కో అడుగు విస్తరిస్తూ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతున్నారు. టైటిల్ గ్లింప్స్, కీలక పాత్రల పరిచయాల తర్వాత తాజాగా మరో ప్రధాన పాత్రను మేకర్స్ పరిచయం చేశారు.ఈ చిత్రంలో విక్రమ్ మాలిక్ పాత్రలో నటిస్తున్న రాఘవ్ జుయాల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పాత్ర కోసం రాఘవ్ పూర్తిగా కొత్త అవతార్‌లో కనిపిస్తూ అందరినీ ఆశ్చర్య పరుస్తున్నారు. డేంజరస్, భయానకమైన వ్యక్తిత్వంతో ఉన్న పాత్రలో ఆయన ఒదిగిపోయారు. కర్లీ హెయిర్, ఆభరణాలు, రగడ లుక్, అధికారం ప్రతిబింబించే హావభావాలతో విక్రమ్ మాలిక్ పాత్రను ఎంతో పవర్‌ఫుల్‌గా ప్రజెంట్ చేశారు.ఈ పాత్ర పరిచయాన్ని తనికెళ్ల భరణి వాయిస్ ఓవర్ మరింత ఎలివేట్ చేసింది. తన తెగకు గర్వకారణంగా, స్నేహితులకు ప్రాణస్నేహితుడిగా, శత్రువులకు భయంకరమైన శక్తిగా విక్రమ్ మాలిక్‌ను పరిచయం చేశారు. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఈ పాత్రను పవర్ ఫుల్‌గా చూపించారు.గ్లింప్స్ చివర్లో నాని విక్రమ్ మాలిక్‌ను 'జడల్ జమానా' ప్రపంచంలోకి ఆహ్వానించే సన్నివేశం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ ఇద్దరి మధ్య జరిగే సంఘర్షణలు ఎలా ఉండబోతాయనే ఆసక్తిని పెంచుతోంది.నిర్మాత సుధాకర్ చెరుకూరి ఎస్ ఎల్వీ సినిమాస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ తన ఎనర్జిటిక్ స్కోర్‌తో సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నారు.ఈ చిత్రానికి చాయ్ సాయి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్‌ను అందిస్తున్నారు.

'ది ప్యారడైజ్' 2026 ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.



## బొగ్గు గనుల నేపథ్యంలో ఎన్ ఎన్ 6

హీరో నార్నే నితిన్ తన గత మూడు చిత్రాలతో హ్యాట్రిక్ విజయాలను అందుకుని కెరీర్‌లో దూసుకెళ్తున్నారు. ఇప్పటివరకు ఎక్కువగా యూత్‌ఫు, కామెడీ ఎంటర్‌టైనర్ చిత్రాలు చేసిన నార్నే నితిన్, తన ఆరవ చిత్రం కోసం బలమైన కథను ఎంచుకున్నారు. ఆయన ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. సుహాస్ బాబు దర్శకత్వంలో, రుద్రాంశ్ సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై బొమ్మక్ శివ నిర్మిస్తున్న ఈ చిత్రం బొగ్గు గనుల నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా తెరకెక్కనుంది.విస్తారమైన భూగర్భ బొగ్గు గనుల్లో చీకటి, దుమ్ము, పొగల మధ్య సాగే ప్రపంచాన్ని ఇందులో ప్రజెంట్ చేశారు. ఆ కఠిన పరిస్థితుల నడుమ నార్నే నితిన్ కనిపించే తీరు ఆసక్తిని రేకెత్తిస్తోంది.మైనర్ హెల్మెట్, వర్కర్ దుస్తుల్లో రఫ్ అండ్ రగడ లుక్‌లో కనిపించిన నార్నే నితిన్ పూర్తిగా కొత్త అవతార్‌లో ఆకట్టుకున్నారు. ఆయన కళ్లలో కనిపించే తీవ్రత, హావభావాలు, కష్టాలను ఎదుర్కొంటూ ముందుకు సాగే పాత్రను సూచిస్తున్నాయి. వందలాది మంది కార్మికుల మధ్య, ఆయన ప్రయాణం ప్రత్యేకంగా ఉండబోతుందనే సంకేతాలను వీడియో అందించింది.

# నలభై ఏళ్ల కల సాకారం

## ఇంట్లో నుంచే సినిమాకు దర్శకత్వం వహించాను

**డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు**



పుష్పక విమానం, ఆదిత్య 369 వంటి ప్రయోగాత్మక చిత్రాలను తెరకెక్కించడంలో దర్శకుడు సింగీతం శ్రీనివాస్ రావు సిద్ధ హస్తుడు. తాజాగా ఆయన సింగ్ గీతం అనే సినిమాను రుపొందించారు. నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. చెన్నైలో నివాసం ఉండే సింగీతం శ్రీనివాస్ రావు ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన నేపథ్యంలో 'ప్రజాపక్షం' ఆయన్ని పలకరించింది.

**ప్రశ్న : 'సింగ్ గీతం' చాలా ఆసక్తికరంగా వుంది. ఈ ఆలోచన ఎలా పుట్టింది ?**

**సింగీతం :** ఈ కథ సుమారు 40 ఏళ్ల క్రితం నాకు ఒక వినూత్నమైన ఆలోచన వచ్చింది. ప్రపంచంలోనే తొలిసారిగా నేను మాత్రం ప్రతి మాటను పాడుతూ చెప్పే సినిమా చేయాలని కలగన్నాను. ఆ ఆలోచన నాతోనే దాదాపు 40 ఏళ్ల పాటు ప్రయాణించింది. మద్రాస్‌లోనూ, నా ఇంట్లోనూ, ఎన్నో చోట్ల ఈ కథ నా వెంట తిరిగింది. చివరికి నాగ్ అశ్విన్ దృష్టికి వెళ్లింది. ఆయన ఈ ఆలోచనను ఎంతో ఇష్టపడి, గొప్ప అభిరుచితో ముందుకు తీసుకెళ్లారు. ఆయన సంపూర్ణ సహకారం, నమ్మకం లేకపోతే ఈ సినిమా అసలు రూపుదాల్చేది కాదు. 'సింగ్ గీతం' ప్రేక్షకుల ముందుకు రావడానికి ప్రధాన కారణం నాగ్ అశ్విన్.

**ప్రశ్న : పదేళ్ల తర్వాత మళ్లీ దర్శకత్వం వహించడం ఎలా అనిపించింది?**

**సింగీతం :** నాగ్ అశ్విన్ ఈ చిత్రానికి నేను దర్శకత్వం వహించాలని కోరారు. నాకు ఇప్పటికీ దర్శకత్వం వహించే ఉత్సాహం ఉంది. అయితే నా వయస్సు దృష్ట్యా సాంకేతిక సహకారంతో ఆన్‌లైన్‌లో సినిమా తెరకెక్కించే విధానాన్ని నాగ్ అశ్విన్ ఏర్పాటు చేశారు. నా హోమ్ థియేటర్‌లో కూర్చుని, షూటిం గ్ లొకేషన్‌లో జరుగుతున్న ప్రతిదీ ప్రత్యక్షంగా చూస్తూ నటీనటులకు సూచనలు ఇచ్చేవాడిని. అక్కడి కెమెరాలు, మానిటర్లు అన్నీ నాకు కనెక్ట్ అయ్యేవి. ఇంట్లో నుంచే మొత్తం సినిమాను దర్శకత్వం వహించాను. ఇది అద్భుతమైన మేనేజ్‌మెంట్.

**ప్రశ్న : కమల్ హాసన్, డా. రాజ్‌కుమార్, బాలకృష్ణ వంటి మహానటులతో పనిచేశారు. ఇప్పుడు కొత్తవాళ్లతో పని చేయడం ఎలా ఉంది?**

**సింగీతం :** ప్రతి నటుడికి తనదైన వ్యక్తిత్వం, ప్రత్యేకత, శైలి ఉంటాయి. బాలకృష్ణ , కమల్ హాసన్‌లా ఉండరు. కమల్ హాసన్, డా. రాజ్‌కుమార్‌లా ఉండరు. ముగ్గురూ గొప్ప నటులే కానీ వారి నటనా శైలులు భిన్నం. దర్శకుడిగా నా పని ఏమిటంటే, ప్రతి నటుడిలో ఉన్న ప్రత్యేకతను గుర్తించి, దాన్ని అత్యుత్తమంగా బయటకు తీసుకురావడం. వారి ప్రతిభను మరింత వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నించాను. అదే నా విజయానికి కారణం.

**భారతీయ సినిమాకు ఎన్నో కొత్త ప్రయోగాలు పరిచయం చేశారు. ఇవన్నీ ఎలా సాధ్యమవుతున్నాయి ?**

**సింగీతం :** అవును. కేవీ రెడ్డి వద్ద పనిచేసిన రోజుల నుంచే కొత్త ఆలోచనల పట్ల ఆసక్తి ఉండేది. 'మాయాబజార్', 'పెళ్లినాటి ప్రమాణాలు', 'శ్రీకృష్ణార్జున యుద్ధం' వంటి చిత్రాల కథా చర్చల్లో పాల్గొనేటప్పుడు ఎప్పుడూ కొత్తగా ఏదైనా చేయాలనే ఆలోచనే ఉండేది. అందుకే ప్రతి సినిమాతో కొత్త ప్రయోగం చేయాలనే తపన ఉండేది. 'మాయాబజార్' కాలం నుంచే ఆ ఆలోచనా విధానం నాలో పెరిగింది. కొత్తదనం కోసం వెతకడం, ప్రేక్షకులకు ఎప్పుడూ చూడని అనుభూతిని ఇవ్వడం నా సినీ ప్రయాణంలో ముఖ్యమైన భాగంగా మారింది. కేవలం ఒక ప్రయోగం మాత్రమే కాదు, చాలా కాలంగా నా మనసులో ఉన్న కల. సినిమాలోని ప్రతి సంభాషణను నటీనటులే పాడుతూ చెప్పే చిత్రాన్ని రూపొందించాలని ఎన్నో ఏళ్లుగా కోరుకున్నాను. ఈ ఆలోచనలో ఉన్న కొత్తదనం నన్నెంతో ఆకర్షించాయి. దాదాపు 40 ఏళ్ల క్రితమే ఈ కల కన్నాను. అయితే దాన్ని సాకారం చేసిన ఘనత మాత్రం పూర్తిగా నాగ్ అశ్విన్‌దే.

**ప్రశ్న : మీ కెరీర్‌లో మీకు అనిపించినట్లుగా తగిన గుర్తింపు పొందని సినిమా ఏదైనా ఉందా?**

**సింగీతం :** నిజానికి నేను తీసిన ప్రతి సినిమా నాకు ఇష్టమే. నేను నమ్మని సినిమా ఎప్పుడూ తీయలేదు. అయితే కొన్ని సందర్భాల్లో ప్రేక్షకులు నా ఆలోచనతో ఏకీభవించలేదు. ఉదాహరణకు నా తొలి చిత్రం 'నీతిని జాయితీ'. ఆ చిత్రాన్ని మేధావులు ఎంతో ప్రశంసించారు. విమర్శకులు, మీడియా, పత్రికలు ప్రశంసల వర్షం కురిపించాయి. కానీ బాక్సాఫీస్ వద్ద మాత్రం అది పెద్ద పరాజయం పొందింది. ప్రేక్షకులు అంగీకరించకపోతే మిగతా ప్రశంసలన్నీ వృథా అవుతాయని అప్పుడు అర్థమైంది.

**ప్రశ్న : సాంకేతిక పరిజ్ఞానం, మారుతున్న కాలంతో పాటు భారతీయ సినిమా, తెలుగు సినిమాను మీరు ఎలా చూస్తున్నారు?**

**సింగీతం :** సాంకేతికంగా చూస్తే, 'మాయాబజార్' రోజుల్లో నేను చూసిన సినిమా ప్రపంచానికి, నేటి సినిమాలకు చాలా తేడా ఉంది. టెక్నాలజీ చాలా అభివృద్ధి చెందింది. అయితే ఈ ప్రయాణంలో వ్యక్తిగత భావోద్వేగాలు, సహజత్వం కొంత మేర తగ్గిపోయాయేమో అనిపిస్తుంది. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. నేటి సినిమాల్లో సాంకేతిక అద్భుతాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద అద్భుత విజయాలు సాధిస్తున్నాయి. కానీ అవి ఎక్కువగా హీరో ఎలివేషన్‌లు, భారీ పాత్రల చుట్టూ తిరుగుతున్నాయి. ఒకప్పుడు ఉండే సహజమైన జీవితం, మనుషుల భావోద్వేగాలను ప్రతిబింబించే సినిమాలు ఇప్పుడు తక్కువగా కనిపిస్తున్నాయి.

**ప్రశ్న : 80 ఏళ్ల వయసులో యానిమేషన్ కోర్సులు నేర్చుకోవడం, 90 ఏళ్ల వయసులో మళ్లీ మ్యూజికల్ చిత్రాన్ని తెరకెక్కించడం... వయసు ఎప్పుడూ మిమ్మల్ని ఆపలేదా?**

**సింగీతం :** దానికి ఒకే ఒక సమాధానం ప్యాషన్ . కొత్తగా ఏదైనా చేయాలి, ఎవరూ చేయని పని చేయాలి, ప్రేక్షకులకు కొత్త అనుభూతి ఇవ్వాలి అనే తపనే నన్ను ఎప్పుడూ ముందుకు నడిపించింది. 'పుష్పక విమానం', 'అపూర్వ సహోదరులు', 'మైకేల్ మదన కామరాజు', 'మయూరి' నుంచి 'సింగ్ గీతం' వరకు నేను చేసిన ప్రతి ప్రయోగం వెనుక అదే ప్యాషన్ ఉంది. కొత్తదనం కోసం వెతకడం, కొత్త మార్గాలను అన్వేషించడం ఎప్పటికీ ఆగలేదు. అదే నన్ను ఇప్పటికీ సినిమాల వైపు నడిపిస్తోంది.

## 'భరతవర్ష' ఫస్ట్ సింగిల్ వీర జయధీర రిలీజ్



టి. గోపీచంద్ తాజాగా నటిస్తున్న యాక్షన్ చిత్రం 'భరతవర్ష'. సంకల్ప్ దర్శకత్వంలో, శ్రీనివాస చిట్టూరి శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రానికి పవన్ కుమార్ సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. క్రీ.శ. 642 నేపథ్యంలో సాగే ఈ చిత్రం, విజువల్ గా అద్భుతమైన గ్లింప్స్, టైటిల్ టీజర్‌తో ఇప్పటికే అందరి దృష్టిని ఆకర్షించింది. ఇప్పుడు, చిత్ర నిర్మాతలు ఫస్ట్ సింగిల్ 'వీర జయధీర' విడుదల చేశారు.'వీర జయధీర' కథానాయకుడి ప్రయాణాన్ని, అతని పరివర్తనను ఆవిష్కరించే పవర్ ఫుల్ పాట గా నిలిచింది. ఒక సాధారణ వ్యక్తి నుంచి పరాక్రమవంతమైన యోధుడిగా ఎదిగే క్రమంలో అతను ఎదుర్కొన్న కష్టాలు, పట్టుదల, లక్ష్యసాధన కోసం చేసిన పోరాటాన్ని ఈ పాట భావోద్వేగంగా చూపిస్తుంది. కథలోని ప్రధాన పాత్ర అంతర్మథనాన్ని, అతని జీవిత గమ్యాన్ని ఈ పాట అద్భుతంగా ప్రజెంట్ చేసిందిసంగీత దర్శకుడు అనుదీప్ దేవ్ ఈ పాటకు అద్భుతమైన ఆర్కెస్ట్రేషన్‌తో కూడిన సంగీతాన్ని అందించారు. చంద్రబోస్ రచించిన సాహిత్యం ధైర్యం, ఆత్మవిశ్వాసం, పట్టుదల వంటి విలువలను గొప్పగా చూపించాయి. దీపక్ బ్లూ, లక్ష్మీ మేఘన తమ వొకల్స్ తో పాటకు మరింత ప్రాణం పోశారు.ఈ పాత్ర కోసం గోపీచంద్ పూర్తిగా కొత్త అవతార్‌లో కనిపిస్తున్నారు. ఓ యోధుడి ఆత్మను తన నటనలో ఆవిష్కరిస్తూ ఆకట్టుకుంటున్నారు. హీరోయిన్‌గా రీతూ వర్మ నటిస్తుండగా, ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండనుంది. సౌందర్ రాజన్ సినిమాటోగ్రఫీతో 7వ శతాబ్దపు భారతదేశాన్ని అద్భుతంగా ఆవిష్కరిస్తుండగా, చిన్నా ప్రొడక్షన్ డిజైన్ ఆ కాలం వైభవాన్ని అత్యంత సహజంగా రీక్రియేట్ చేస్తోంది. గోపీచంద్ సరసన రితు వర్మ హీరోయిన్‌గా నటిస్తోంది.









## గుడిసెలు కూల్చివేత (మొదటి పేజీ తరువాయి)

సుమారు 350 గుడిసెలను నేలమట్టం చేశారు.ఈ సందర్భంగా అడ్డుకోబోయిన సిపిఐ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. కాగా గత ఐదు సంవత్సరాలుగా ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకొని ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగి జీవిస్తున్నామని తమను ఇప్పటికిప్పుడు బయటికి పొమ్మంటే ఎక్కడికి పోవాలని గుడిసె వాసులు కన్నీటి పర్యంతమయ్యారు. ఉదయం 5 గంటలకు ఇండ్ల కూల్చివేతను అడ్డుకున్న సిపిఐ నాయకులను, కార్యకర్తలను నిర్బంధించి అరెస్ట్ చేసి కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్ట్ అయినవారిలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, నాయకులు పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, మాలోత్ మంగ, బాలాజీ రంజిత్ లతో పాటు 40 మంది ఉన్నారు.

**చంపినా కదిలేది లేదు : రమ :** ఐదేళ్లుగా గుడిసెలు వేసుకొని ఉంటున్నాం. పిల్లలు ఇక్కడి నుంచే బడికి వెళ్తున్నారు. శుక్రవారం అధికారులు ఇక్కడికి వచ్చినప్పటికీ.. ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. శనివారం ఉదయం 4 గంటలకే ఇక్కడికి వచ్చారు. పిల్లలు ఉన్నారని చెప్పినా వినిపించుకోలేదు. మహిళలని కూడా చూడకుండా నెట్టేశారు. మమ్మల్ని ఇక్కడే చంపండి.. కదిలేది లేదు అని గుండ్ల సింగారానికి చెందిన రమ ఆవేదన వ్యక్తం చేశారు.

### మండుటెండలోనే గుడిసె వాసులు

గుండ్ల సింగారం లిక్కర్ ప్లాంట్ సమీపంలో గుడిసెలు తొలగించిన ప్రాంతంలో పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నివాసాలు కోల్పోయిన కుటుంబాలు ఎండలోనే వంటలు చేసుకున్నారు. తమకు ప్రత్యామ్నాయ నివాసం కల్పించాలని బాధితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ గుడిసెలను కూల్చి వేసినా ఆ భూమి వదలబోమని స్పష్టం చేశారు.

## దుర్మార్గపు చర్య

(మొదటి పేజీ తరువాయి)

గుడిసె వాసులు సిపిఐ నాయకులకు తమ గోడు వెళ్లబోసుకుని, చిన్న పిల్లలు, మహిళలు అని చూడకుండా తమను తమ ఇండ్ల నుండి ఈడ్చి పడేశారని తెలిపారు. అలాగే బియ్యం, ఇతర నిత్యావసరాలను రోడ్డు పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా విద్యార్థుల సర్టిఫికేట్ లను సైతం తీసుకోనివ్వకుండా పోలీసులు ఈడ్చుకొని వెళ్లారని విద్యార్థులు తెలిపారు. అనంతరం కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడుతూ హనుమకొండ గుండ్ల సింగారంలో ఇండ్లు కోల్పోయిన పేదలకు న్యాయం జరిగే వరకూ తాము అండగా ఉంటామని అన్నారు. భూకబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా స్పందించని అధికారిక యంత్రాంగం నిలువ నీడ లేని పేదలు 50 గజాల స్థలంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారిపై తెల్లారకముందే దొంగల మాదిరిగా దాడి చేయడం దుర్మమార్గమైన చర్య అన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా గుడిసెలు వేసుకున్న పేదల పై ప్రతాపం చూపుతున్నారని, దీనిపై ముఖ్యమంత్రి స్పందించి ఇలాంటి దుశ్చర్యలను నిలుపుదల చేయాలని, నిలుపుదల చేయని ఎడల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అన్నారు. ఇలాంటి దుశ్చర్యలను నిలుపుదల చేయకుంటే హనుమకొండ, వరంగల్ జిల్లాల నుండే రాష్ట్ర వ్యాప్తంగా పేదల ఇళ్ళ స్థలాల పోరాటం ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తాము ప్రభుత్వానికి మిత్ర పక్షంగా ఉన్నప్పటికీ పేదల కోసం ఇలాంటి ప్రజా వ్యతిరేక చర్యలను ఎండగడుతామని హెచ్చరించారు.వామపక్షాల ఆధ్వర్యంలో పేదల ఇళ్ళు, ఇండ్ల స్థలాలు, భూ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇండ్ల కూల్చివేతకు గురైన బాధితులతో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పేదలందరూ ఐక్యంగా నిలబడాలని, సిపిఐ పూర్తిగా అండగా ఉంటుందని చెప్పారు. ఇండ్ల పట్టాలు సాధించే వరకూ విశ్రమించేదిలేదని చెప్పారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జైలుకు అయినా వెళతాము కాని భూమిని వదిలేది లేదన్నారు. భూమి సాధించుకునే వరకు సిపిఐ మీ వెంటనే ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి, సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా, సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మేకల రవి, మండ సదాలక్ష్మి, వలీ ఉల్లాఖాద్రి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, సిపిఎం జిల్లా నాయకులు, సిపిఐ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దద్దరిల్లిన జంతర్‌మంతర్

(మొదటి పేజీ తరువాయి)

ఉండాలి', 'కేంద్ర విద్యాశాఖ మంత్రిని తొలగించండి అని రాసి ఉంది. హాజరైన వారిలో ఢిల్లీ హైకోర్టు న్యాయవాది దిల్షాద్ చౌదరి కూడా ఉన్నారు. మద్దతుదారులను ఉద్దేశించి అభిజీత్ దీప్కే మాట్లాడుతూ 'నేను అధికారులను అభ్యర్థిస్తున్నాను... దేశం నలుమూలల నుండి యువత ఇక్కడ ఉంది. మాకు న్యాయం జరిగేంత వరకు వారు ఇక్కడే కూర్చోవాలనుకుంటున్నారు. మాకు అనుమతి ఇవ్వాలని ఢిల్లీ పోలీసులను కోరుతున్నాను. నిరసన శాంతియుతంగా జరిగింది. మేము ఇక్కడ కూర్చోవాలనుకుంటున్న అమాయక విద్యార్థులం మాత్రమే' అన్నా రు. చర్చలకు మార్గం తెరిచే ఉందని, అయితే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడమే ఏకైక షరతు అని ఆ యువ నాయకుడు అన్నారు. కేంద్రంతో చర్చలు ప్రారంభించాలని ఆయన ఢిల్లీ పోలీసులను కో రారు. అరెస్టులు జరిగితే, అరెస్టును కోరుకునే మొదటి వ్యక్తిని తాను అవుతానని స్పష్టం చేశారు. పారదర్శక పరీక్షలను నిర్ధారించడంలో, అభ్యర్థుల ప్రయోజనాలను కా పాడటంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల ని తాము కోరుకుంటున్నామని ఆయన అన్నారు. నేటి వి ద్యార్థుల సమస్యలను పరిష్కరించడానికే ఇక్కడ ఉన్నాని చెప్పారు. తన పేరు బయటపెట్టవద్దని కోరిన ఒక యువ ప్రజా విధాన నిపుణుడు ఇక్కడకు రావడం చాలా ముఖ్య ం అని అన్నారు. ఇది ఎక్కడికి దారితీస్తుందో ఎవరికీ క చ్చితంగా తెలియదుదని, ఈ ఉద్యమం వ్యవస్థీకృత సమావేశాలలో కాకుండా సోషల్ మీడియాలో ప్రారంభమైంద ని, ఇది సహజంగా, ఉత్తేజకరంగా సాగిందని, అందుకే ప్రజలు దీనితో మమేకమయ్యారన్నారు. పదేపదే జరుగుతున్న పేపర్ లీక్ వివాదాలు ప్రజాగ్రహానికి ఒక కీలక మ లుపుగా మారాయని ఆయన అన్నారు.' విద్యా వ్యవస్థ ఏ ళ్లుగా సవాళ్లను ఎదుర్కొంటోంది, కానీ పదే పదే జరుగుతున్న పేపర్ లీక్‌లు దానికి కారణమయ్యాయి' అని చౌ దరి అన్నారు. ఈ నిరసనలకు వేదికను కల్పిస్తున్న వారికి మద్దతు ఇవ్వడం చాలా ముఖ్యమని చెప్పారు. మనకు మార్పు కావాలన్నారు. నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న 12 వ తరగతి విద్యార్థి మాట్లాడుతూ తాము తక్షణ ఫలితాలను ఆశించడం లేదని, కానీ తమ గళాన్ని వినిపించడం ముఖ్యమని భావిస్తున్నామని చెప్పారు. అన్ని యుద్ధాలు గెలవడానికి జరగవని, ఎవరో ఒకరు ఉన్నారని అందరికీ తెలియజేయడానికి కొన్ని జరుగుతాయని ఆ అభ్యర్థి అన్నారు. ఇక్కడికి వచ్చిన వారు రాజకీయ కారణాల కోసం రాలేదని, వీరు సమాధానాలు కోరుకుంటున్న నిరాశ చెందిన ప్రజలు ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా, నిరసనకు ముందు, విద్యార్థులు లేవనెత్తిన ఆందోళనలపై జవాబుదారీతనం నిర్ధారించాలని డిమాండ్ చేస్తూ దీప్కే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖలో బాధ్యతను నిర్ధారించడం గురించి ప్రస్తావించగా, పరీక్షలకు సంబంధించిన సమస్యలను నిర్వహించిన తీరుపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కూడా సిజెపి డిమాండ్ చేస్తోంది.

**అనుమతి నిరాకరించిన పోలీసులు :** జంతర్ మంతర్ వద్ద తమ నిరసనను కొనసాగించడానికి సిజెపికి ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. పెద్ద సంఖ్యలో నిరసన తెలుపుతన్న విద్యార్థులు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని పోలీసులు సిజెపి మద్దతుదారులను కోరారు.

## 'విజయ' పాలు

(మొదటి పేజీ తరువాయి)

బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలి. పాఠశాలలకు సరఫరా చేసే పాలకు సంబంధించిన బిల్లులను సంక్షేమ శాఖలు నేరుగా విజయ డెయిరీకే బదిలీ చేస్తాయి, దీనివల్ల రైతులకు సకాలంలో డబ్బులు అందుతా యి. తెలంగాణలో పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చేందుకు, పాల ఉత్పత్తిని పెంచేందుకు ఆధునిక పద్ధతులను అనుసరించాలి. వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ ద్వారా రైతులకు అదనపు జీవనోపాధి కల్పించడమే ప్రభుత్వ ల టక్ష్యమని చెప్పారు. ఈ సమావేశంలో పాల సేకరణ, వినియోగం మ రియు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంపై డిప్యూటీ సిఎం అధికారులు పలు సూచనలు చేశారు.





## కోట్ల నగదు (మొదటి పేజీ తరువాయి)

అనంతరం లాకర్లను తెరిచి తనిఖీ చేయగా, రూ.1.50 కోట్ల నగదు, ఒక్కోటి 100 గ్రా ముల బరువున్న 12 బంగారు బిస్కెట్లు (మొత్తం 1.2 కిలోలు), అలాగే సుమారు 2 కిలోల బంగారు, వజ్రాభరణాలు లభ్యమైనట్లు ఏసీబీ వెల్లడించింది. ఈ ఆస్తులు ఇప్పటికే గుర్తించిన అక్రమాస్తులకు అదనంగా లభించినవేనని అధికారులు తెలిపారు. మ రిన్ని ఆస్తుల వివరాలపై పరిశీలన కొనసాగుతోందని, కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని స్పష్టం చేశారు. లంచం డిమాండ్ చేసే ప్రభుత్వ ఉద్యోగులపై ఫిర్యాదులు అం దించేందుకు ప్రజలు ఎసిబి టోల్ ఫ్రీ నం బర్ 1064కు సంప్రదించాలని అధికారులు సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com